ఆదివారం
21-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 299
పేజీలు : 10, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నాల్గవ రోజుకు చేరిన పంజాబ్ రైతుల నిరసన

చండీగఢ్ : పంజాబ్‌లో రైతుల నిరసన నాల్గవ రోజుకు చేరింది. శనివారం కూడా పాటియాలా జిల్లాలోని శంభు రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలపై రైతులు బైఠాయించారు. ఈ నేపథ్యంలో అంబాలా-అమృత్‌సర్ మార్గంలో 54 రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైతుల ఆందోళన సందర్భంగా హరియానా పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు రైతులను విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా అధ్వర్యంలో బుధవారం నుంచి నిరసన చేపట్టారు. పంజాబ్, హరియానా సరిహద్దు సమీపంలోని శంభులో అంబాలా-లూథియానా-అమృత్‌సర్ మార్గంలో రైలు పట్టాలపై బైఠాయించారు. అరెస్ట్ చేసిన ముగ్గురు రైతులను విడుదల చేసే వరకు తమ నిరసన కొనసాగుతుందని రైతులు స్పష్టం చేశారు.

కూటమికి బదిలీ ఫీవర్

- సీఎస్, డీజీపీపై వరుస ఫిర్యాదులు
- అయినా పట్టించుకోని కేంద్ర ఎన్నికల సంఘం
- వీరే కొనసాగితే పోలింగ్ నిర్వహణపై నీలినీడలు
- టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల్లో ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా సాగాలంటే సీఎస్, డీజీపీని తక్షణమే బదిలీ చేయాలని కూటమి అభ్యర్థులు వరుస ఫిర్యాదులు చేస్తున్నా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించడం లేదు. బీజేపీతో ఎన్నికల పొత్తు పెట్టుకుంటే వైసీపీ అరాచకాలను అడ్డుకోవచ్చని, కేంద్ర ప్రభుత్వం తమకు అండగా నిలుస్తుందని టీడీపీ, జనసేన పార్టీ నేతలు భావించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సొంత జిల్లాకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, ఇన్‌ఛార్జ్ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, వీరిద్దరిని తక్షణమే బదిలీ చేస్తే తప్ప రాష్ట్రంలో ఎన్నికలు సక్రమంగా, సజావుగా సాగే అవకాశం లేదని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి కలిసి వేర్వేరుగా కూడా ఫిర్యాదులు చేశారు. రాష్ట్రంలో సీఈవో ముకేశ్ కుమార్ మీనాకు కూడా వారిపై ఫిర్యాదు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు అయితే వీరిద్దరితో పాటు వైసీపీకీ ఏకపక్షంగా, అనుకూలంగా పనిచేసే మొత్తం 22 మంది ఐపీఎస్ అధికారులపై ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి అందజేశారు. కనీసం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాతైనా వీరిద్దరినీ బదిలీ చేస్తారని కూటమి నేతలు ఆశతో ఎదురు చూశారు. రోజులు గడుస్తున్నా, పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నా వారిపై బదిలీ వేటు పడకపోగా, ఉన్నతాధికారులు గతంలో వలే యదేచ్ఛగా వైసీపీకి అనుకూలంగా పనిచేస్తుండడంపై కూటమి నేతల్లో తీవ్ర

ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల విజయవాడలో జరిగిన సీఎం జగన్‌పై రాయి దాడి ఘటనలో టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావుపై అక్రమ కేసు బనాయించాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారని టీడీపీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి మరో రెండు ఫిర్యాదులు చేశారు. ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని, పోలీసుల అరాచకాలను అడ్డుకోవాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ గత నెలలో చిలకలూరిపేటలో జరిగిన కూటమి ఉమ్మడి సభ నిర్వహణ సందర్భంగా జరిగిన పోలీస్ వైఫల్యాలపై సైతం సీఈసీ స్పందన నామమాత్రంగానే ఉందన్న భావన వారిలో వ్యక్తమవుతోంది. ఈ ఘటనలో కొందరు జిల్లా ఎస్పీలపై మాత్రమే సీఈసీ చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంది. అయితే డీజీపీని, సీఎస్‌ను మార్చకపోవడం వల్ల వారిస్థానంలో మరలా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించేవారినే జవహర్ రెడ్డి సిఫార్సు చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు. సీఎస్‌ను, డీజీపీని మార్చకుండా కిందిస్థాయి అధికారులను మార్చడం వల్ల ఉపయోగం లేదని కూటమి నేతలు పేర్కొంటున్నారు. మరో నాలుగు రోజుల్లో నామినేషన్ల పర్వం ముగియనుండగా, కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పరిస్థితులపై ఏమాత్రం స్పందించడం లేదన్న ఆవేదన కూటమి అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సీఎస్, డీజీపీనే కొనసాగిస్తే పోలింగ్ సక్రమంగా జరగడం కష్టమేనన్న ఆందోళన వారిలో స్పష్టంగా కనపడుతోంది. ఇదే విషయమై కూటమి అభ్యర్థులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల పొత్తులో భాగంగా బీజేపీని భౌతికంగా తాము కలుపుకున్నప్పటికీ వారి ఆత్మ వైసీపీతోనే ఉందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. బీజేపీ ఆడుతున్న డబుల్ గేమ్ వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీఎస్, డీజీపీని తక్షణమే బదిలీ చేసి, వారి స్థానంలో నిజాయితీపరులైన ఉన్నతాధికారులను నియమించి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు కోరుతున్నారు.

అంతా కాషాయమయం

- మారిన డీడీ న్యూస్ లోగో రంగు
- వివాదంలో దూరదర్శన్
- విపక్షాల తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ: విద్యతో పాటు అన్నీ కాషాయమయం చేయడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నది. అందులో భాగంగా ప్రభుత్వ ప్రసార సంస్థ 'దూరదర్శన్'ను సైతం వివాదంలోకి నెట్టింది. దూరదర్శన్‌కు చెందిన 'డీడీ న్యూస్' లోగో రంగు మార్చడమే ఈ వివాదానికి కారణమైంది. గతంలో ఈ లోగో ఎరుపు రంగులో ఉండేది. ఇటీవల దాన్ని కాషాయ (ఆరెంజ్) రంగులోకి మార్చారు. ఈ విషయాన్ని సంస్థ అధికారికంగా వెల్లడించింది. ఇందుకుగాను సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చింది. 'మా విలువలు అలాగే ఉన్నాయి. కానీ, ఇక నుంచి మేం కొత్త అవతార్‌లో అందుబాటులో ఉంటాం. కొత్త ప్రయాణానికి సిద్ధం కండి' అని ఎక్స్‌లో రాసుకొచ్చింది. ఈ లోగోను బీజేపీ జెండా రంగు అయిన కాషాయంలోకి మార్చడంపై ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించాయి. స్వయం ప్రతిపత్తి ఉన్న ప్రభుత్వ సంస్థలపై నియంత్రణ

- మిగతా 2 లో

రేపు పది పరీక్షా ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పరీక్షా ఫలితాలను సోమవారం విడుదల చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి శనివారం ఓ ప్రకటన లో తెలిపారు. విజయవాడ గేట్ వే హోటల్‌లో అదే రోజు ఉదయం 11 గంటలకు పరీక్షా ఫలితాలను పాఠశాల విద్యా కమిషనర్ సురేశ్‌కుమార్ వెల్లడిస్తారన్నారు. ఫలితాల విడుదల అనంతరం ఎస్ఎస్‌సీ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారన్నారు. మార్చి 18 నుంచి 30 వరకు టెన్త్ పరీక్షలను నిర్వహించారు. ఆరు లక్షల 16వేల మంది హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన 22 రోజుల్లోనే ఫలితాలను విద్యాశాఖ ప్రకటించనుంది.

బాబోయ్ ఎండలు
ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

2లో

మూడో రోజూ కోలాహలం
లోక్‌సభ స్థానాలకు 40, అసెంబ్లీకి 263 నామినేషన్లు

అట్టహాసంగా సీపీఐ అభ్యర్థుల నామినేషన్

తిరుపతిలో మురళి, విశాఖ పశ్చిమలో విమల, రాజంపేటలో విశ్వనాథ్ నాయక్...

భారీ ప్రదర్శనలు... కూటమి నేతల హాజరు

ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ తిరుపతి, విశాఖ పశ్చిమ, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు పి.మురళి, అత్తిలి విమల, బుక్కే విశ్వనాథ నాయక్ శనివారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు కదిలిరాగా అభ్యర్థులు ఉత్సాహంగా నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. నామినేషన్ల సందర్భంగా తిరుపతి, విశాఖ, రాజంపేటలో భారీ ప్రదర్శనలు జరిగాయి. డప్పువాయిద్యాలు, నృత్యాలు, ఆటపాటలతో కోలాహలంగా నామినేషన్ కార్యక్రమాలు జరిగాయి. తిరుపతిలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథ్‌రెడ్డి, విశాఖలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాజంపేటలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎల్ నారాయణ తదితరులు హాజరయ్యారు.

వివరాలు 2లో ▶▶

పేదలకు మంచి చేసిన నేను బచ్చానా?

దగా చేసిన నిన్ను ఏమనాలి బాబు...

అనకాపల్లి 'మేమంతా సిద్ధం' సభలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి (కసింకోట) : నేను బచ్చా అయితే ఆ బచ్చా మీద కేవలం 23 ఎమ్మెల్యేలను మాత్రమే గెలిచి ఎందుకు ఓడిపోయావ్ అంటూ 'మేమంతా సిద్ధం' సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం చంద్రబాబుకు ప్రశ్నల వర్షం కురిపించారు. అనకాపల్లి జిల్లా కసింకోట మండలం చింతపాలెం వద్ద జరిగిన ఈ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ అనకాపల్లిలో నాకు రెండు సముద్రాలు కనిపిస్తున్నాయని, ఒకటి బంగాళాఖాతం అయితే మరొకటి అనకాపల్లి 'మేమంతా సిద్ధం' సభ అని అన్నారు. ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ఈ ఎన్నికలు మన పిల్లలు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, రైతుల తలరాతను నిర్ణయించే ఎన్నికలని అన్నారు. ఐదేళ్లలో ప్రజల మనసులను గెలిచి తాము ఎన్నికలకు వెళుతుంటే, వాళ్లు కుట్రలు, పొత్తులతో ఎన్నికలకు వెళుతున్నారని, ఈ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వెరీగుడ్.. నీకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశిస్తున్నాను!



సిసోదియా బెయిల్‌పై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా ప్రధాన నిందితుడని, సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉన్నందున బెయిల్‌ను వ్యతిరేకిస్తున్నట్లు సీబీఐ న్యాయవాది రౌస్ అవెన్యూ కోర్టుకు వెల్లడించారు. దీంతో ప్రస్తుతం ఈ కేసు తీర్పును న్యాయస్థానం రిజర్వ్‌లో ఉంచింది. ఏప్రిల్ 30న తీర్పు

- మిగతా 2 లో

మెగా డీఎస్సీపైనే తొలి సంతకం

సిలికా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ సమస్య అధిగమిస్తాం

గూడూరు సభలో చంద్రబాబు

2లో

భారీ మెజార్టీతో గెలుస్తా

కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వైఎస్ షర్మిల నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. శనివారం ఉదయం ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్ వద్ద నామినేషన్ పత్రాలతో నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షర్మిల భర్త బ్రదర్ అనిల్ కుమార్, చెల్లెలు సునీతారెడ్డి, ఏపీసీసీ మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల విలేకరులతో మాట్లాడుతూ కడప ప్రజలు మంచి తీర్పు ఇస్తారని, భారీ మెజార్టీతో గెలుస్తానన్న దృఢ నమ్మకం ఉందని తెలిపారు. అనంతరం ఇడుపులపాయ నుంచి కడప నగరానికి చేరుకుని ఐటీఐ సర్కిల్ నుంచి నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. పురవీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో సునీతారెడ్డి, తులసిరెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకున్న షర్మిల తన నామినేషన్ పత్రాన్ని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.జయరామరాజుకు అందజేశారు. డీసీసీ కార్యాలయం వద్ద నిర్వహించిన బహిరంగ సభలో షర్మిల పాల్గొని ప్రసంగించారు. తన పోటీ న్యాయం కోసమేనని, ప్రజలు న్యాయం వైపున, నేరం వైపునా అని ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో వైఎస్ అవినాశ్ రెడ్డి దోషి అని సీబీఐ చెప్పిందని, సాక్ష్యాధారాలు చూపిస్తుంటే జగన్ రెడ్డి నిందితులను ఎందుకు కాపాడుతున్నారని

- మిగతా 2 లో

అవి డ్రోన్లు కాదు... మాకు ఆటబొమ్మలే

ఇజ్రాయిల్‌పై ఇరాన్ వ్యంగ్యాస్త్రాలు

తెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ వేడెక్కాయి. శుక్రవారం తెల్లవారుజామున ఇరాన్‌లోని మూడో అతి పెద్ద నగరమైన ఇస్ఫహాన్‌లో పేలుళ్లు సంభవించాయి. ఇది ఇజ్రాయిల్ ప్రతీకార దాడేనంటూ అమెరికా చెప్పగా... టెల్ అవీవ్, తెహ్రాన్ మాత్రం దీన్ని ధ్రువీకరించలేదు. తాజా పరిణామాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీర్ అబ్దుల్లాహియాన్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దాడులకు ఉపయోగించినవి తమకు ఆటబొమ్మల్లాంటివంటూ ఇజ్రాయిల్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇదే సమయంలో అవసరమైతే తమ స్పందన తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. అమెరికాలోని న్యూయార్క్ పర్యటనలో ఉన్న హుస్సేన్... అగ్రరాజ్య భద్రతా మండలి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం జరిగింది దాడే కాదు. అవి డ్రోన్లు కాదు... మా పిల్లలు ఆడుకునే ఆటబొమ్మల్లాంటివి. మా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ఎలాంటి సాహసం చేయలేదు. అందువల్ల ఇప్పుడు తాము ప్రతిచర్యకు దిగట్లేదు. కానీ ఒకవేళ ఆ దేశం తమకు నష్టం కలిగించేలా తీవ్ర నిర్ణయాలు తీసుకుంటే మాత్రం... తమ ప్రతిస్పందన చాలా వేగంగా, కఠినంగా ఉంటుంది. దానికి వాళ్లు పశ్చాత్తాపపడాల్సి ఉంటుందని నెతన్యాహు సర్కారును హెచ్చరించారు. ఇదిలా ఉండగా... ఇరాక్‌లోని ఇరాన్ మద్దతున్న స్థావరాలపై శనివారం తెల్లవారుజామున దాడులు జరిగాయి. మొత్తం ఐదు పేలుళ్లు సంభవించగా... ఈ ఘటనలో కనీసం ముగ్గురికి గాయాలైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించారు. ఈ పేలుళ్లకు కారణమేమిటనేది ఇంకా స్పష్టత రాలేదు. తాజా ఘటనతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ నెల 13న మూడు వందలకుపైగా డ్రోన్లు, క్షిపణులతో భారీస్థాయిలో ఇజ్రాయిల్‌పై విరుచుకుపడినప్పటి నుంచి ఇజ్రాయిల్ ప్రతీకారంతో రగిలిపోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌లో పేలుడు శబ్దాలు వినిపించడంతో ప్రతీకార దాడులు మొదలైనట్లు అంతా భావించారు. అయితే, ఇరాన్ మాత్రం ఖండించింది. తమ గగనతలంలో కనిపించిన అనుమానాస్పద వస్తువులను యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ తుపాకులతో నేలకూల్చామని, ఆ సందర్భంగా పేలుళ్లు జరిగాయని పేర్కొంది. ఇజ్రాయిలే దాడి చేసినట్లు అధికారికంగా ప్రకటించలేదు. అటు టెల్ అవీవ్ కూడా దీనిపై స్పందించేందుకు నిరాకరించింది.

భారీ మెజార్టీతో గెలుస్తా

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి 'ఇండియా' కూటమిని గెలిపించాలని కోరారు. సీఎం జగన్ మరోసారి విజయం సాధించాలని సింగిల్‌గా సిద్ధమై వస్తున్నానని ప్రజలకు చెబుతున్నారని, కానీ సింగిల్‌గా ఉండే సింహం ఎప్పుడూ అడవిలోనే ఉంటుందని... జగన్‌ను ప్రజలు ఒప్పుకోరని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మతోన్మాద బీజేపీ పంచన చేరారని, వారు కూడా అడ్రస్ లేకుండా పోతారని విమర్శించారు. రాయలసీమ అభివృద్ధి దిశగా పరుగులు పెట్టాలంటే షర్మిలమ్మను కడప నుంచి అత్యధిక మెజారిటీతో పార్లమెంటుకు పంపాలన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్, వామపక్షాలయిన సీపీఐ, సీపీఎం అభ్యర్థులకు ఓట్లు వేసి ఈ దుష్ట పాలనకు చరమగీతం పలకాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జి.చంద్ర, సిహెచ్ చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటశివ, ఉభయ కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న అఫ్జల్‌ఖాన్

నగర ప్రముఖుడు, వైసీపీ రాష్ట్ర నాయకుడు అఫ్జల్‌ఖాన్ ఆ పార్టీని వీడి వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీతో అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంలో ఎంతో ఉత్సాహంతో పార్టీకి పని చేశానని, తిరిగి సొంత గూటికి చేరానన్నారు. కడప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తూ వైఎస్ షర్మిల విజయం కోసం కృషి చేస్తానని వెల్లడించారు.

అంతా కాషాయమయం

(మొదటిపేజీ తరువాయి)

సాధించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని, ఇది జాతీయ ప్రసార సంస్థ విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నమేనని కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు. అటు దూరదర్శన్ మాతృక సంస్థ ప్రసారభారతి (డీడీ, ఆల్ ఇండియా రేడియో) మాజీ సీఈవో జవహర్ సిర్కార్ కూడా ఈ మార్పును తీవ్రంగా వ్యతిరేకించారు. దూరదర్శన్ తన న్యూస్ లోగోను కాషాయంలోకి మార్చిందని, ఈ నిర్ణయంతో ఇది ఇక 'ప్రసార భారతి' కాదు. 'ప్రచార భారతి' అనే భావన కలుగుతోందని మండిపడ్డారు. దీనిపై ప్రసార భారతి సీఈవో గౌరవ్ ద్వివేది స్పందిస్తూ లోగో మార్పును నిస్సిగ్గుగా సమర్థించుకున్నారు. దృశ్య సౌందర్యాన్ని మరింత పెంచేందుకే రంగు మార్చామని, దీనిపై విమర్శలు చేయడం దురదృష్టకరమని అన్నారు. 1959 సెప్టెంబరు 15న తొలిసారి దూరదర్శన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆ తర్వాత దీన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ కిందకు తీసుకురాగా... జాతీయ బ్రాడ్‌కాస్టర్‌గా మారింది. అనంతరం డీడీ నెట్‌వర్క్ కింద అనేక ఛానళ్లను తీసుకొచ్చారు. ప్రస్తుతం దూరదర్శన్‌లో ఆరు జాతీయ, 17 ప్రాంతీయ ఛానళ్లు అందుబాటులో ఉన్నాయి. గతంలో అనేకమార్లు దీని లోగో రంగులు మార్చారు. నీలం, పసుపు, ఎరుపు ఇలా అనేక రంగుల్లో కన్పించినప్పటికీ... గ్లోబ్ చుట్టూ రెండు రేకల డిజైన్ మాత్రం మారలేదు.

పాకిస్థాన్‌కు 'క్షిపణి' సాయం...

చైనా సంస్థలపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్: అంతర్జాతీయ వేదికపై అమెరికా- చైనాల ఆధిపత్య పోరు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ క్షిపణి కార్యక్రమాలకు పరికరాలు సరఫరా చేస్తున్నాయంటూ మూడు చైనా సంస్థలతోపాటు బెలారస్‌కు చెందిన ఓ కంపెనీపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది. ఈ సంస్థలు ఇస్లామాబాద్‌తో సామూహిక విధ్వంసకర ఆయుధాలతో చేపట్టే కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాయని అమెరికా విదేశాంగ ప్రతినిధి మాథ్యూమిల్లర్ తెలిపారు. అణ్వస్త్రాలు, ఆయుధ సాంకేతికత విస్తరణను అడ్డుకునే విషయానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. పాకిస్థాన్ మిత్రదేశమైన చైనా... ఆయుధాలు, రక్షణ పరికరాలను సరఫరా చేస్తూ ఆ దేశ సైనిక ఆధునికీకరణకు తోడ్పడుతోంది. అమెరికా పేర్కొన్న వివరాల ప్రకారం.. బీజింగ్‌కు చెందిన జియాన్ లాంగ్డే సంస్థ పాకిస్థాన్ దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి ఫిలమెంట్ వైండింగ్ మెషిన్ సహా క్షిపణి సంబంధిత పరికరాలను సరఫరా చేసింది. గ్రాన్‌పెక్ట్, టియాంజిన్ కంపెనీలు రాకెట్ మోటార్లను పరీక్షించే, ప్రొపెల్లెంట్ ట్యాంకుల తయారీకి వినియోగించే సామగ్రిని సమకూర్చాయి. బెలారస్‌లోని మిన్స్క్ వీల్ ట్రాక్టర్ ప్లాంట్... దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి అవసరమైన ప్రత్యేక వాహన ఛాసిస్‌లను అందజేసింది. తైవాన్‌కు ఆయుధ సాయం చేశాయన్న నెపంతో అమెరికాకు చెందిన రెండు రక్షణ సంస్థలపై బీజింగ్ ఇటీవల ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. జనరల్ అటామిక్స్ ఏరోనాటికల్ సిస్టమ్స్, జనరల్ డైనమిక్స్ ల్యాండ్ సిస్టమ్స్‌కు సంబంధించిన చైనాలోని ఆస్తులను స్తంభింపజేసింది. దీంతోపాటు ఆయా కంపెనీల మేనేజ్‌మెంట్‌ను దేశంలోకి రాకుండా అడ్డుకట్ట వేసింది.

మంచి చేసిన నేను బచ్చానా?

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధానికి మీరంతా సిద్ధమేనా... అని పిలుపునిచ్చారు. 'సిద్ధం సభలను చూసి ప్రత్యర్థులకు గుండెల్లో రైళ్లు, బస్సులు పరిగెడుతున్నాయి. చంద్రబాబు ఉక్రోశంతో నాపై రాళ్లు వేయమని చెబుతున్నారు. నన్ను దగ్ధం చేయమంటున్నారు. ఇదే దత్తపుత్రుడు, చంద్రబాబు వదినమ్మ అజెండా... జగన్ కొట్టడానికి, హాని చేయడానికి, రాష్ట్రాన్ని దోచుకోవడానికి, పంచుకోవడానికి వాళ్లకు అధికారం కావాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఈ మధ్య మాట్లాడుతూ జగన్ ఓ బచ్చా అని అన్నారు. చరిత్రలో ఓడిపోయే కాలం వచ్చినప్పుడు విలన్లందరికీ అటువైపు హీరోలందరూ బచ్చాల మాదిరిగానే కనిపిస్తారు. అయ్యా చంద్రబాబు నువ్వు బచ్చా అంటున్న నేను ప్రజలకు మంచి చేసి ఎన్నికల కోసం ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నాను. పేదలకు నువ్వు మంచి చేసుంటే ఈ బచ్చాలను చూసి భయపడుతూ పొత్తుల కోసం ఎందుకు వెంపర్లాడావు' అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏమి చేశాడో చెప్పాలన్నారు.

పేద పిల్లలకు ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియం వద్దని ఉద్యమాలు చేయించిన ఘనుడని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి లంచాలు వివక్ష లేకుండా రూ.2.70 లక్షల కోట్లను నేరుగా బటన్ నొక్కి పేదల ఖాతాల్లో వేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలు, 4 కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు వేగంగా నిర్మాణం జరుగుతున్నాయి. అలాగే 26 జిల్లాలు, 15 వేల సచివాలయాలు, నాడు-నేడు కింద స్కూళ్లు, ఆస్పత్రులు, 15 వేల రైతు భరోసా కేంద్రాలు, 3 వేలకు పైగా డిజిటల్ లైబ్రరీలను అభివృద్ధి చేశామని తెలిపారు. గ్రామాలకు ఫైబర్ గ్రిడ్, మారుమూల ప్రాంతాలకు కూడా అనుసంధానం చేస్తున్నామన్నారు. రాష్ట్రం తలసరి ఆదాయంలో 28వ స్థానం నుంచి 5వ స్థానానికి ఎగబాకిందని తెలిపారు.

ఇంటికే పౌరసేవలు, పెన్షన్, ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్నామన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు పేరు చెబితే ఒక్క మేలు కూడా గుర్తుకు రాదని, కేవలం వెన్నుపోట్లు, కుట్రలు, మోసాలు మాత్రమే గుర్తుకు వస్తాయన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జిల్లాలో పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేశారు.

సిసోదియా బెయిల్‌పై తీర్పు రిజర్వు

(మొదటిపేజీ తరువాయి)

వెలువరించనుంది. దీంతో పాటు మధ్యంతర బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్‌ను సిసోదియా ఉపసంహరించుకున్నారు. సిసోదియా బెయిల్ పిటిషన్‌ను ఈడీ సైతం వ్యతిరేకించింది. వారంలోగా సమాధానం ఇవ్వాలని కోరుతూ సీబీఐ, ఈడీకి కోర్టు గతంలో నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారం కోసం బెయిల్ పొందాలని సిసోదియా తరపున పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45లోని షరతులను సిసోదియా పాటించడం లేదని ఈడీ పేర్కొంది. నిపుణుల నివేదిక నుంచి తప్పుకున్నట్లు నటించేందుకు సిసోదియా ఈమెయిల్స్ పెట్టారని ఆరోపించింది. ఇందుకు సంబంధించి తమ వద్ద డాక్యుమెంటరీ ప్రూఫ్, వాట్సాప్ చాట్, ఈ మెయిల్ సాక్ష్యాలు ఉన్నాయని తెలిపింది.

మురళి గెలుపుతో తిరుపతి అభివృద్ధి : కూటమి నాయకులు

విశాలాంధ్ర-తిరుపతి: 'ఇండియా' కూటమి అభ్యర్థి, భారత కమ్యూనిస్టు పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి నామినేషన్ కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగింది. మురళి నామినేషన్ కార్యక్రమానికి సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, వీసీకే పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడ పార్కు నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఎయిర్ బైపాస్ మీదుగా అన్నమయ్య కూడలి వరకు సాగింది. ఈ ప్రదర్శనలో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, తిరుపతి, చిత్తూరు కళాకారులు గురప్ప, నాగరాజు, కాలయ్య, సూరి తదితరులు ఆలపించిన విప్లవ గేయాలు...ఆట పాట నగర ప్రజలను ఆకట్టుకుంది. వాయిద్యాలు వాయిస్తూ... పూలు చల్లుతూ, బాణసంచా కాలుస్తూ సాగిన ప్రదర్శన చూడటానికి రెండు కళ్లు చాలలేదు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాగంటి గోపాల్ రెడ్డి ప్రసంగించారు. కష్టజీవుల తలలో నాలుకగా ఉంటూ... నిత్యం ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేసే మురళిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కనీసం తిరుపతి వీధుల గురించి తెలియని వారు కావాలో... శ్రమజీవుల పక్షాన నిలబడే 'ఇండియా' కూటమి అభ్యర్థి మురళి కావాలో తిరుపతి వాసులే నిర్ణయించుకోవాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, వైసీపీలలో ఏ పార్టీకి ఓటు వేసినా... మోదీకి వేసినట్లేనన్నారు. 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించుకుని ఏపీ భవిష్యత్తును బాగు చేసుకోవాలని కోరారు. అనంతరం నారాయణ, మాగంటి గోపాల్‌రెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డితో కలసి మురళి తిరుపతి అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితి సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి, కార్యవర్గ సభ్యుడు రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపైనే తొలి సంతకం

విశాలాంధ్ర-గూడూరు : పేదరికం లేని ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణమే జీవిత ఆశయమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని సీఆర్ రెడ్డి కల్యాణ మండపం ప్రాంగణంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో సృష్టిస్తున్న సంపదతో జగన్‌మోహన్ రెడ్డి, కొంతమంది మాత్రమే కోట్లకు పడగలెత్తుతున్నారని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పిన జగన్ ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదన్నారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగ ఉపాధ్యాయులను మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలిచిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీ పైనే పెడతామన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.3 వేలు అందిస్తామన్నారు. ఈ ప్రాంతంలో సిలికా సంబంధిత పరిశ్రమలను నెలకొల్పి ఉద్యోగ, ఉపాధి కల్పనకు శ్రీకారం చుడతామన్నారు. ఈ ప్రాంతంలో భూగర్భ ఖనిజాలను, సిలికా, ఇసుక, చివరకు కొండలను చదును చేసేస్తూ వేల కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని, సిలికా, క్వార్ట్జ్, ఇసుక, మద్యం తయారీ, భూములపై జగన్‌దే పెత్తనమన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1,500 అందిస్తామన్నారు. ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం కింద ఒక్కో బిడ్డ చదువుకు 15 వేల రూపాయలు అందిస్తామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు బస్సులలో ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తామన్నారు. రైతు కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.25 వేలు అందిస్తామన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ అందిస్తామన్నారు. వలంటీర్లకు రూ.12 వేలు జీతం ఇస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే గూడూరును యథాతథంగా నెల్లూరు జిల్లాలోనే చేరుస్తామని ప్రకటించారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ రావు, ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబులాంటి విజన్ ఉన్న నాయకుడి అవసరం ఉందన్నారు. సైకిల్, కమలం గుర్తులకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆరుగురితో చంద్రబాబు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు భారీ కేక్ కట్ చేసి నాయకులందరికీ పంచిపెట్టారు. సీఆర్ రెడ్డి కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు నెలవల సుబ్రమణ్యం, పరసారత్నం, కురుగొండ్ల రామకృష్ణ, పనబాక కృష్ణయ్య, పాశం సంధ్యారాణి, చక్రాల ఉష, గుండాల లీలావతి, మట్టం శ్రావణి, సునీత, శ్రీదేవి, భారతి, శివ కుమార్, బీజేపీ నాయకులు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, బాలకృష్ణంనాయుడు, జనసేన నాయకులు తీగల చంద్రశేఖర్, పేటేటి చంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ్ నాయక్‌ను గెలిపిద్దాం: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి బుక్కే విశ్వనాథ నాయక్ గెలవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. విశ్వనాథ్‌నాయక్ నామినేషన్ కార్యక్రమం శనివారం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి నుండి సమద్ థియేటర్ వరకు భారీ ర్యాలీ జరిగింది. తొలుత ఈశ్వరయ్య మాట్లాడుతూ బీజేపీ, వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. మోదీ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ఇంతకాలం పాలించిన టీడీపీ, కాంగ్రెస్, వైసీపీలు రాజంపేట అభివృద్ధిపై కనీస దృష్టిపెట్టలేదని ఈశ్వరయ్య విమర్శించారు. ఒక్క పరిశ్రమ రాలేదు. రైతులకు మేలు చేసే గిడ్డంగి ఏర్పాటు చేయలేదు. యువతకు ఉపాధి కల్పించలేదు. మూతపడిన ఆల్విన్ పరిశ్రమను తెరిపించలేదు. యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు లేవు. రాజంపేటకు వచ్చిన వైద్య కళాశాలను సైతం మరో ప్రాంతానికి తరలించారు. ఏమి సాధించారని ఎన్‌డీఏ కూటమి, వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని ఈశ్వరయ్య ప్రశ్నల వర్షం కురిపించారు. రాజంపేట ఎంపీగా పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసినా ఈ ప్రాంతానికి ఏమాత్రం మేలు చేయలేదన్నారు. అలాంటి నాయకుడికి ఇక్కడ ఓట్లు అడిగే అర్హత కూడా లేదని ఆయన అన్నారు. అటు మోదీ ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి? విదేశాల్లో మూలుగుతున్న నల్లధనం వెనక్కి తెచ్చారా అని నిలదీశారు. మోదీ వచ్చాక అచ్చాదిన్ లేదు...అమృతకాలం లేదని ఎద్దేవా చేశారు. చేసిందేమీ లేక...ఓట్లు ఎలా అడగాలో తెలియక...చివరికి రాముడి పేరుతో మోదీ ఓట్లు అడుక్కుంటున్నారని ఈశ్వరయ్య విమర్శించారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఈశ్వరయ్య ఆరోపించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ప్రధాని మోదీతో జతకట్టి రాజధాని అమరావతిని సర్వనాశనం చేశారన్నారు. మోదీ, జగన్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు.

రాష్ట్ర ప్రజలు తిరస్కరించిన బీజేపీతో చంద్రబాబు జతకట్టడం ఆత్మహత్యాసదృశ్యమేనన్నారు. బీజేపీని, దానికి అంటకాగిన పార్టీలను ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి తరఫున సీపీఐ రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బుక్కే విశ్వనాథ్ నాయక్ ఎన్నికల గుర్తు కంకి కొడవలిపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎల్ నారాయణ, జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి పి.మహేశ్, సీపీఎం జిల్లా నాయకులు చిట్వేలి రవికుమార్, చంద్రశేఖర్, కూటమి నేతలు టి.రాధాకృష్ణ, ఎం.శివరామ కృష్ణదేవరా సాంబశివ, సిద్దిగల శ్రీనివాసులు, మురళి, సుధీర్, తోపు కిష్టప్ప, మనోహర్ రెడ్డి, జ్యోతి చిన్నయ్య, సుమిత్రమ్మ, కోటేశ్వరరావు, పందుగోల మనీ, ఎమ్మెస్ నాయుడు, సికిందర్, రాజశేఖర్, నాగమ్మ, కేశవ్, ప్రసాద్, శివయ్య, యాదయ్య, నాగేశ్వరరావు, నరసయ్య, సురేష్, రమణ, బాలసుబ్రమణ్యం, గాలి చంద్ర, సలీం, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించండి: జేవీఎస్‌ఎన్ మూర్తి

విశాలాంధ్ర-విశాఖ : ఎర్రజెండాల రెపరెపలు... డప్పుల హోరు... పార్టీ శ్రేణులు, ప్రజల నృత్యాల జోరు నడుమ విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా అత్తిలి విమల శనివారం నామినేషన్ దాఖలు చేశారు. పాత ఐటీఐ జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు వరకు భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. ఎండను సైతం లెక్కచేయకుండా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇండియా' కూటమి అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను వివరిస్తూ ఈ ర్యాలీ సాగింది. అనంతరం నిర్వహించిన సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీని, ఆ పార్టీకి ఊడిగం చేస్తున్న వైసీపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలను ఓడించి, 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని, ప్రజలకు ఆకలి బాధలు పెరిగాయని, దేశం దివాలా దిశగా వెళుతోందని, ప్రభుత్వరంగ సంస్థలను ధ్వంసం చేశారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ బీజేపీ పదేళ్ల పాలనలో గ్యాస్ ధర రూ.400 నుంచి 1,100లకు పెరిగిందని, ఎన్నికల ముందు 100 రూపాయలు తగ్గించి ప్రజలకు ఎంతో మేలు చేశామంటూ మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వైసీపీ అధినేత జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్రంలో ప్రధాని మోదీని రెండు భుజాలా మోస్తున్నారని విమర్శించారు. విశాఖ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పి.సత్యారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం, పోలవరం నిర్మాణం పూర్తి కావడం కోసం 'ఇండియా' కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు షీతల్ మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు కోసం 'ఇండియా' అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. సీఎంఎస్ రాష్ట్ర నాయకురాలు లలిత మాట్లాడుతూ నేడు రాజ్యాంగ మనుగడ ప్రశ్నార్థకంలో పడిందని, దాని పరిరక్షణకు 'ఇండియా' కూటమి అభ్యర్థుల గెలుపు అవశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోడిదాసు సుధాకర్, రమణబాబు, సీపీఐ విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.పైడిరాజు, బి.వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పద్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, ఉపాధ్యక్షులు కసిరెడ్డి సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ. ఆర్.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, ఎస్.కె.రెహమాన్, ఎం.మన్మధరావు, జి.రాంబాబు, సీఎన్ క్షేత్రపాల్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు, పార్టీ నాయకులు నెయ్యల నాగభూషణం, పడాల గోవింద్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీను, కార్యదర్శి యు.నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు, కార్యదర్శి వై.రాంబాబు, విశాఖపట్నం జిల్లా హాస్పటల్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి జె.డి.నాయుడు, కేజీహెచ్ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.చిరంజీవి, నెలివాడ అప్పన్న, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కె.వనజాక్షి, ఎండీ బేగం, బి.పరమేశ్వరి, సుబ్బలక్ష్మి, నాయకులు గుడాల జయ, ఎ.దేముడమ్మ, పి.పద్మ, ఎ.అన్నపూర్ణ, బి.పుష్పలత, వి.లక్ష్మి, పి.గాయత్రి, రాజన దొరబాబు, వి.కన్నబాబు, క్రాంతి, జి.గురుబాబు, ఏఐఎస్‌ఎఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం, విజయనగరం మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బి.రమణమ్మ, సీపీఎం, కాంగ్రెస్, ఆప్ నాయకులు, కార్యకర్తలు, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌ఎఫ్, ఏఐవైఎఫ్, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య, డీహెచ్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాబోయ్ ఎండలు

ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

విశాలాంధ్ర-విజయవాడ:

రాష్ట్రంలో వేసవి తాపాన్ని చూసి ప్రజలు భయపడుతున్నారు. బాబోయ్ ఎండలంటూ ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా శనివారం వడగాడ్పుల తీవ్రత బాగా పెరిగింది. ఎండకుతోడు ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. హైదరాబాద్‌లో వర్షం కురవటంతో వాతావరణ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై పడింది. వేడి ఆవిరితో ఉక్కబోత అధికమైంది. ఉదయం 10 గంటలకే భానుడు సుర్రుమనిపిస్తున్నాడు. రాష్ట్రంలో వివిధ పట్టణాల్లో పగటి ఉష్ణోగ్రతలు దాదాపు 45 డ్రిగీలకు చేరింది. ఎండల్లో విధులు నిర్వహించటం ప్రజలకు కష్టంగా మారింది. సాయంత్రం ఐదు గంటలకు మబ్బులు పట్టి వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు కొంత సేదతీరినా ... వింత వాతారణంతో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొవాల్సి వస్తుందోనని భయపడుతున్నారు. పెళ్లిళ్లు, గృహప్రవేశాలకు మంచి ముహూర్తాలు ఉండటంతో ప్రజలు బయటకు రాకతప్పని పరిస్థితి. యూనిఫాం డ్యూటీలు చేసే పోలీసులు, డ్రైవర్లు పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఎన్నికల కారణంగా ఎప్పుడు ఏ అధికారి, రాజకీయ పార్టీల నేతలు వస్తారోనని పోలీసులు రోడ్డుపైనే ఉంటున్నారు. బస్ ప్రయాణికులు వడ గాడ్పులకు నీరసించిపోతున్నారు. అభ్యర్థుల వెంట ఎన్నికల్లో ప్రచారం చేసే కార్యకర్తలు మరుసటి రోజు రావటానికి జంకుతున్నారు.

మూడో రోజూ కోలాహలం

లోక్‌సభ స్థానాలకు 40, అసెంబ్లీకి 263 నామినేషన్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో నామినేషన్ల కోలాహలం కొనసాగుతోంది. మూడో రోజు కూడా భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. పార్లమెంటు నియోజవర్గాలకు 40 నామినేషన్లు దాఖలు కాగా, అసెంబ్లీ నియోజకవర్గాలకు 263 నామినేషన్లు దాఖలు చేశారు. కడప పార్లమెంటు స్థానానికి ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అట్టహాసంగా భారీ ర్యాలీతో నామినేషన్ వేశారు. ఇదే నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా దేవిరెడ్డి శివశంకర రెడ్డి, చిన్నపురెడ్డి గోపాలకృష్ణారెడ్డిలు, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ అభ్యర్థిగా జక్కం వెంకట రమణలు కూడా నామినేషన్‌లు దాఖలు చేశారు. విశాఖపట్నం, గుంటూరు పార్లమెంటు స్థానాలకు శనివారం

అత్యధికంగా ఐదేసి నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి శుక్రవారం నామినేషన్ వేసిన టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు, శనివారం మరో నామినేషన్‌ను దాఖలు చేశారు.

పోస్టల్ బ్యాలెట్‌పై స్పష్టమైన ఆదేశాలివ్వాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల విధులకు హాజరుకాబోయే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించే అంశంపై ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీజేయాలని ఏపీ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు విజ్ఞప్తి చేసినట్టు గుర్తుచేశారు. దీంతో మే ఐదో తేదీన పోలింగ్ అధికారులు, సహాయ అధికారులకు (పీఓ, ఏపీఓలు) పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారని, అదే రోజు నీట్ పరీక్ష ఉన్నందున చాలా మంది ఉద్యోగులు వారి పిల్లలను సుదూర ప్రాంతంలోని పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లాల్సి వస్తుందని వివరించారు. దీంతో ఆ తేదీని మార్చాలని తాము కోరినట్లు పేర్కొన్నారు. వారికి శిక్షణ జరిగే ప్రాంతంలో... తహసిల్దార్‌కు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోమని సూచనలు ఇచ్చారని వివరించారు. పీఓ, ఏపీఓలు శిక్షణా కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులిచ్చినప్పటికీ రసీదు ఇవ్వడం లేదన్నారు. వారు ఓటు హక్కు ఉన్న మండలంలోనా... ఉద్యోగం చేస్తున్న మండలంలోనా... ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. చాలా చోట్ల ఒకరిపై ఒకరు చెప్పుకుంటు దరఖాస్తులు తీసుకోవడం లేదని తెలిపారు. ఒక జిల్లాలో విధులు నిర్వర్తిస్తు మరో జిల్లాలో ఓటు హక్కు కలిగిన వారికి ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో స్పష్టమైన ఆదేశాలిస్తూ, దరఖాస్తు గడువును ఈనెల 25 వరకు పొడిగించాలని, ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయవాడ పోలీసులు అభాసుపాలు

జగన్‌పై దాడి కేసులో పట్టాభిరామ్

విశాలాంధ్ర-విజయవాడ : జగన్ గులకరాయి డ్రామాకు విజయవాడ పోలీసులు సహకరించి అభాసు పాలయ్యారని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు రిపోర్టులతో అడ్డంగా దొరికిపోయారన్నారని చెప్పారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ ప్రధాన కార్యాయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ఆడిన డ్రామాను చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. నేడు ప్రధాన నిందితుడిగా చూపిస్తున్న వేముల సతీష్ మైనర్ అని తెలిసే మైనర్‌ను మేజర్ అని మార్చేందుకు నిసిగ్గుగా... ఏప్రిల్ 16న నకిలీ బర్త్ సర్టిఫికెట్ సృష్టించారని ఆరోపించారు. రిమాండ్ రిపోర్టులో పేజీకి ఒక రకంగా దాడి జరిగిన సమయాన్ని పేర్కొని విజయవాడ పోలీసులు నవ్వుల పాలయ్యారన్నారు. తాము చెబుతున్న విధంగా గులకరాయి దాడి ఘటన మొత్తం ఒక పెద్ద నాటకమని, ఈ రిమాండ్ రిపోర్టు చదివితే స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. వైసీపీ నేతలకు తొత్తులుగా పని చేస్తూ, తప్పుడు సర్టిఫికెట్‌లతో గులక రాయి డ్రామాకు సహకరిస్తూ... అమాయకులైన వడ్డెర బిడ్డలను, మైనర్‌లను బలిచేసేందుకు పని చేస్తున్న విజయవాడ సీపీ కాంతి రాణా, ఇతర అధికారులపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గులకరాయి దాడి పూర్తిగా డ్రామా అని అర్థం చేసుకున్న స్థానికులు ఎవరూ కూడా పోలీసులకు సాక్ష్యం చెప్పడానికి ముందుకు రాలేదని పట్టాభి అన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నందినేని మనోహర్ నాయుడు అనే పులివెందుల వానిని నేడు పోలీసులు సాక్షిగా హాజరు పరిచారని తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఒక బాలుడిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తుంటే... రాష్ట్రం చైల్డ్ రైట్స్ కమిషన్ నిద్ర పోతుందా అని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే ప్రజల పక్షాన పోరాడే బొండా ఉమాను ఇరికించేందుకు పోలీసులతో జగన్, వెలంపల్లి కుట్ర చేశారని, అక్రమంగా అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

మోదీ ముఠాను ఓడిద్దాం

ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు

23న గుంటూరు ఎంపీ అభ్యర్థి 'జంగాల' నామినేషన్

విశాలాంధ్ర-గుంటూరు: దేశంలో, రాష్ట్రంలో మోదీని, ఆయన ముఠాను ఓడించి... ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మతోన్మాదాన్ని పెంచి పోషించే పార్టీ బీజేపీ అని, బీజేపీ పాలనలో మహిళల రక్షణ గురించి కలలో కూడా ఊహించలేమని విమర్శించారు. ఇటువంటి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించివేయాలని ఆయన ప్రజలను కోరారు. గుంటూరులోని మల్లయ్య లింగంభవన్ వీఎస్‌కే హాలులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడారు. దేశం 18వ లోక్‌సభ ఎన్నికలకు, మన రాష్ట్రం శాసనసభ ఎన్నికలకు సమాయత్తమయ్యాయని, రాజకీయ పార్టీలన్నీ తమ వాద ప్రతివాదనలతో ఓటర్లను మెప్పించి గెలుపు కోసం ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రజల తలరాతలు రాసేది ఎమ్మెల్యేలు, ఎంపీలు అనే విషయాన్ని గ్రహించి... ప్రజలు బాధ్యతాయుతంగా లోతైన ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణతో ఒక నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాన్ని తమ వ్యాపారానికి పెట్టుబడిగా భావించే వ్యక్తులు, శక్తులు, రాజకీయ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల బాండ్ల పేరుతో మోదీ, అమిత్ షా అతిపెద్ద ఆర్థిక అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఒక ప్రముఖ కంపెనీపై ఈడీ, ఐటీ, ఇతర సంస్థలను ప్రయోగించి పది రోజులలో వందల, వేల కోట్ల ఎన్నికల బాండ్లు పొందారని ఆరోపించారు. మాటలలో మోదీ అతి పెద్ద ప్రజాస్వామ్య వాది అని...ఆచరణలో అత్యంత క్రూరమైన నియంత అని అన్నారు. బీజేపీతో బయటకు చంద్రబాబు, పవన్...లోపాయికారిగా జగన్ పొత్తు పెట్టుకున్నారని, వారు ఎప్పటికీ రాష్ట్రాన్ని బాగుచేయలేరని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు చైతన్యంతో రాష్ట్రంలో ఈ రెండు శక్తులను ఓడించాలన్నారు. గుంటూరు పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్ ఎన్నికల గుర్తు కంకి కొడవలిపై దళితులు, రైతులు, కార్మికులు, పేదలు తమ అమూల్యమైన ఓటు వేయాలని, సీపీఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ముప్పాళ్ల కోరారు.

ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా గొంతుక వినిపించే పార్లమెంటు సభ్యుడు గుంటూరు జిల్లాకు అవసరమని అన్నారు. కార్పొరేట్ శక్తులు తమకున్న ఆర్థిక బలంతో ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత అడ్రస్ లేకుండా పోతున్నారని చెప్పారు. మోదీ దెబ్బకు దగా పడిన గుంటూరు జిల్లా రాజధానిని కోల్పోయిందని, దీంతో యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సీఎం జగన్ రాజధానిని మూడు ముక్కలు చేస్తున్నా మోదీ ప్రేక్షకపాత్ర వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో ప్యాకేజీ మాస్టర్ బరిలో నిలిచారని, ధనంతో ఏమైనా చేయవచ్చని చూస్తున్నారని అన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఉరికొయ్యను ముద్దాడిన సద్దాం హుస్సేన్‌ను నిందించినప్పుడే ఆయన రాజకీయ పరిజ్ఞానం, సమాజంపై ఆయనకున్న అవగాహన గురించి అర్థమౌతోందని అన్నారు. ఆయన ఏ వర్గానికి చెందిన వ్యక్తో ఇప్పటికే ప్రజలకు అర్థమైందని అన్నారు. ప్రజల కోసం పనిచేసే...ప్రజల చెంత ఉండే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని జంగాల సూచించారు. ఈ నెల 23వ తేదీన తాను నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, ఇండియా కూటమి నాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ జంగాల అజయ్‌కుమార్ నామినేషన్ సందర్భంగా 23న ఉదయం 10 గంటలకు గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొండా ఉమాపై చర్యలు తీసుకోవాలి: వెలంపల్లి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలీసు అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్న టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరరావుపై తక్షణమే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ కోరారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం జగన్‌పై రాయి దాడి ఘటనలో బొండా ప్రవర్తన చూస్తుంటే తప్పుచేసినట్లుగా కనిపిస్తోందన్నారు. దొంగచాటున ఎందుకు నామినేషన్ వేశారో చెప్పాలని నిలదీశారు. నామినేషన్‌కు కొడుకు తప్ప ఎవరూ వచ్చిన దాఖలాలు లేవన్నారు. తనను పోలీసులు అరెస్టు చేస్తారంటూ తనకు తానే సమాచారం పంపుకున్నారని ఎద్దేవా చేశారు. సీఎంపై బొండా అనుచరులు చేసిన దాడిపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. వేముల దుర్గారావు సొంతమనిషని బొండా ఉమానే చెప్పాడని, సీఎంపై రాయి వేశారని ఒప్పుకున్నాడని, ఇంతకంటే ఆధారాలు ఏం కావాలని అని అన్నారు. ఈ ఎన్నికల్లో ఆయనకు డిపాజిట్లు రావని జోశ్యం చెప్పారు. ఈనెల 22న వైసీపీ విజయవాడ సెంట్రల్ అభ్యర్థిగా తాను నామినేషన్ వేస్తున్నట్లు వెలంపల్లి స్పష్టం చేశారు.

టీడీపీవి హత్యా రాజకీయాలు: వాసిరెడ్డి పద్మ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే హత్యా రాజకీయాలు, దౌర్జన్యపూరిత సంఘటనలకు పాల్పడుతోందని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. ఎన్నికల తేదీ దగ్గర పడే కొద్ది చంద్రబాబు, లోకేశ్, ఆ పార్టీ నేతల్లో ఫ్రస్టేషన్ పెరిగిపోయిందని, అందుకే హింసకు పాల్పడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్‌పై విజయవాడలో హత్యాయత్నానికి పాల్పడ్డారని, పోలీసుల దర్యాప్తులో టీడీపీ నేతల పేర్లు వెలుగు చూస్తున్నాయని గుర్తుచేశారు. తాడేపల్లిలో వైసీపీ క్రియాశీలక కార్యకర్త వెంకటరెడ్డిని టీడీపీ నేతలు వాహనంతో గుద్దించి చంపేశారని ఆరోపించారు. ఒంగోలు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో వైసీపీ నేతలు, సానుభూతిపరులపై దాడులు చూస్తుంటే ఏ రకమైన ఎజెండాతో వెళ్తున్నారో అర్థమవుతుందని చెప్పారు. చంద్రబాబు ఇటీవల జగన్‌పై రాళ్లతో కొట్టండని, మాడి మసైపోవాలంటూ ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టేవిధంగా ప్రసంగాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లోకేశ్ దాడులను ప్రోత్సహించేవిధంగా విద్వేషపూరితంగా మాట్లాడుతున్నారని, ఎవరిపైన ఎన్నికేసులు పెట్టించుకుంటే వారికి తాను ప్రాధాన్యత ఇస్తానంటూ మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు.

బీరువా... మంచం వెనుక...!

విశాలాంధ్ర-తిరుపతి: ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ నాయకులు, పార్టీల అభ్యర్థులు నానారకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రజల మద్దతు లేకున్నా ప్రజాసేవ పేరిట ఓట్లను పోగేసుకునేందుకు... ఎన్నికల సంఘం కంటబడకుండా డబ్బు, వస్తువులను ముట్టచెప్పేందుకు ముమ్మరంగా కార్యక్రమాలు చేపడతారు. ఇదే ఇప్పుడు తిరుపతి జిల్లాలో ఆసక్తికరంగా, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు ఆయుధంగా మారింది. తిరుపతి జిల్లాలో ఓ నేత కొన్ని సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. వాటిలో కూడా స్వాహా చేయడం ఆయన ప్రత్యేకత. అందులో ఆయన ఘనపాటి. తన నియోజకవర్గంలో ఒక వర్గానికి చెందిన వారికి వివాహాలు జరుగుతుంటే బీరువా, మంచం, పరుపు ఇవ్వడం అలవాటుగా పెట్టుకున్నారు. అదేదో ఆయన ఉచితంగా ఇస్తున్నట్లు అందరూ భావిస్తుంటారు. అయితే దాని వెనుక పెద్ద స్వాహా కార్యక్రమం ఉందనే విషయం కొందరికి మాత్రమే తెలుసు. వివాహం చేసుకొనే అమ్మాయి, అబ్బాయిల ఫొటోలను, వారి ఆధార్ కార్డులను సేకరిస్తారు. వివాహం సందర్భంగా వారికి బీరువా, పరుపు, మంచం అందజేసి ఫొటో తీసుకుంటారు. వాటిని ప్రచారానికి వాడుకుంటారు. అమ్మాయి, అబ్బాయి ఫొటోలు, ఆధార్ కార్డులను సంబంధిత మండలం రెవెన్యూ కార్యాలయాలకు పంపి... వారి పేర్లతో ఇంటి పట్టాలను సృష్టించి వాటిని తన అనుచరుల ద్వారా విక్రయాలు చేయించి రూ.లక్షలు స్వాహా చేస్తుంటారు. బీరువా, మంచం, పరుపు విలువ రూ.25 వేలు ఉంటుంది. ఒక్కో స్థలాన్ని రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ప్రచారంలో మాత్రం మేనమామ సాయమంటూ చెబుతుంటారు. రాష్ట్రంలో ఎవరూ ఎక్కడ ఇవ్వడం లేదని, తానే ఇస్తున్నానని బిల్డప్ ఇచ్చుకుంటారు. ఇది బీరువా మంచం వెనుక ఉండే అసలు కథండీ.

కమ్యూనిస్టులను గెలిపించండి

సమస్యల పరిష్కారానికి నేతల భరోసా

ప్రచారంలో 'ఇండియా' అభ్యర్థులకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలంటే పోరాట యోధులైన కమ్యూని స్టులకు ఓటేసి గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామమోహనరావు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నగరంలోని 16వ డివిజన్ అరుంధతి పేట నుంచి ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, సీపీఐ అసెంబ్లీ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని భరోసా కల్పించారు. ఆయా సెంటర్లలో ప్రజాసంఘాల నేతలు, ప్రజలు ఇండియా కూటమి అభ్యర్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వ పాలనలో రాజ్యాం గం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. విమానాశ్రయాలు, పోర్టులు, పరిశ్రమలు, ఇతర దేశ సంపద మొత్తాన్ని అదానీ, అంబానీలకు కారుచౌకగా కట్టబెడు తోందని ఆరోపించారు. కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకొస్తే దానికి ప్రత్యక్షంగా మద్దతిస్తున్న టీడీపీని, పరోక్షంగా మద్దతిస్తున్న వైసీపీని మింగేస్తుందన్నారు. త్యాగాల చరిత్ర కలిగిన కమ్యూనిస్టులను గెలిపించాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల మధ్య ఉండే వెంకటేశ్వరరావు కంకి కొడవలి, లావణ్య హస్తం గుర్తులపై ఓట్లు వేసి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

లావణ్య మాట్లాడుతూ తనను పార్లమెంటుకు పంపితే ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తనను చట్ట సభకు పంపితే ఇళ్ల స్థలాల సమస్య, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మురికివాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ల ప్రసాద్, కొల్లూరి సుధారాణి, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, తెర్లాపు శ్రీను, మావూరి విజయ, గొర్లి స్వాతి, లక్ష్మి, రవి, కొండేటి రాంబాబు, మేరీ, విక్రమ్, కేశవ, భవాని, సీపీఎం నగర కార్యదర్శి పీ కిషోర్, జగన్నాథం, ఇస్సాకు, శారద, దండు బోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నన్ను ఆదరించండి

హోసూరు, బురుజులలో సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య ప్రచారం

విశాలాంధ్ర-పత్తికొండ: ఇండియా కూటమి తరపున సీపీఐ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థిగా బలపరిచిన తనను ఆదరించి చట్టసభలకు పంపాలని పి. రామచంద్రయ్య ఓటర్లను అభ్యర్థించారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరు, మద్దికేర మండలం బురుజుల గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలను కలుసుకొని ఓట్లు అభ్యర్థించారు. పేద వర్గాల నుంచి వచ్చిన తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. చట్టసభల్లో రైతులు, కష్టజీవులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన గుర్తు కంకి కొడవలి, కాంగ్రెస్ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్ హస్తం గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, జిల్లా సమితి సభ్యుడు కారన్న పాల్గొన్నారు.

మే 1నే పింఛన్ ఇవ్వాలి : దేవినేని ఉమా డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మే 1నే పింఛన్లు ఇంటింటికీ పంపిణీ చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. టీడీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సెర్ప్ సీఈఓ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్ణయాలతో గత నెలలో పింఛన్‌దారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారని ఉమా చెప్పారు. ముఖ్యమంత్రి మాటల్లోనే 60 మంది చనిపోయినట్లు చెప్పారు. వారి మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారో సమాధానం చెప్పాలని ఉమా డిమాండ్ చేశారు. మార్చి చివరి వారంలో రూ.14 వేల కోట్లు వైసీపీ అస్మదీయ కాంట్రాక్టర్లకు చెల్లించడంతో ఏప్రిల్‌లో పింఛన్ల పంపిణీకి డబ్బులు లేకుండా పోయాయని, దీనివలనే పింఛన్ల కోసం వృద్ధులు ఎండలో అవస్థలు పడి వడ దెబ్బతో ప్రాణాలు కోల్పోయారన్నారు. గతంలో జరిగిన తప్పు మళ్లీ జరగకుండా పింఛన్‌దారులకు డబ్బులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పింఛన్ల పంపిణీపై వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇచ్చేలా చేయాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారిని కలిసి కోరుతామని దేవినేని తెలిపారు.

ఏఎన్‌యూ ఐసెట్ ద్వారా 8 కోర్సులకు ప్రవేశాలు

విశాలాంధ్ర-మంగళగిరి: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించే ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏఎన్‌యు ఐసెట్-2024) ద్వారా ఎనిమిది రకాల కోర్సులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. ఏఎన్‌యూ ఐసెట్ -2024 నోటిఫికేషన్ వివరాలను శనివారం ఆమె వెల్లడించారు. ఒక్క అర్హత పరీక్షతో ఎనిమిది రకాల కోర్సుల్లో నచ్చిన కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ మేనేజ్‌మెంట్ విభాగాలకు ప్రత్యేకత ఉందని, ఈ కోర్సుల్లో ప్రతి ఏడాది ప్రవేశాలు గణనీయంగా పెరుగుతున్నాయని వివరించారు. అన్ని కోర్సులకు అధిక ప్రాధాన్యత ఉందని, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వీటిల్లోని కోర్సులకు 100 శాతం అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు పలు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందారని తెలిపారు. ఎంబీఏ జనరల్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్, ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఎంబీఏ టూరిజం ట్రావెల్ మేనేజ్‌మెంట్, ఎంబీఏ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఎంసీఏ కోర్సుల్లో ఐసెట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారని వివరించారు. అభ్యర్థులు మే తొమ్మిదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.750 అపరాధ రుసుంతో 19వ తేదీ వరకు, రూ.1000 అపరాధంతో 26వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. వివరాలకు www.anu.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి వర్సిటీకి సమర్పించాలని డాక్టర్ అనిత తెలిపారు. సందేహాలు ఉంటే అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

సీనియర్ కమ్యూనిస్టు మరీదు చిట్టెమ్మ మృతి

కేవీవీ ప్రసాద్ తదితరుల నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణా జిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు మరీదు చిట్టెమ్మ (90) శనివారం తన స్వగృహంలో మరణించారు. ఆమెకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త శివరామకృష్ణ, పెద్ద కుమారుడు గతంలోనే మరణించారు. కంకిపాడు నియోజకవర్గం పెనమలూరు ప్రాంతంలో సీపీఐలో కీలక పాత్ర పోషించారు. పార్టీ బలంగా ఉన్న రోజుల్లో అమరులు మైనేని లక్ష్మణస్వామి, మండవ వెంకట నారాయణ వంటి వారితో కలిసి శివరామయ్య దంపతులు అంకితభావంతో పార్టీ కోసం పనిచేశారు. పార్టీతో పాటు గ్రామాల్లో రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారు. కుటుంబం మొత్తం కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైంది. ఆమె భౌతికకాయాన్ని సీపీఐ, సీపీఎం నాయకులు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వెలగపూడి ఆజాద్ ఎర్రజెండా కప్పి పూల దండలు వేశారు. సీపీఐ రాష్ట్ర నాయకులు పి.జమలయ్య, కృష్ణాజిల్లా కార్యదర్శి టి.తాతయ్య, మాజీ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, నాయకులు వీరా బత్తిన బాలస్వామి, పోతురాజు నాగేశ్వరరావు, గాలంకి వసంతరావు, మోతుకూరి అరుణ కుమార్, తాతినేని రమేశ్, యు. త్రిమూర్తులు తదితరులు నివాళులు అర్పించారు.



అనుభవశాలి చంద్రబాబు

పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మోదీ, పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో సహా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. 'ఎక్స్' వేదిక చంద్రబాబుకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు చెప్పారు. అనుభవజ్ఞుడైన నాయకుడు, నిరంతరం ఆంధ్ర ప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి అంకితమైన నేత అని కొనియాడారు. సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. రాజకీయంగా, పరిపాలనా పరంగా చంద్రబాబు అనుభవజ్ఞులని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొనియాడారు. అహర్నిశలు ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజా సంక్షేమం కోసం పాటుపడే చంద్రబాబునాయుడికి జన్మదిన శుభాకాంక్షలు అని చిరంజీవి 'ఎక్స్' లో పోస్టు చేశారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

టీడీపీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు

టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు భారీ కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ రాజకీయ రంగంలో సుస్పష్టమైన ప్రణాళిక, దార్శనికత, ముందుచూపు కలిగిన అతి కొద్ది మంది నాయకుల్లో చంద్రబాబు నాయుడు ఒకరు అని కొనియాడారు. విజన్ 2020 పేరుతో నేడు రెండు తెలుగు రాష్ట్రాలు సాధించబోయే అభివృద్ధికి ఏనాడో బీజాలు వేసిన రాజకీయ మేధావి అని, ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు చేసిన కృషిని, సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మండలి మాజీ చైర్మన్ ఎం.ఎ.షరీఫ్, మాజీ ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్ బాబు, ఎ.ఎస్.రామకృష్ణ, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి టీడీపీ నాయకులు నాదెండ్ల బ్రహ్మం, సయ్యద్ రఫీ, మన్నవ సుబ్బారావు, గురుమూర్తి, దారపనేని నరేంద్రబాబు, ఎ.వి.రమణ, పాతర్ల రమేష్, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-విశాఖ సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఎడ్‌సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కన్వీనర్ ఆచార్య టి.వి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మే 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. రూ.1,000 అపరాధ రుసుముతో మే 19 వరకు, రూ.2 వేల అపరాధ రుసుముతో మే 21వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. జూన్ 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 36 కేంద్రాలలో పరీక్షను నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని, దరఖాస్తు చేసిన విద్యార్థులు మే 30వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు రుసుముగా ఓసీ విద్యార్థులు రూ.600, బీసీ విద్యార్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.450 చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు https://cets.apsche.ap.gov.in/EDCET వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

సంపాదకీయం

ఆరిపోయే దీపం

శుక్రవారం 102 లోక్‌సభ స్థానాలకు జరిగిన పోలింగ్ సరళినిబట్టి బీజేపీకి నష్టం తప్పదని అనేకమంది విశ్లేషకులు భావించారు. అయితే ఇవన్నీ అంచనాలే తప్ప కనీసం ఎగ్జిట్ పోల్ ఫలితాలైనా కావు. ఎగ్జిట్ పోల్ ఫలితాలు జూన్ ఒకటవ తేదీన కాని రావు. తనకు తిరుగులేదు అన్న రీతిలో ప్రవర్తించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈ విశ్లేషణలు గాబరా పెడ్తున్నట్టున్నాయి. ఇవి వాస్తవం కాబోతున్నాయని ఆయనలో భయం గూడుకట్టుకున్నట్టు ఉంది. అందుకే దేశంలోనూ, ఇతర దేశాలలోని కొందరు పెద్దలు, కొన్ని శక్తిమంతమైన శక్తులు తనను పదవిలో నుంచి తొలగించాలని ప్రయత్నిస్తున్నాయని మోదీ గద్గద స్వరంతో అంటున్నారు. "ఇస్ బార్ చార్ సౌ పార్" అన్న నినాదంలోని డొల్లతనం ఏమిటో మోదీకి తెలియకుండా ఉండదు. ఓటమి భయం ఆయనను పీడిస్తోంది. ఎన్నికల ప్రచార ఘట్టం ప్రారంభం కావడానికి కనీసం రెండు నెలల ముందు నుంచే మోదీ ప్రతిపక్షాల మీద దుమ్మెత్తి పోయడం ప్రారంభించారు. నిజానికి ఈ దూషణలు ఆయన అనునిత్యం కొనసాగిస్తూనే ఉంటారు. తనను తాను విశ్వగురువును అని చెప్పుకునే మోదీకి ఇతర దేశాల్లో వ్యతిరేకులు ఎవరుంటారు గనక. తన కారణంగా అంతర్జాతీయ యవనిక మీద భారత్ కీర్తి దేదీప్యమానంగా వెలిగిపోతోంది అని ఇంతవరకు చేసుకున్న ప్రచారం కూడా బూటకమేనేమో! అయితే ఆయన ఆశలన్నీ మహిళల ఓట్ల మీదే ఉన్నట్టున్నాయి. మహిళా సంక్షేమం కోసం తన ప్రభుత్వం చేసిన కృషివల్ల మహిళల మద్దతు సమకూరుతుందని ఆయన ఆశిస్తున్నారు. మహిళలు తనను ఆదుకుంటారని చెప్పడం అంటే పురుషుల్లో తన మీద వ్యతిరేకత పేరుకు పోయిందనుకోవాలి కాబోలు. "నారీ శక్తి, మాతృ శక్తి తనకు రక్షణ కవచంగా పనిచేస్తుందని ఆయన ఊహిస్తున్నారు. ఆ రక్షణ కవచం భరోసాతోనే సవాళ్లను ఎదుర్కొంటున్నానని మోదీ చెప్తున్నారు. తల్లులకు, అక్క చెల్లెళ్లకు, కూతుర్లకు సేవ చేయడం, వారిని సం రక్షించడమే తన ప్రాధాన్యత అని కూడా మోదీ అన్నారు. లక్షాధికారి అక్క చెల్లెళ్ల వంటి కార్యక్రమాలవల్ల, స్వయం సహాయక బృందాలకు అందించిన సహకారంవల్ల మహిళల మద్దతు తనకే ఉంటుందని మోదీ నమ్ముతున్నట్టుంది. స్వయం సహకార బృందాలు మోదీ జాతీయ రంగం మీదకు రాక ముందునుంచే అమలులో ఉన్నాయి. ఇలాంటి పథకాలు మోదీ కనిపెట్టినవేం కావు. పదేళ్ల మోదీ పాలనలో జరిగిందల్లా పాత పథకాలకు కొత్త పేర్లు పెట్టడం. అనువైన చోట వాటికి కాషాయ రంగు పులమడం. మహిళల రక్షకుడినంటున్న మోదీ హయాంలోనే హత్రాస్ లాంటి సంఘటనలు జరిగాయి. అప్పుడు మోదీ రక్షణ కవచం చిలక్కొయ్యకు తగిలించారా? లేక ఆ రక్షణ కవచం ఒక మతం వారికే వర్తిస్తుందా? మోదీ హయాంలో, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ ఏలుబడిలో మహిళల మీద అనేక అత్యాచారాలు జరిగాయి. ఈ అత్యాచారాలకు గురైనవారిలో హిందూ మహిళలూ ఉన్నారు. అప్పుడు ఈ రక్షణ కవచం ఎందుకు పనిచేయలేదు. శుక్రవారం జరిగిన తొలి విడత పోలింగ్ ఎన్.డి.ఎ.కు అనుకూలంగా ఉందని కూడా మోదీ ఆత్మ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఆరు దశల పోలింగ్ జరగవలసి ఉంది కనక బీజేపీ, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల్లో ఉత్సాహం మిగల్చడానికి ఇలాంటి గంభీరమైన ప్రకటనలు అవసరమవుతాయి. అవి వాస్తవాలు కానక్కర్లేదు. యథావిధిగా ఆయన "ఇండియా" ఐక్య సంఘటన మీద విషవమనం కొనసాగించారు. ఈ ఐక్య సంఘటనకు నాయకుడే లేడు, ఒక భవిష్యత్ దృష్టే లేదు, ఆ పార్టీల చరిత్ర అంతా కుంభకోణాల చరిత్రే అని మోదీ చెప్పిన మాటే చెప్తున్నారు. "ఇండియా" ఐక్య సంఘటనకు నాయకుడు ఇప్పుడు కనిపించకపోవచ్చు. అయినా ఎన్నికల సమరాంగణంలో నిర్దిష్టమైన నాయకుడు కనిపించక పోవచ్చు. ఎమర్జెన్సీ తరవాత 1977లో జరిగిన ఎన్నికలలో కొన్ని ప్రతిపక్షాలు కలిసి జనతాపార్టీ ఏర్పాటు చేసినా ఆ పార్టీకి అధ్యక్ష స్థానంలో ఎవరున్నా ఆ వ్యక్తి భవిష్యత్ ప్రధాని అని ఎవరూ భావించలేదు. చివరకు మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రి అయ్యారు. విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ నాయకత్వంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు కానీ, మన్‌మోహన్ సింగ్ ప్రధాని అయినప్పుడు కానీ ఎన్నికలకు ముందే వారు ప్రధానులు అవుతారని ఎవరూ ప్రకటించలేదు. ఊహించలేదు. కానీ అన్ని సందర్భాలలోనూ పరిస్థితులనుబట్టి నాయకులు అవతరించారు.

భవిష్యత్ దృష్టి తనకు మాత్రమే ఉందని మోదీ భ్రమల్లో జీవిస్తుంటారు. అందుకే 2047 నాటి భారత రాజకీయ చిత్రపటం గీసి చూపించడానికి ప్రయత్నిస్తుంటారు. మరో వెయ్యేళ్లకు దేశం ఎలా ఉండబోతోందో రూపుకట్టించడానికి తపన పడ్తుంటారు. "ఇండియా" ఐక్య సంఘటనలో భాగస్వామ్య పక్షాలన్నీ కుంభకోణాలలో మునిగి పోయినవేనని మోదీ అంటున్నారు. మోదీ హయాంలోనే జరిగిన అనేక కుంభకోణాలను జాతీయ భద్రత పేర గంప కింద కమ్మిన వ్యక్తినుంచి ఇంతకన్నా భిన్నమైన మాటలు ఊహించలేం. రాఫేల్ కుంభకోణంతో పోలిస్తే బోఫోర్స్ కుంభకోణం పిపీలికంతో సమానం. ఆ కుంభకోణం కారణంగా రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఎన్నికలలో ఘోర పరాజయం పాలైంది. దర్యాప్తు కొనసాగింది. మన్‌మోహన్ సింగ్ హయాంలో 2జీ కుంభకోణంపైనా దర్యాప్తు జరిగింది. అప్పుడు ఏ ప్రధానమంత్రి దేశ భద్రత ముసుగులో దర్యాప్తుకు వెనుకాడలేదు. అన్ని ప్రభుత్వాల ఏలుబడిలోనూ ఏదో ఓ కుంభకోణం జరిగిన ఉదంతాలు ఉన్నాయి. తేడా ఏమిటంటే అప్పుడు ప్రభుత్వాలు దర్యాప్తుకు తల వంచేవి. కొన్ని సందర్భాలలో బాధ్యులనుకున్న వారు రాజీనామా చేయ్యవలసి వచ్చింది. ఈ ధోరణి మెచ్చనప్పుడు ప్రజలు ఆ ప్రభుత్వాలను గద్దె దించారు. దర్యాప్తుకు మోదీ ప్రభుత్వం సిద్ధపడిన సందర్భమే లేదు. ఇక మిగిలింది ప్రజల నిర్ణయం. మోదీ హయాంలో నిరుద్యోగం, ధరలు పెరిగిపోయాయి. ధరల భారానికి ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. అధికార స్థానాలలో ఉన్నవారు ఎవరూ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పరు. ప్రతి విమర్శలు చేస్తుంటారు. అసలు ప్రశ్నల నుంచి, సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించడానికి ఎన్ని ఎత్తులైనా ఎత్తుతారు. నిరుద్యోగానికి, ఇతర అంశాలకు సంబంధించి ప్రభుత్వ సంస్థలు చేసిన సర్వేల నివేదికలనే మోదీ ప్రభుత్వం తొక్కి పెడ్తుంది. అసత్య ప్రచారం చేయడం తప్ప నిజాలు చెప్పడం ఈ ప్రభుత్వానికి అలవాటులేని వ్యవహారం. ఓటమి భయం మోదీని అమితంగా వెంటాడుతున్నందువల్లే మోదీ విమర్శల్లో లేని గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల సర్వేలను అక్షర సత్యంగా భావించనక్కర్లేదు కానీ బీజేపీ స్వయంగా చేయించిన సర్వేలోనే బీజేపీకి 180 స్థానాలకు మించి రావన్న సమాచారం ఉంది. వాస్తవాలను విస్మరించి ఇతరుల మీద నిందలు వేయడం, శక్తిమంతులైన వారు తనను అధికారం నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పడం సానుభూతి సంపాదించడానికి కూడా పనికి రాకపోవచ్చు. కొడిగడ్తున్న దీపానికి అంత్య దశలో వెలుగు ఎంత ఎక్కువైనా ఆ దీపం ఆరిపోక తప్పదు.

వికసిత భారతం.. విద్వేష సంకల్పం

సవ్యసాచి

కాలం కాని కాలంలో కారు మబ్బులు. ఇవి నీటి మబ్బులు కావు. ఎన్నికల మేనిఫెస్టోల మాయ మబ్బులు. ఈ మేఘాల మేనిఫెస్టోలనిండా వాన చినుకులలాంటి వాగ్దానాల విత్తనాలుంటాయి. దేశం కోసం కొన్ని, భవిష్యత్ కోసం కొన్ని, వృద్ధుల కోసం, యువకుల కోసం, పేదల కోసం, మహిళల కోసం ఇలా వాగ్దానాల విత్తనాలు. కొన్ని మొలకెత్తని విత్తనాలు, కొన్ని మురిగిపోయే విత్తనాలు. ఒకటి అరా మొలకెత్తితే వాటి పంట మనది కావచ్చు. కాకపోవచ్చు. ప్రజలకు ఎన్నికల వాగ్దానాల మీద నమ్మకం తగ్గింది. అందుకే మోదీ గ్యారంటీల మోత మోగిస్తున్నారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేసింది. బీజేపీ 'సంకల్ప' పత్రం పేరు లోపలి పేజీలకు జారుకుంది. మోదీ గ్యారంటీలకు ముఖపత్రం దక్కింది.

వస్తుమయ ప్రపంచంలో సరుకును మించిన ప్యాకింగ్ షోకులు వుంటాయి. బీజేపీ మేనిఫెస్టోలో అలాంటి మెరుపులే కనిపిస్తాయి.. ప్రతి గ్యారంటీని మోదీ ఫొటో షూట్ చిత్రంతో అలంకరించారు. కోడె దూడలతో మోదీ, కుర్రకారుతో మోదీ, దేశ రక్షకుడిగా మోదీ.. ఇలా మోదీ రకరకాల పోజుల మీద మోజున్న వాళ్లు ఒక ఫొటో ఆల్బమ్ తయారు చేసుకుని ఇనప్పెట్టెలో దాచుకోవచ్చు. మోదీకి అపజయాలుండవు. అన్ని విజయాలే. ఆయన గ్యారంటీలలో అతిశయోక్తులుంటాయి.

అసత్యాలుంటాయి. అక్కడక్కడా మాత్రమే అర్ధసత్యాలు, పావు సత్యాలు వుంటాయి. దేశం ఆర్థికంగా దూసుకు పోతుందంటారు. జీడీపీలో మనం బ్రిటన్‌ను దాటి ప్రపంచ దేశాలలో 5వ స్థానంలో వున్నామంటారు.

బ్రిటన్ ఎంత దాని జనాభా ఎంత ? దాని జీడీపీతో పోల్చుకొని సంబరపడడం ఆర్థిక విజ్ఞానం మాత్రం కాదు. జీడీపీ లెక్కలకీ దేశ జనాభాకీ లంకె వుంది. దానికీ ప్రజల తలసరి ఆదాయానికి లంకె వుంది. జీడీపీ వాస్తవ స్థితిని తలసరి ఆదాయం బట్టబయలు చేస్తుంది. బ్రిటన్ జీడీపీని దాటినా వారి తలసరి ఆదాయం 45000 డాలర్లు కాగా, మన తలసరి ఆదాయం 2300 డాలర్లే. తలసరి ఆదాయంలో మనం ప్రపంచంలో 136వ స్థానంలో ఉన్నాం. అందుకే రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు జీడీపీలో ప్రపంచంలో 3వ స్థానం ఆక్రమించినా భారతదేశం పేద దేశంగానే వుంటుంది. అభివృద్ధి చెందిన దేశంగా అలరారదు అన్నారు.

మోదీ హయాంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తం అయ్యారంటూనే, 80 కోట్ల మందికి ఉచిత రేషన్ మరో ఐదేళు గ్యారంటీగా ప్రకటించడంలో మోదీ విద్దూరమూ కనిపిస్తుంది. ధరల పెరుగుదల మీద, నిరుద్యోగ విస్తృతి మీద, రైతుల ఆదాయం రెట్టింపు మీద, ఇంకా ..ఇంకా అనేకానేక పాత గ్యారంటీల మీద మౌనం పాటిస్తూ కొత్త గ్యారంటీల డబ్బాను మోగిస్తున్నారు. మోదీ గ్యారంటీలు వచ్చే ఐదేళ్లకే పరిమితం కాదు. 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తారట. 2047కి వికసిత భారత్ సాక్షాత్కరిస్తుందట. ఈ గ్యారంటీలను మనం చూడాలంటే మరో నాలుగు ఎన్నికల్లో మోదీనే ప్రధానిగా ఎన్నుకోవాలి.

వికసిత భారతానికి మోదీ కొన్ని 'సంకల్ప చిత్రాలు' చూపించారు. సుపరిపాలనకు మోదీ "సింగోల్ రాజదండంతో" దర్శనం ఇచ్చారు. సింగోల్ ప్రజాస్వామ్య సుపరిపాలనకు చిహ్నం కాదు. అది చక్రవర్తుల రాజదండం. రాచరికంలో చట్ట సభలుండవు. రాజ్యాంగం వుండదు. ప్రశ్నించేవారు వుండరు. ప్రతిపక్షం వుండదు. శత్రుశేషం లేకుండా చేసి తీరాలి. మోదీ సింగోల్ రాజదండ సంకల్పం సకల ప్రజాస్వామ్య విలువలమీద దాడిచేసే విద్వేష సంకల్పం.

ఒకే దేశం, ఒకే ఎన్నిక అన్నది మోదీ మరో సంకల్పం. ఇప్పుడు వున్నది ఒకే దేశం. దేశానికి వున్నది ఒకే లోక్‌సభ. దానికి ఒకేసారి ఎన్నిక జరుగుతుంది. కాని, మోదీ సంకల్పించే ఒకే ఎన్నికకు అర్థం వేరు. లోక్‌సభతోపాటు దేశంలోని అన్ని అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరగాలి. జమిలి ఎన్నికలలో డబుల్ ఇంజన్ సర్కార్లు రావాలి. పైనా కిందా మోదీనే కనిపించాలి. ఇతర పార్టీలను, ప్రాంతీయ పార్టీలను గుటకాయస్వాహా చేయాలి. ప్రాంతీయ వైవిధ్యాలను రూపుమాపాలి. అప్పుడు ఒకే దేశం, ఒకే నేత, ఒకే పార్టీ, ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే ఆహారం, ఒకే ఆహార్యంతో దేశాన్ని ఏకముద్దగా చేయాలి. హిందూ రాష్ట్ర కోసం జమిలి ఎన్నికల బుల్డోజర్‌తో దేశాన్ని చదునుచేసే ముద్దచేసే సంకల్పం. ఇది దేశంలోని బహుళత్వాన్ని, బహుళ పార్టీల ప్రజాస్వామ్యాన్ని హరించే మరో విద్వేష సంకల్పం.

ఇప్పటికే దేశంలో కొత్త పౌరసత్వ చట్టం అమలులోకి వచ్చింది. ఎవరు నిజమైన భారతీయులో ఈ చట్టం వడబోస్తుంది. పరీక్షలో నెగ్గితే పునీతులవుతారు. దేశ పౌరులవుతారు. పరీక్ష తప్పితే కాందిశీకులవుతారు. నిర్బంధ శిబిరాలకు చేరుకుంటారు. లేకపోతే పౌరహక్కులు లేని రెండో తరగతి పౌరులు అవుతారు. దేశాన్ని మతపరంగా విభజించడమే లక్ష్యంగా ఈ చట్టం తెచ్చారు.

ఇప్పుడు యునిఫాం సివిల్ కోడ్ తెస్తామన్న సంకల్పాన్ని ప్రకటించారు. మన దేశం బహుమతాలకు నిలయం. చాలా మతాలకు పుట్టిల్లు. మతస్తుల వ్యక్తిగత ఆచారం, వ్యవహారాలు భిన్నంగా ఉంటాయి. హిందువులలోనే భిన్నత్వం వుంది. ముస్లింలు, మైనారిటీలకు వ్యతిరేకంగా ఉమ్మడి పౌరస్మృతి ఎక్కుపెట్టారు. ఉమ్మడి పౌరస్మృతి అందరినీ ఏకం చేసేది కాదు. మతపరంగా దేశాన్ని విభజిస్తుంది. మెజారిటీ మతవాదానికి దారితీసే మరో విద్వేష సంకల్పం ఇది.

ఈసారి ఎన్నికల్లో అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ నేతలు పదేపదే ప్రకటిస్తున్నారు. ప్రస్తుత రాజ్యాంగ స్థానాన్ని మతధర్మ శాస్త్రాలు, మనుధర్మ శాస్త్రాలు ఆక్రమిస్తాయి. రాజ్యాంగం లేనిచోట ప్రజాస్వామ్యం వుండదు. "వికసిత భారతం" వెనుక వున్నది "విద్వేష సంకల్పం" ఇదే మోదీ ఇచ్చే అసలైన గ్యారంటీ.

విప్లవ సారథి లెనిన్‌కు రెడ్ శాల్యూట్

ఏప్రిల్ 22 లెనిన్ జన్మదినోత్సవాన్ని మనం వేడుకగా జరుపుకుంటున్నాం. మార్పు అనే దానిని మనకు పరిచయం చేసిన వ్యక్తి ఆయన. యావత్ సృష్టికి అదే చరమ స్థితి. దానికి అంతం లేదు, అది దానికదిగా పునరావృతం కాదు. పాతదానితోపాటు, అలాగే కొత్తదానితో పాటు కూడా ప్రయాణించే దశలుం టాయి, అంతే. పాతది విస్మృతిలోకి మసకబారుతూ వుంటే, కొత్తగా ఆధిపత్యం లోకి వస్తుంటుంది. అయితే సామాజిక, ఆర్థిక శక్తులు ఎప్పటివలె రూపొం దుతూ ఉంటాయి. ప్రస్తుతమున్న కొత్తది ఎప్పటికీ అలాగే కొత్తగా ఉండదు, సరికొత్త శక్తులు దాని స్థానంలోకి వస్తుంటాయి. మనదేశం అందుకు ప్రామా ణిక ఉదాహరణ. సామ్రాజ్యవాద యుగంలో పెట్టుబడిదారీ విధానం అదుపు చేయబడుతుంది. అది క్షీణిస్తున్న పెట్టుబడిదారీ విధానం సహజ లక్షణం. లెనిన్ ఊహించిన వాస్తవం కూడా. అది మార్క్సిజం సిద్ధాంతాన్ని సంపద్వంతం చేసింది. మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. శాస్త్ర, సాంకేతిక విప్లవంలో సరికొత్త వాస్తవికతను అది ప్రతిబింబిస్తున్నది. కొత్త అన్వేషణలు, భావాలతో దాని యావత్ పునాది మార్పుకు గురవుతున్నది. అయితే అందులోని విప్ల వాత్మక వస్తువు లెనిన్ వక్కాణించినట్లే ఉంది. ఆయన నిర్వచించినట్లు సామ్రాజ్య వాదం ముందుగా గుత్తపెట్టుబడిదారీ విధానం, పరాన్నభుక్కు వ్యవస్థ క్షీణిస్తూ ఉంటుంది, చావుకు దగ్గరపడుతుంటుంది కూడా. సామ్రాజ్యవాద వస్తువుతత్వం పోటీ కోల్పోవ టంలో ఉంటుంది. అది కార్టల్స్, సిండికేట్లు, ట్రస్టులుగా వ్యక్తీకరణ పొందుతుంది. ఉత్పత్తి కేంద్రీకరణ పెట్టుబడి దారుల సంఘాలు ఏర్ప డటానికి సహాయపడింది. బ్యాంకులు పారిశ్రామిక సంస్థల్లో చేరి గుత్తపెట్టుబడిదారీకరణలో భాగమైనాయి. ఇక్కడ ద్రవ్య పెట్టుబడి గుత్తపెట్టుబడిదారీ పారిశ్రామిక బ్యాంకు పెట్టుబడిగా ప్రవేశిస్తుంది. గుత్తపెట్టు బడిదారీ పారిశ్రామిక పెట్టుబడి తన సొంత ఆర్థిక నియ మాలు వినియోగించి ప్రపంచ మార్కెట్‌పై సైతం ఆధిపత్యం చేయబడు తుంది. అది దానిపై పెత్తనం మాత్రమే చేయదు, దాన్ని విభజిస్తుంది కూడా. అదీ సామరస్యంగా, ప్రత్యేకించి వారి మధ్యనే చేబడుతుంది. లెనిన్ను విస్మృతి లోకి నెట్టటం ఎన్నడూ సాధ్యం కాదు. ఇంతకు ముందు వస్తువుల రవాణాలాగా ఇక్కడ పెట్టుబడి ఎగుమతి వస్తుంది. ద్రవ్యపెట్టుబడి ప్రముఖ లక్షణాల్లో అదొకటి. ప్రపంచాన్ని ఆర్థికంగా, భౌగోళికంగా, రాజకీయంగా విభజించటంతో కూడా దానికి సంబంధం ఉంది. అది ఆసియా సహా ప్రపంచంలో పెట్టుబడి దారీ విధానం అత్యున్నత దశ.ద్రవ్యపెట్టుబడి దురాగతాలను - విస్తృతంగా వ్యాపించిన నిరుద్యోగం, పెరుగుతున్న దారిద్ర్యం, ఆకలి, పెరుగుతున్న ఆత్మహత్యలకు దారితీస్తున్న అన్ని రకాల కడగండ్లలో నేడూ చూడవచ్చు. కార్మికులు గరిష్ట శ్రమకు కనీస వేతనాలతో కొత్తరకం బానిసలవుతున్నారు. రెండోవైపున, బాధాకరమైన అరాచకానికి బాధ్యులైనవారికి అధికారంలో ఉన్నవారు సహాయపడుతున్నారు. ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా రాజకీయమవు తుందో చెప్పటానికి కూడా మన దేశం ఉదాహరణ. 1988లో వస్తువుల వాణిజ్య సంస్థగా ప్రారంభమైన అదానీ గ్రూపు ఇవాళ భారతదేశపు అతిపెద్ద మౌలిక వసతుల కల్పన సంస్థల కలయికగా అభివృద్ధి చెందింది. ఇవాళ రేవులు, సెజ్లు, రహదారులు, విమా నాశ్రయాల నుండి ఇంధనం, గ్యాస్,

వ్యవసాయ వస్తువ్యాపారాలు, గోదాములు ఇలా ఎన్నైనా దానికింద ఉన్నాయి. అదానీ ఆర్థిక అదృష్టాల్లో విలక్షణమైన వృద్ధి నరేంద్రమోదీ రాజకీయ అదృష్టాల పెరుగుదలతో మాత్రమే పోల్చదగింది. వాస్తవానికి ఇద్దరూ ఒకే కాలంలో అత్యంత సన్నిహిత సహకారంతో ఎదుగుదల లోకి వచ్చారు. గుత్తపెట్టుబడిదారీ ద్రవ్య పెట్టుబడి చాకచక్యా లకు భారత్ ఉదాహరణ అవుతున్నది. అదానీవలె ముఖేశ్ అంబానీ ఇవాళ భారత్‌లో కనీవినీ ఎరుగని ఆర్థిక శక్తిని అనుభవిస్తు న్నారు. వారితో సమఉజ్జీ కావాలని బహుశా ఏ పారిశ్రామిక సంస్థ కోరుకోదు. అంబానీ కచ్చితంగా ధగద్ధాయమయ పథ నిర్దేశకుడు. తనకు ప్రోగు పడిన శక్తి అతనికి తెలుసు. తన ఆర్థిక 'శక్తి' వల్లనే ముఖేశ్ అంబానీ ఈనాడు మన దేశ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థపై ఎంతో అజమాయిషీ చెలాయించగలుగుతు న్నాడు. పారిస్ స్కూలు ఆఫ్ ఎకనామిక్స్ అండ్ వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ రూపొందించిన పత్రం ఇలా చెబుతోంది : "2022-23 నాటికి, అగ్రస్థానం లోని ఒక శాతం మంది ఆదాయం, సంపద వాటాలు (22.6 శాతం, 40.1 శాతం) తమ అత్యున్నత చారిత్రక స్థాయిల్లో ఉంటాయి. దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాలకన్నా హెచ్చుస్థాయిలో ఉంటాయి." ఆసియాకు చెందిన ఇద్దరు అత్యంత సంపన్నులు - రిలయెన్స్ ఇండస్ట్రీస్ ముకేశ్ అంబానీ, అదానీ గ్రూపుకు చెందిన గౌతం అదానీ ఇరువురూ భారతీ యులు. భారత్‌కు చెందిన 10,000మంది కుబేరుల సగటు సంపద రూ.22.6 బిలియన్లు. "భారతదేశ ఆధునిక బూర్జువా వర్గం నాయకత్వంలోని 'బిలియ నీరుల రాజ్యం' వలసవాద శక్తులు నాయకత్వం వహించిన బ్రిటీష్ రాజ్యంకన్నా మరింత అసమమైనది" అని ఆ పత్రం పేర్కొన్నది. 'భారతదేశంలో ఆదాయం, సంపద అసమానత, 2022-23: బిలియనీర్ల రాజ్యం ఎదుగుదల' శీర్షికతో ఇటీవల ప్రచురించిన మరొక పత్రం ఇలా చెప్పింది : 2014-15 మరియు 2022-23 మధ్య కాలంలో అగ్రస్థాయిలో అసమానత పెరుగుదల ముఖ్యంగా సంపద కేంద్రీకరణ విషయంలో ప్రత్యేకించి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014లో పెద్దపెద్ద వాగ్దానాలు చేసినప్పటికీ, ఒక్కటీ నెరవేర్చలేదు. ఆయన పదేళ్ల అధికారంలో విశేషం ఏమంటే సంపన్నులు, గ్రామీణ పేదల మధ్య వ్యత్యాసం పెచ్చుపెరిగింది.

మోదీ ప్రభుత్వం నేడు విశృంఖలమైన అధికార కేంద్రీకరణకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, అదానీ - అంబానీ సామ్రాజ్యం కనీవినీ ఎరుగని రీతిలో సంపద కేంద్రీకరణకు ప్రతిరూపంగా ఉంది. ఆ విధంగా ఆవిర్భవించిన ఆశ్రిత పక్షపాతం మోదీ ప్రభుత్వాన్ని అతి సంపన్నుల ప్రభుత్వంగా, అతి సంపన్నుల చేత ప్రభుత్వంగా, అతి సంపన్నులకోసం ప్రభుత్వంగా తయారు చేసింది. భారతదేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై ఈ ఉడుంపట్టును బద్దలుకొట్టటం ఇప్పుడు భారతదేశంలో ప్రజాస్వామ్యం మనుగడకు ముందు షరతు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన లెనిన్, శ్రామిక ప్రజాబాహుళ్యం కలలను వాస్తవం చేయటా నికి ప్రయత్నించారు. ఆయన మనకు బహుమతిగా ఇచ్చిన అనుభవంనుండి మనం ఇప్పటికీ పాఠాలు తీసుకుంటున్నాం. ఆయన వ్యవస్థకు భాష్యం చెప్పారు. మన ప్రపంచ దృక్పథాన్ని రూపొందించుకునే మార్గాలను మనకు చూపారు. సిద్ధాంతం, ఆచరణ రెండింటినీ నిర్దిష్టపరిచిన వ్యక్తి ఆయన. మార్క్స్ రచనలను విశ్లేషిస్తూ, గతితార్కికత మన సిద్ధాంతం, సోషలిజం మన ఆచరణ అని ఆయన చెప్పారు. ఆయన ప్రాథమికంగా ఒక శాస్త్రవేత్త, తత్త్వవేత్త, విప్లవకారుడు. ఆయన విశ్లేషణాత్మకత రీతి ఆ విధంగా రూపొందింది. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన లెనిన్, శ్రామిక ప్రజాబాహుళ్యం కలలను వాస్తవం చేయటానికి ప్రయత్నించారు. ఆయన మనకు బహుమతిగా ఇచ్చిన అనుభవం నుండి మనం ఇప్పటికీ పాఠాలు తీసుకుంటున్నాం. ఆయన వ్యవస్థకు భాష్యం చెప్పారు, మన ప్రపంచ దృక్పథాన్ని రూపొందించుకునే మార్గాలను మనకు చూపారు. సిద్ధాంతం, ఆచరణ రెండింటినీ నిర్దిష్టపరిచిన వ్యక్తి ఆయన. మార్క్స్ రచనలను విశ్లేషిస్తూ, గతితార్కికత మన సిద్ధాంతం, సోషలిజం మన ఆచరణ అని ఆయన చెప్పారు. ఆయన ప్రాథమికంగా ఒక శాస్త్రవేత్త, తత్త్వవేత్త, విప్లవకారుడు. ఆయన విశ్లేషణాత్మకత రీతి ఆ విధంగా రూపొందింది. మన రాజ్యాంగం, మిశ్రమ సంస్కృతి, లౌకిక ప్రజాస్వామ్యం, ఇంకా ఆ పైన కాపాడుకునే మన పోరాటానికి ఆయన రచనలు, బోధనలు, విశ్లేషణాత్మక రీతి ప్రాసంగికత కలిగి ఉన్నాయి. భారతదేశంలో వామపక్ష ఉద్యమం నిర్మాణా నికి, మతోన్మాద ఫాసిజం ముప్పును ఎదుర్కొనేందుకు కూడా అవి తోడ్పడ తాయి. మరో మాటలో చెప్పాలంటే, మార్క్సిజం శాస్త్రాన్ని అవగా హన చేసుకునే దిశలో లెనిన్ చేసిన దోహదాలకు ప్రాతిపదిక మార్పుచెందు తున్న పరిస్థితుల శాస్త్రీయ విశ్లేషణ. అందువల్ల లెనినిజంలోని స్పష్టత, పుష్టి, ప్రాసంగికత దాన్ని సర్వకాలాలకూ ఉపయుక్తం చేస్తున్నది.

న్యూఏజ్ (సంపాదకీయం)
ఏప్రిల్ 21-27, 2004

సంక్షోభం దిశగా ఉపాధి కల్పనారంగం

ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ యువత ఆశలను వమ్ముచేశారు. దేశంలో గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత ఎక్కువగా నిరుద్యోగం నేడు 7.6 శాతానికి చేరుకున్నది. ఉత్పాదక వయో వర్గం (18-35) లోని యువతలో నిరుద్యోగం శాతం ప్రమాదకరస్థాయికి చేరుకోగా, విద్యాధిక యువతలో నిరుద్యోగుల శాతం కూడా అత్యంత ప్రమాద స్థాయికి చేరుకున్నది. ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం ద్వారా ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఆవిర్భవిస్తుందని నరేంద్రమోదీ ప్రతి రోజూ ఊదరగొడుతూ ఉంటారు. "వికసిత భారత్" త్వరలో "విశ్వగురు" కానున్నదన్న " మోదీ గ్యారంటీ" నిరంతరం మన చెవుల్లో గింగురుమని వినిపిస్తూనే ఉంది. మన సుస్థిరాభివృద్ధి గురించిన అవాస్తవ కథనాలు, రంగు రంగుల స్వప్నాలను మనముందు ఆవిష్కరిస్తుంటాయి. భారత్ మధ్యగత వయసు ఇరవై తొమ్మిదేళ్లు. అంటే మనదేశ జనాభాలో సుమారు 70 కోట్లమంది 29 ఏళ్ల వయసు కంటే దిగువన ఉండగా అంతే సంఖ్యలో ఎగువన ఉన్నారు. జనాభా గణాంకాలలో మధ్యగత వయసు తక్కువగా ఉండటాన్ని ఆర్థికవ్యవస్థకు సంబంధించిన ఒక సానుకూలతగా ఆర్థిక వేత్తలు పరిగణిస్తారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్ మెంట్ సంయుక్తంగా "ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ -2024, విద్య, ఉపాధికల్పన, నైపుణ్యాలు" పేరుతో రూపొందించిన నివేదికను మార్చ్ 26న భారతప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ విడుదల చేశారు. "భారత్ వెలిగిపోతోంది" నినాదంతో పాలించిన అతల్ బిహారీ వాజపేయి కాలం నుండి(2000) "వికసిత భారత్" నినాదంతో ప్రస్తుతం పాలిస్తున్న నరేంద్రమోదీ హయాం(2022) వరకూ ఇరవై రెండేళ్ల వ్యవధిలో ఉపాధి రంగంలోని వివిధ ధోరణులను నివేదిక వెల్లడించింది. దేశంలో నిరుద్యో గులుగా ఉన్న మొత్తం శ్రమజీవుల్లో యువత సంఖ్య 83శాతంగా ఉండటం పెద్ద ప్రమాదాన్ని సూచిస్తున్నది. నిరుద్యోగ శ్రామికశక్తిలో సెకండరీ లేదా అంతకంటే ఎక్కువ చదివిన ఉన్నత విద్యా వంతుల సంఖ్య 2000వ సంవత్సరంలో 35.2 శాతం ఉండగా 2022 నాటికి వీరి సంఖ్య 65.7శాతానికి చేరుకున్నది. దేశ ఆర్థికశక్తికి వెన్నెముక అయిన శ్రామికశక్తిలో ఇంత పెద్ద సంఖ్యలో విద్యాధిక యువత భాగం కాకపోవడం ఆందోళనకర పరిణామం. స్వయం ఉపాధిరంగం లో ఉపాధి పొందుతున్న శ్రామికుల సంఖ్య 2000లో 52.5శాతం ఉండగా 2012 నాటికి 52.2 శాతంగా ఉంది. 2019 నాటికి 52 శాతంగాఉన్న వీరి సంఖ్య కోవిడ్ అనంతరం 2022 నాటికి అకస్మాత్తుగా 55.8శాతానికి పెరిగింది. రెగ్యులర్ ఉద్యోగాలలో ఉన్నవారి సంఖ్య 2000లో 14.2 శాతం ఉండగా 2022 నాటికి వీరి సంఖ్య 21.5శాతానికి పెరిగింది. క్యాజువల్ ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 2000లో 33.3శాతం ఉండగా 2022 నాటికి వీరి సంఖ్య 22.7 శాతానికి పడిపోయింది. కరోనా కాలంలో ఉద్యోగాలు, ఉపాధి పోయినవారు ఇంటికి చేరుకున్నారని, ఏవేవో అరకొర పనులు చేసుకుంటున్నా రని, వారి ఆదాయాలు పడిపోయాయని దాని అసలు అర్థం. పకోడీలు వేసి అమ్ముకోవ డాన్ని ఉపాధి కల్పనగా నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్య బీజేపీ ఆర్థిక సిద్ధాంతాల లోని అసలు సిసలు భావ దారిద్ర్యాన్ని పట్టి ఇచ్చింది. క్యాజువల్ ఉద్యోగాలు చేసేవారి సంఖ్య గణనీయంగా పడిపోవడం కూడా ఉపాధి రంగంలోని ఒడిదుడుకులను వెల్లడిస్తున్నది. మనకు వ్యవసాయ రంగంలో ఉపాధి పొందు తున్న శ్రామికులు 2000లో 62శాతంగా ఉన్నారు. 2012 నాటికి వీరి సంఖ్య 40శాతానికి, 2019 నాటికి 42శాతానికి తగ్గింది. కోవిడ్ అనంతరం 2022 నాటికి 45శాతానికి పెరిగింది. ఇక పారిశ్రామిక, వస్తూఉత్పత్తి, నిర్మాణ రంగాల్లో నిమగ్నమైన శ్రామికులు 2000లో 16శాతం కాగా, 2012లో వీరి సంఖ్య 24శాతానికి, 2019లో 36శాతానికి పెరుగుతూ వచ్చింది. కోవిడ్ అనంతరం 2022లో 25శాతానికి పడిపోయింది. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యో గాలు, ఐటీ, టూరిజం, సేవలు, వంటి రంగాల్లో ఉద్యోగాలు పొందినవారు 2000లో 23శాతం కాగా 2012 నాటికి వీరి సంఖ్య 27 శాతానికి, 2019 నాటికి 35శాతానికి పెరిగింది. కోవిడ్ అనంతరం 2022 నాటికి వీరి సంఖ్య 32శాతానికి పడింది. జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 2000లో 27శాతం ఉండగా 2019లో 15శాతానికి చేరుకున్నది. కోవిడ్ అనంతరం 2022నాటికి 16శాతానికి కొద్దిగా పెరిగింది. పారిశ్రామిక రంగం వాటా 2000 లో 29 శాతం ఉండగా 2022 నాటికి 31శాతానికి పెరిగింది. సర్వీసు రంగం వాటా 2000లో 44శాతం ఉండగా 2022లో 53శాతానికి పెరిగింది. శ్రామికశక్తి ఎక్కడి నుండి ఎక్కడికి కదులుతోందనే అంశం కీలకమై నది. భూగర్భం లోతుల్లో జరిగే ప్రకంపనాలు స్వల్పంగా కనిపించినా అవి పెను భూకంపాలను సృష్టిస్తాయి.ఆర్థిక వ్యవస్థలోని ఉపాధి కల్పన, ఉద్యోగసృష్టి రంగాల్లో ఇలాంటి ఎగుడు దిగుళ్లు సామాజికంగా జరుగుతున్న వైపరీత్యాలకు అద్దం పడతాయి. క్యాజువల్ ఉద్యోగాల కోత కూడా కనిపిస్తు న్నది. జీడీపీలో క్రమేపీ వాటా తగ్గిపోతున్న వ్యవసాయరంగంలో కోవిడ్ అనంతరం శ్రామికశక్తి పెరుగుల మూడు శాతం కనిపించిందంటే దాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? తక్కువ ఆదాయం వచ్చే రంగాల్లోకి శ్రామికులు వెనక్కి మరలిరావడం జరుగు తోందంటే పారిశ్రామిక, వస్తూత్పత్తి రంగాల్లో ఉపాధి అవకాశాలు తగ్గి పోయాయి. దేశంలో అసంఘటిత రంగంలో పనిచేసే శ్రామికుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. రెగ్యులర్ రంగంలో పనిచేసే శ్రామికుల సంఖ్య 2018 తర్వాత పడిపోవడం కూడా కనిపిస్తున్నది. శ్రామిక శక్తిలో అత్యధిక సంఖ్యలో ఉన్న విద్యాధిక యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేవని నివేదిక తేల్చి చెప్పింది. మనదేశంలో నూట పది కోట్లమంది మొబైళ్లను

వినియోగిస్తు న్నారు. అందులో నలభై కోట్లమంది స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నారు. నిరుద్యోగ యువతలో 75శాతం మంది అటాచ్‌మెంట్‌తో కూడిన ఒక ఈ మెయిల్‌ను పంపలేక పోతున్నారు. 60శాతం మంది కాపీ పేస్ట్ చేయలేరు. 90శాతం మంది ఒక గణిత ఫార్ములాను స్ప్రెడ్ షీట్‌లో చూపలేని స్థితిలో ఉన్నారు. అంటే అక్షరాస్యత, ఉన్నత చదువులు, పెరుగుతున్న సాంకేతికత మన యువ తకు నైపుణ్యాలను ఇవ్వలేకపోతున్నాయని నివేదిక స్పష్టం చేసింది. 24గంటలూ సామాజిక మాధ్యమాల్లో మునిగి తేలుతున్న యువత బుర్రల్లో వక్రీకరించిన సమాచారాన్ని, అసత్యాలను, అవాస్తవాలను నింపడానికి మాత్రమే సాంకేతికత వినియోగపడుతోంది. కోవిడ్ అనంతరం 2022 లో చదువులో గానీ, శిక్షణలో గానీ, ఉద్యోగంలో గానీ లేకుండా ఉన్న యువత సంఖ్య కూడా 28.5 శాతంగా ఉండటం కలవరం కలిగిస్తోంది. ఉన్నత చదువులు చదివిన యువత ఖాళీగా ఉంటున్నారే తప్ప, తక్కువ ఆదాయాలు ఇచ్చే ఉద్యోగాల్లో చేరడానికి సుముఖత చూపడం లేదని నివేదిక వెల్లడించింది. శ్రామిక మార్కెట్ లో ఆదాయాల, వేతనాల పరిస్థితి 2022 నాటికి దయనీయంగా ఉన్నదని నివేదిక స్పష్టం చేసింది. స్వయం ఉపాధి రంగంలో సగటు ఆదాయం నెలకు పది వేల రూపాయలు ఉండగా, రెగ్యులర్ ఉద్యోగాలలో సగటు ఆదాయం నెలకు 15,177 రూపాయలు ఉన్నది. స్వయం ఉపాధి రంగంలో మహిళల ఆదాయం నెలకు 4814 రూపాయలు కాగా, రెగ్యులర్ ఉద్యోగాలలో ఆదాయం నెలకు 10567 రూపాయలుగా ఉన్నది. ఆదాయాల్లోనూ, వేతనాల్లోనూ జెండర్ వ్యత్యాసాలు పెరిగాయని నివేదిక తెలిపింది. ఈ మధ్యకాలంలో నాలుగో తరగతి కంటే దిగువస్థాయిలో ఉన్న 35 వేల ఉద్యోగాల నియామకానికి ఒక కోటి ఇరవై అయిదు లక్షలమంది దరఖాస్తు చేసుకున్న ఉదంతం మనకు తెలుసు.యూపీలో ఐదో తరగతి అర్హతతో ఇచ్చే వాచ్ మ్యాన్, తోటమాలి వంటి ఉద్యోగాలకు పి.హెచ్‌డీ, పీజీ, డిగ్రీ,ఎంబిఎ పూర్తి చేసినవారు వేలాది మంది దరఖాస్తు చేసుకున్న ఉదంతాన్ని నివేదిక ప్రస్తావించింది.గత పదేళ్లుగా నిజజీవితానికి సంబంధంలేని అలౌకిక భావోద్వేగాల గురించిన మోదీ మాటలు వినీ వినీ విసిగిపోయిన యువత ఉద్యోగసృష్టి, ఉపాధి కల్పన వంటి అంశాల వైపు దృష్టి సారిస్తున్నది. అయోధ్య రామమందిరంలో బాల రాముని నుదిటిపై పడిన సూర్యకిరణాలు యువతను ఉత్సాహ పరచడంలేదు. తమ జీవితాల్లో మార్పులు తెచ్చే నిజమైన సూర్యకిరణాలు ప్రసరించాలని వారు కోరుకుంటున్నారు.

డి.సోమసుందర్, సీనియర్ పాత్రికేయుడు.

ఎన్నికల బాండ్లపై ఆర్థిక మంత్రి వ్యాఖ్యలు సరికాదు

రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకాన్ని పారదర్శకత కోసమే తీసుకొచ్చామని బీజేపీ చెబుతోందని, అయితే సుప్రీం కోర్టు ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని పేర్కొందని సిబల్ శనివారం అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత తిరిగి అధికారంలోకి వస్తే భాగస్వాములందరితో సంప్రదింపులు జరిపిన తర్వాత ఏదో ఒక రూపంలో ఎన్నికల బాండ్లను తిరిగి తీసుకురావాలని బీజేపీ భావిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక వార్తాపత్రికతో చెప్పిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ఒక విలేకరుల సమావేశంలో సిబల్ మాట్లాడుతూ 'ఎన్నికల బాండ్లను తిరిగి తీసుకువస్తామని నిర్మలా సీతారామన్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టినప్పుడు పారదర్శకత కోసమే వాటిని ప్రవేశపెట్టినట్లు కూడా ఇంటర్వ్యూలో చెప్పారు. ఇది సుప్రీం కోర్టు పేర్కొన్న దానికి సరిగ్గా వ్యతిరేకం' అని అన్నారు, ఇవి పారదర్శకత లేని పద్ధతిలో తీసుకువచ్చారని సుప్రీం కోర్టు తెలిపింది. 'ఇప్పుడు వారు (బీజేపీ) ఎదుర్కొంటున్న సమస్య ఏమిటంటే, ఈ ఎన్నికల కోసం వారి వద్ద డబ్బు ఉంది. కానీ ఓడిపోయినప్పుడు వారికి డబ్బు అవసరమని తెలుసు. అయితే నిర్మలా జీ (వారు) గెలిస్తే, తిరిగి ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకువస్తామని చెబుతున్నారు' అని తెలిపారు. ఎన్నికల బాండ్లను సమర్థిస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీపై కూడా సిబల్ మండిపడ్డారు. సుప్రీం కోర్టు తన నిర్ణయం స్పష్టం చేసినప్పుడు ఎన్నికల సమయంలో ఈ విధంగా మాట్లాడటం 'తప్పు' అని అన్నారు. అలాగే ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను తీరుపై కూడా ఆయన విమర్శలు చేశారు. ధరలు పెరగకుండా, ఎన్నికల అవకాశాలకు ఆటంకం కలిగించకుండా పప్పులను దిగుమతి చేసుకుంటోందని ఆరోపించారు.

పెళ్లి వేడుకలో విషాహారం తిని 24 మందికి అస్వస్థత

భోజ్‌పూర్ (యూపీ): పెళ్లి వేడుకలో విషాహారం తిని 24 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని భోజ్‌పూర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థుడు ఉమా శంకర్ మాట్లాడుతూ భోరాహి తోలా నివాసి బిమల్ యాదవ్ కుమారుడు అజరు యాదవ్ అధ్వర్యంలో పెళ్లి కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ తిలకంలో పాల్గొనేందుకు అందరూ శుక్రవారం వచ్చారని, నిన్న రాత్రి అందరూ స్వీట్లు, చేపల కూర తిన్నారని, దీని తర్వాత ఒక్కసారిగా అందరూ అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. వారిలో చాలామంది పిల్లలు, ముసలివారు, మహిళలు ఉన్నారని, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో అరిచారని వివరించారు. వెంటనే అందరినీ చికిత్స కోసం జగదీశ్‌పూర్ సబ్-డివిజనల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడా వారి ఆరోగ్యం మెరుగుపడలేదని, అనంతరం మెరుగైన వైద్యం కోసం అందరినీ అర సదర్ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. చాలామంది స్వీట్లు మాత్రమే తిన్నారని, మరికొందరు చేపలు, అన్నం కూడా తిన్నారని బంధువు తెలిపారు. బాధితుల ఆరోగ్యం కొంత మెరుగైందని అర సదర్ ఆసుపత్రిలోని డ్యూటీ డాక్టర్ సుజిత్ తెలిపారు.

పిల్లలతో అశ్లీల వీడియోలు నేరం: సుప్రీం

న్యూఢిల్లీ: చిన్నపిల్లలను ఉపయోగించి అశ్లీల వీడియోలు తీయడం తీవ్రమైన ఆందోళన కలిగించే విషయమేగాక నేరమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పిల్లల అశ్లీల వీడియోలు డౌన్లోడ్ చేసుకొని చూడటాన్ని పోక్సో, ఐటీ చట్టాల కింద నేరంగా పరిగణించలేమని మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీలును సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. బాలల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఫరీదాబాద్‌కు చెందిన 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్', ఢిల్లీకి చెందిన 'బచ్‌పన్ బచావో ఆందోళన్' ఎన్జీవోలు ఈ అప్పీలు దాఖలు చేశాయి. ఈ వ్యవహారంలో జనవరి 11న తీర్పు చెప్పిన మద్రాసు హైకోర్టు... తన మొబైల్ ఫోనులో చిన్నపిల్లల అశ్లీల వీడియోలను డౌన్‌లోడు చేసుకున్న 28 ఏళ్ల యువకుడికి వ్యతిరేకంగా క్రిమినల్ చర్యలు తీసుకోకుండా రద్దు చేసింది. ఎన్జీవోల తరపున సీనియర్ న్యాయవాది హెచ్‌ఎస్ ఫుల్కా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. మద్రాసు హైకోర్టు నిర్దోషిగా ప్రకటించిన నిందితుడి తరపున హాజరైన న్యాయవాది... ఆ వీడియోలు తన క్లయింటు వాట్సాప్‌కు ఆటోమేటిక్‌గా డౌన్‌లోడ్ అయినట్లు సుప్రీంకోర్టుకు నివేదించారు. అప్పీలును విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. అదేసమయంలో ధర్మాసనం కొన్ని సూచనలు చేసింది. 'ఎవరికైనా అటువంటి వీడియోలు ఇన్‌బాక్సులో వచ్చి చేరితే సంబంధిత చట్టాల కింద పరిశీలనను నివారించడానికి వాటిని డిలీట్ చేయాలి. అలా చేయకుండా ఐటీ నిబంధనలు ఉల్లంఘిస్తే అప్పుడు అది నేరమవుతుంది' అని స్పష్టం చేసింది. ఈ కేసుపై తన అభిప్రాయాలను ఏప్రిల్ 22లోగా లిఖితపూర్వకంగా తెలపాలని జాతీయ బాలల హక్కుల సంఘాన్ని (ఎన్‌సీపీసీఆర్) సీజేఐ కోరారు. వాదనలు ముగిశాయని, తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రముఖ నటి

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థిగా ప్రముఖ సినీనటి వర్ష ప్రియదర్శినికి ఆ పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ టికెట్ కేటాయించారు. బిజూ జనతా దళ్ (బీజేడీ) పార్టీ ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న తొమ్మిది మంది అభ్యర్థుల జాబితాను నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఇందులో వర్ష ప్రియదర్శిని పేరు కూడా ఉంది. రెండు రోజుల క్రితం బీజేడీలో చేరిన నటి వర్షకు పార్టీ జాజ్‌పూర్ జిల్లాలోని బర్చానా అసెంబ్లీ నియోజకవర్గం కేటాయించారు. అధికార పార్టీ ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించింది. ప్రస్తుత శాసనసభ్యురాలు మినాఖి మహంతకు ఈసారి టికెట్ నిరాకరించడంతో చంపువా అసెంబ్లీ స్థానానికి 'సనాతన్ మహాకుడ్'ను బీజేడీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. నటి వర్ష ప్రియదర్శిని సిట్టింగ్ ఎమ్మెల్యే అమరప్రసాద్ సత్పతి స్థానంలో పోటీ చేయనున్నారు. మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ సాహు బీజేడీ అభ్యర్థిగా చిలికా అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేయనున్నారు. సిట్టింగ్ శాసనసభ్యుడు భగీరథి సేథీకి టికెట్ నిరాకరించడంతో ఆనంద్‌పూర్ నుంచి పార్టీ అభ్యర్థిగా 'అభిమన్యు సేథీ' పోటీ చేయనున్నారు. ఒడిశాలో మొత్తం 147 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇప్పటికి బీజేడీ పార్టీ 135 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించింది. పార్టీ ఇప్పటికే మొత్తం 21 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రతిపాదించింది.

సనాతన ధర్మాన్ని దెబ్బతీసే కుట్ర

మమతపై యోగి ఎదురుదాడి

లక్నో: సనాతన ధర్మాన్ని దెబ్బతీసేందుకు మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ భక్తులపై దాడులు చేస్తోందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. రామనవమి వేడుకల సందర్భంగా బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన హింసపై ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో రామనవమి వేడుకలతో పాటు ఊరేగింపులు సజావుగా జరిగాయన్నారు. కానీ పశ్చిమ బెంగాల్‌లో మాత్రం దాడులు జరిగాయని, ఇది సనాతన ధర్మాన్ని దెబ్బ తీసే కుట్ర అని ఆక్షేపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ దేశంలో భద్రతను మెరుగుపరిచిందని ఆదిత్యనాథ్ చెప్పుకొచ్చారు. మోదీ జాతీయవాదం, అభివృద్ధి, భద్రత, సుపరిపాలన కారణంగా రాజస్థాన్‌లో బీజేపీకి గణనీయమైన మెజారిటీ దక్కిందని పేర్కొన్నారు. గత ఎన్నికల మాదిరిగానే రాజస్థాన్ లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ మంచి పనితీరు కనబరుస్తుందని దీమా వెలిబుచ్చారు. గత ఎన్నికల్లో బీజేపీకి 25 సీట్లు దక్కాయని, ఈసారి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ వందశాతం సీట్లు సాధిస్తుందని ఆయన చెప్పారు.

బీజేపీ గూటికి కాంగ్రెస్ నేత బిట్టు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. పంజాబ్‌కు చెందిన సీనియర్ నేత తాజిందర్ సింగ్ బిట్టు ఏఐసీసీ కార్యదర్శి పదవికి, హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాజీనామా లేఖ పంపించిన తాజిందర్ సింగ్ బిట్టు ... ఏ మాత్రం ఆలస్యం చేయకుండా బీజేపీలో చేరారు. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే సమక్షంలో కాషాయ కండువా కప్పుకొన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉన్న తాజిందర్ సింగ్ బిట్టు... ప్రియాంక గాంధీకి సన్నిహితుడిగా పేరుంది. తాను మూడున్నర దశాబ్దాలు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశానని, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజా సంక్షేమ అంశాలపై మాట్లాడటం లేదని, పార్టీ తీరు మారిపోతున్నదని బిట్టు ఆరోపించారు. పంజాబ్ మేలు కోసమే తాను కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరానని చెప్పారు.

బస్సు బోల్తా...

భద్రతా సిబ్బందికి గాయాలు

భోపాల్: పోలింగ్ డ్యూటీలో పాల్గొన్న పోలీసులు ప్రయాణించిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 21 మంది గాయపడ్డారు. వీరిలో 8 మంది పోలీస్ సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు భోపాల్-బేతుల్ హైవేలోని బరేతా ఘాట్ సమీపంలో లారీని తప్పించే క్రమంలో ఆ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులోని 40 మంది పోలీస్ సిబ్బందిలో 21 మంది గాయపడ్డారు. తీవ్ర గాయాలైన ఎనిమిది మంది బెతుల్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్వల్ప గాయాలైన వారికి షాపూర్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంపన్నుల కోసమే మోదీ సర్కార్

బీజేపీ పాలనలో రాజ్యాంగానికి ముప్పు: రాహుల్

భాగల్పూర్ (బీహార్): బీజేపీ-ఆర్ఎస్ఎస్ కలయికతో పాటు కొంతమంది బిలియనీర్లు ప్రజాస్వామ్యానికి, దేశ రాజ్యాంగానికి ముప్పు కలిగిస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం విమర్శించారు. బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ, నిరుద్యోగం, ఆర్థిక లేమి వంటి సమస్యలపై మోదీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నరేంద్ర మోదీ పాలనలో మాఫీ చేసిన రైతు రుణాలతో పోల్చితే, తమ పార్టీ నేతృత్వంలోని మునుపటి యూపీఏ ప్రభుత్వంలో అన్నదాతలకు 25 రెట్లు రుణాలను మాఫీ చేశామని చెప్పారు. 'నేను మీకు కొన్ని ఆశ్చర్యకరమైన గణాంకాలను అందించాలనుకుంటున్నాను. దేశంలో 70 కోట్ల మంది వ్యక్తులకు సమానమైన సంపదను కలిగి ఉన్న 22 మంది వ్యక్తులు ఉన్నారు. దేశంలో 70 కోట్ల మంది ప్రజలు రోజుకు 100 రూపాయల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు' అని గాంధీ అన్నారు. 25 మందికి పైగా సంపన్నులకు 16 లక్షల కోట్ల రూపాయల రుణాలను మోదీ మాఫీ చేశారని చెప్పారు. 'మేము మాఫీ చేసిన రైతుల రుణాలకు ఇది 25 రెట్లు ఎక్కువ అని మీకు తెలుసా? మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం 25 సంవత్సరాల వ్యయానికి సమానమైనదిగా కూడా చూడవచ్చు' అని అన్నారు. ఓడరేవులు, విద్యుత్తు, విమానాశ్రయాలు, రక్షణ వంటి ప్రధాన ప్రభుత్వ మౌలిక సదుపాయాలపై ఎంపిక చేసిన వ్యాపారవేత్తలకు యాజమాన్య హక్కులు ఇస్తున్నారే కానీ రైతులు, పేదలు, ఇతర అణగారిన వర్గాలకు ఉపశమనం కలిగించడానికి కేంద్రం ఏమీ అందించడం లేదని తెలిపారు. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి పేద ప్రజలకు సంపదను పంచేందుకు కట్టుబడి ఉందని గాంధీ స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే, కాంగ్రెస్ ప్రతిపాదిస్తున్న 'మహాలక్ష్మి' వంటి పథకాల ద్వారా పేదలకు సహాయం చేస్తుందని, ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళా సభ్యునికి ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ఏడాదికి రూ.లక్ష అందజేస్తామని తెలిపారు. కనీస వేతనాన్ని 400కి పెంచుతామని, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు గౌరవ వేతనం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. 'ప్రజలు తమ చుట్టూ ఉన్న పరిస్థితులపై దృష్టి పెట్టాలని మోదీ కోరుకోవడం లేదు. అతను కొన్ని మార్గాల ద్వారా మీ అందరి దృష్టి మరల్చడానికి ప్రయత్నిస్తాడు. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా, యువత తమ స్మార్ట్‌ఫోన్‌లలో గంటల తరబడి పని లేకుండా సోషల్ మీడియా సైట్‌లకు అతుక్కుపోయి ఉండడాన్ని మీరు చూడవచ్చు. భారతదేశం నిరుద్యోగ కేంద్రంగా మారడమే కారణం. నోట్ల రద్దు, జీఎస్‌టీ తప్పుడు అమలు వల్ల ఉద్యోగాల కల్పన దెబ్బతింది' అని ఆయన విమర్శించారు. దేశంలో, ప్రైవేట్ రంగం, ప్రభుత్వ రంగంలో శిక్షణ పొందిన మానవ వనరులను ఉత్పత్తి చేసే 'అప్రెంటిస్‌షిప్ హక్కు'కు హామీ ఇవ్వడం ద్వారా తమ పార్టీ నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తుందని రాహుల్ గాంధీ తెలిపారు. నాలుగు సంవత్సరాల పాటు కాంట్రాక్టు ఉద్యోగాలను కల్పించే సాయుధ దళాల్లో ఉపాధి కల్పించే 'అగ్నిపథ్' పథకాన్ని కాంగ్రెస్ రద్దు చేస్తుందని స్పష్టం చేశారు. దేశ ప్రజలు ఈ వ్యవస్థను ధిక్కరిస్తున్నారని, సైనికులు రెండు వేర్వేరు వర్గాలు ఉండకూడదని అన్నారు. 'వివాదాస్పద వ్యవసాయ బిల్లులను ఉపసంహరించుకోవలసిందిగా నరేంద్ర మోదీని ఒత్తిడి చేసిన రైతుల నిరసనలను గుర్తుచేస్తూ, 'రుణాల మాఫీ, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇస్తాను' అని చెప్పారు. 'ఇండియా' కూటమి ఎన్నికలను ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించే పోరాటంగా పరిగణిస్తోందన్నారు. 'దేశంలోని నిరుపేదలు, దళితులు, గిరిజనులు పొందిందంతా రాజ్యాంగం వల్లే. కానీ బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమి వారికి నచ్చిన నలుగురైదుగురు బిలియనీర్ల నుంచి రాజ్యాంగానికి ముప్పు ఉంది' అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. 'రాజ్యాంగాన్ని రద్దు చేయడంలో వారు విజయం సాధిస్తే, పేదలు, అణగారిన వర్గాల వారు ఇప్పటివరకు చేసిన అభివృద్ధి అంతా అంతం అవుతుంది' అని అన్నారు. అయితే సొంతంగా 370కి పైగా సీట్లు గెలుస్తామని, మిత్రపక్షాలతో కలిసి 400కు పైగా స్థానాలు సాధిస్తామని బీజేపీ చేస్తున్న వాదనలను ఆయన ఎద్దేవా చేశారు. 'వారు విపరీతమైన వాదనలు చేస్తారు. కానీ వారు 150 సీట్లు దాటబోరని నేను మీకు చెబుతున్నాను' అని అన్నారు.

కశ్మీరు గుర్తింపు కోసమే ఎన్నికలు: ముఫ్తీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని మొత్తం లోక్‌సభ ఎన్నికలకు వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతాయి. ఇప్పటికే ఒక స్థానానికి మొదటి దశలో ఓటింగ్ పూర్తయింది. మిగిలిన ఐదు స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికలు రోజువారీ సమస్యలను పరిష్కరించడానికి కాదు. జమ్మూకశ్మీర్ గుర్తింపును, దాని వనరులను కాపాడటం ముఖ్యమని దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో నిర్వహించిన రోడ్‌షోలో పీపుల్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు. అనంత్‌నాగ్-రాజౌరీ నియోజకవర్గం నుంచి సార్వత్రిక ఎన్నికల్లో జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ పోటీ చేస్తున్నారు. తన తండ్రి ముఫ్తీ మహ్మద్ సయీద్‌కు పహల్గామ్ ప్రజల పట్ల అభిమానం ఉందని అన్నారు. 'మా నాన్నగారికి ఈ ప్రాంతం అంటే ఇష్టం కాబట్టి దీనిపై నాకూ అభిమానం ఉంది. ఆయన ఇక్కడ ఎన్నో పనులు చేశారు. నాకు స్వాగతం పలికేందుకు వచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు. ఇది నా సొంత ప్రాంతం. ఇక్కడ అభివృద్ధి చేయడానికి నేను సిద్ధంగా ఉంటాను. లోక్‌సభ ఎన్నికల్లో నేను తప్పకుండా గెలుస్తాను' అని మెహబూబా ముఫ్తీ అన్నారు. అనంత్‌నాగ్-రాజౌరీ నియోజకవర్గానికి మే 7న మూడో విడతలో పోలింగ్ జరగనుంది.

వయనాడ్ సీటూ కాంగ్రెస్ కోల్పోతుంది

ప్రధాని మోదీ

నాందేడ్ (మహారాష్ట్ర): లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఓడిపోతుందని, ఆ తర్వాత సురక్షితమైన సీటు వెతుక్కోవాలని ప్రధాని నరేంద్ర మోదీ రాహుల్ గాంధీకి హితవు పలికారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో శనివారం నాందేడ్, హింగోలి స్థానాల నుంచి బీజేపీ అభ్యర్థుల ప్రచారం కోసం జరిగిన ర్యాలీని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల మొదటి దశకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ) కు అనుకూలంగా ఏకపక్షంగా ఓటింగ్ జరిగినట్లు సూచిస్తోందన్నారు. రాహుల్ గాంధీని ప్రస్తావిస్తూ, 'అమేథీ ఓడిపోయిన తర్వాత కాంగ్రెస్ సహజ్జాదే వయనాడ్‌ను కూడా కోల్పోతుంది. అందువల్ల అతను ఏప్రిల్ 26 తర్వాత సురక్షితమైన సీటు కోసం వెతకాలి' అని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేకనే కొందరు 'ఇండియా' కూటమి నేతలు లోక్‌సభను వదిలి రాజ్యసభకు వెళ్లారని సోనియా గాంధీని ఉద్దేశించి చెప్పారు. 'మొదటిసారి, కుటుంబం వారు నివసించే నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి లేనందున కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయరు' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ హయాంలోని దుష్పరిపాలనను చక్కదిద్దేందుకు తాను పదేళ్లు గడిపానని ప్రధాని మోదీ అన్నారు. 'చాలా పని చేయాల్సి ఉంది' అని తెలిపారు. రైతులు, పేదల అభివృద్ధికి కాంగ్రెస్ అడ్డుగా నిలుస్తోందని ఆరోపించారు. వ్యవసాయ సంక్షోభం ఇప్పుడు రాలేదని, కాంగ్రెస్ లోపభూయిష్ట విధానాల వల్లే ఇది జరిగిందని తెలిపారు. 'వాస్తవానికి కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రకటనకు ముందే ఓటమిని అంగీకరించారు' అని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 25 శాతం సీట్లలో 'ఇండియా' కూటమి పార్టీలు ఒకదానికొకటి పోటీ పడుతున్నారని, జూన్ 4 (ఎన్నికల ఫలితాలు) తర్వాత వారు ఒకరితో ఒకరు మరింత పోరాడతారని చెప్పారు. పౌరసత్వ (సవరణ) చట్టం లేకుంటే అఫ్గానిస్తాన్ నుంచి వచ్చిన సిక్కుల గతి ఏమై ఉండేదని ఆయన అన్నారు.

'నా తమ్ముడికి ఓట్లేస్తే మీకు నీళ్లు'...

ఉప ముఖ్యమంత్రి శివకుమార్ వ్యాఖ్యలపై కేసు

బెంగళూరు: సార్వత్రిక ఎన్నికల వేళ రాజకీయ పార్టీల ప్రచారం జోరందుకుంది. ప్రధాన నేతలంతా ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈక్రమంలో కర్నాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. తన సోదరుడు సురేశ్ తరపున ప్రచారంలో భాగంగా డీకే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారంటూ ఫిర్యాదులు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. డీకే సురేశ్ బెంగళూరు రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఇటీవల తన సోదరుడి పక్షాన ఈ ప్రాంతంలో శివకుమార్ ప్రచారంలో పాల్గొన్నారు. ఓ హౌసింగ్ సొసైటీలో ఆయన ఓటర్లను అభ్యర్థిస్తున్న వీడియో ఒకటి నెట్టింట వైరల్ అయింది. "నేను ఇక్కడికి ఓ బిజినెస్ డీల్ కోసం వచ్చా. నా సోదరుడు సురేశ్‌కు మీరు ఓటేసి గెలిపిస్తే మూడు నెలల్లో మీ ప్రధాన సమస్యను పరిష్కరిస్తాను. కావేరీ నదీ జలాలు సరఫరా చేసి మీకు అవసరమైన నీటిని కూడా కేటాయిస్తాం." అని డిప్యూటీ సీఎం అందులో చెప్పినట్లుగా ఉంది. ఈ వీడియోను బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, తన సోదరుడి కోసం ఓట్లు దోపిడీ చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాన్ని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల సంఘం... డీకే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు ధ్రువీకరించింది. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినందుకు ఆయనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు కర్నాటక ప్రధాన ఎన్నికల అధికారి వెల్లడించారు.

ప్రజాస్వామ్యాన్ని దాటవేసి చట్టాల రూపకల్పన

కేంద్రంపై ప్రియాంక గాంధీ ధ్వజం

త్రిస్సూర్ (కేరళ): కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా శనివారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య ప్రక్రియలను దాటవేయడం ద్వారా చట్టాలను రూపొందించారని, వాటిని ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. మహిళల హక్కుల కోసం పోరాడతామని ప్రధాని నరేంద్ర మోదీ చెబుతుంటే, ఆయన ప్రభుత్వం అత్యాచార నిందితులను కాపాడుతోందన్నారు. ప్రధాన మంత్రి 'గుత్తాధిపత్య స్నేహితుల' ప్రయోజనాల కోసం విధానాలను రూపొందించిందని, అయితే ప్రజలు నిరుద్యోగం, పేదరికానికి నెట్టివేయబడుతున్నారని ధ్వజమెత్తారు. 'మన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల రక్తంతో లిఖించిన భారత రాజ్యాంగాన్ని మార్చడం గురించి 'ప్రధాన మంత్రి మనుషులు' 'అహంకారం'తో మాట్లాడుతున్నారని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి బెన్నీ బెహనాన్‌కు ఓట్లు వేయాలని కోరుతూ చలకుడి లోక్‌సభ స్థానంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ, 'వారు భారత రాజ్యాంగాన్ని తమ సొంత దురాశ, ఆశయ సాధనంగా పరిగణిస్తున్నారు. అది వారికి కాగితం ముక్కలా ఉంది' అని అన్నారు. 'ప్రభుత్వం అత్యాచార నిందితులను, మహిళలను అణచివేసేవారిని, దుర్వినియోగదారులను రక్షిస్తుంది. బాధితులను దూషిస్తారు' అని ఆరోపించారు. ప్రాథమిక వస్తువుల ధరలు పెరగడంతో సాధారణ పౌరుడు తన కుటుంబాన్ని పోషించుకోవడానికి కష్టపడుతుంటే, మనకు తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని 'దోపిడీ' అని అభివర్ణించారు. చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిన ప్రభుత్వ సంస్థలను 'చట్టవిరుద్ధమైన దోపిడీదారులుగా మార్చారు' అని అన్నారు. అసమ్మతి స్వరాల గొంతు నొక్కడానికి వాటిని ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. దేశంలో న్యాయవ్యవస్థ బెదిరింపులకు గురవుతుందన్నారు. లడఖ్‌లో చైనా చొరబాటుపై ఆరోపించిన నిరసనలపై కేంద్రం మౌనంగా ఉందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేవారిని వేధించడంతో పాటు వారిని జైలులో పెడుతుందని ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు.

మహానదిలో పడవ బోల్తా...నలుగురి మృతి

భువనేశ్వర్: ఒడిశాలోని ఝార్సుగూడ జిల్లాలో విషాదం చోటుచేసుకున్నది. సుమారు 50 మంది ప్రయాణిస్తున్న ఓ పడవ అకస్మాత్తుగా మహానదిలో బోల్తా పడింది. దీంతో నలుగురు మరణించారు. ముగ్గురు పిల్లలు సహా మరో ఏడుగురు గల్లంతయ్యారు. మృతుల్లో ఒక మహిళ ఉన్నది. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి పొద్దుపోవడంతో గాలింపు చర్యలకు ఆటంకి ఏర్పడిందని, శనివారం ఉదయం నుంచి ఓడీఆర్ఏఎఫ్ బృందాలు గల్లంతైన వారి కోసం గాలిస్తున్నాయని జిల్లా కలెక్టర్ కార్తికేయ గోయల్ చెప్పారు. ప్రమాద ఘటనపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పందించారు. నలుగురు మృతిచెందడం పట్ల విచారం వ్యక్తంచేశారు. ఆయా కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం అందజేస్తామని ప్రకటించారు. దీంతోపాటు రక్షించిన వారికి సరైన చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

బీజేపీ సినిమా సూపర్ ఫ్లాప్: తేజస్వి

పాట్నా: లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ వేళ బీజేపీ సత్తా ఏమిటో వెల్లడైందని ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ 400 సీట్లు సినిమా సూపర్ ఫ్లాప్ షో అయిందన్నారు. తొలి దశలో బీహార్‌లోని నాలుగు లోక్‌సభ స్థానాల్లో మహాఘట్‌బంధన్ విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పోలింగ్ అనంతరం బ్లాక్ స్థాయిలోని స్థానిక పార్టీ నేతలతో భేటీ అయ్యానని, వారి నుంచి వివరాలు సేకరించానని తేజస్వి తెలిపారు. పోలింగ్ జరిగిన ఆ లోక్‌సభ స్థానాల్లో తమకు మంచి ఫలితాలు వస్తాయన్నారు. బీజేపీకి బీహార్ ప్రజలు మంచి గుణపాఠం చెబుతారన్నారు. 2014- 2019 మధ్య ప్రధానిగా మోదీ బీహార్ ప్రజలకు చాలా హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ వాటిని ఆయన అమలు చేయలేదని ఆరోపించారు. ఆ పార్టీ నేతల ప్రకటనలు, అమలు కానీ హామీలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారన్నారు. తాము గెలిస్తే బీహార్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో నిరుద్యోగం అతి పెద్ద సమస్యగా ఉందన్నారు. దీనితోపాటు ద్రవ్యోల్బణం, పేదరికం, పెట్టుబడులు, వలసలు, వరదలు తదితర అంశాలు రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. వాటిని నిర్మూలించేందుకు మహాఘట్‌బంధన్, ఇండియా కూటమి కలిసి పనిచేస్తాయని తేజస్వి స్పష్టం చేశారు. దేశంలో రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అలా చేస్తే... వారే నాశనమైపోతారన్నారు. ఇక తొలి దశలో జుమాయి, నవడా, గయా, ఔరంగాబాద్ లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ పోలింగ్‌లో 48.88 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

'ఇండియా' కూటమి గెలుపు అవశ్యం

మురళిని గెలిపించుకుందాం: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో -తిరుపతి: సార్వత్రిక ఎన్నికల్లో 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. 'ఇండియా' కూటమి తిరుపతి శాసనసభ అభ్యర్థిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు తిరుపతిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ వామపక్ష పార్టీలు నిత్యం ప్రజా సమస్యలపై ప్రదర్శనలు, నిరసనలు చేస్తుంటాయన్నారు. అయితే నేడు తాము రాజకీయ హక్కుల కోసం ప్రజల ముందుకు వస్తున్నామన్నారు. ప్రజల ముఖం, తిరుపతి వీధులు తెలియని వారు, ఈ చివరి నుంచి ఆ చివరి వరకు పేర్లు చెప్పలేని వారు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నార న్నారు. సీపీఐ నుంచి ప్రజల తలలో నాలుకలా పనిచేస్తున్న పి.మురళి 'ఇండియా' కూటమి అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. నిరంతరం పోరాటాల్లో ఉన్న వారిని గెలిపించుకోవాలో...లేక ఇప్పటికిప్పుడు ప్రజల ముందుకు తెచ్చిన వారిని గెలిపించుకోవాలో...లేక దేవుని పేరు చెప్పుకునే వారిని గెలిపించుకోవాలో తిరుపతి ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీతో కలసి 'ఇండియా' కూటమి తరపున జాతీయ, రాష్ట్రస్థాయిల్లో తమ పార్టీ అభ్యర్థులను ఈ ఎన్నికల్లో బరిలో దించుతున్నామన్నారు. కేంద్రంలో బీజేపీ ఏం చేస్తుందో ప్రజలందరికీ తెలుసన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని నారాయణ విమర్శించారు. దేవుని పేరుతో ప్రజలను మభ్య పెట్టడం తప్ప... ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లుగా ఏపీకి బొట్టు కూడా సాయం చేయలేదన్నారు. విభజన చట్ట హామీలు అమలు చేయలేదని... వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించలేదని... జిల్లాకు రూ.50 కోట్లు ఇస్తామని చెప్పిన హామీ అటకెక్కిందన్నారు. కడపలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటు చేయలేదన్నారు. రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి బీజేపీ ప్రభుత్వం సాయం చేయలేదని నారాయణ మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ఏపీని అన్ని విధాలా అధోగతి పాలు చేసిందని ఆయన విమర్శించారు. ఇక జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి కానీ... ప్రత్యేక హోదా, విభజన చట్టం హక్కుల గురించి ఏనాడూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఎపుడు దిల్లీ వెళ్లినా తన కేసులు గురించి కేంద్ర పెద్దల కాళ్లు పట్టుకోవడం తప్ప... రాష్ట్ర హక్కుల గురించి మాట్లాడలేదని నారాయణ విమర్శించారు. ఓట్ల కోసం టీడీపీ, జనసేనతో బీజేపీ కూటమి కట్టిందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని నారాయణ ప్రశ్నించారు. ఏం న్యాయం చేశారని టీడీపీ ఈ ఎన్నికల్లో బీజేపీ వైపు వెళుతోందని నారాయణ నిలదీశారు. బీజేపీకి అండగా ఉన్న వారందరూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లేనని ఆయన అభిప్రాయపడ్డారు. టీడీపీ, వైసీపీ రెండూ బీజేపీ చెప్పినట్లే చేస్తాయన్నారు. టీడీపీ కూటమి, వైసీపీ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు పార్టీలో ఎవరికి ఓటు వేసినా మోదీకి వేసినట్లేనన్నారు. అందుకే తిరుపతిలో ప్రజల కోసం పని చేసే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి మురళి వైపు నిలబడాలని కోరుతున్నామన్నారు. కంకి, కొడవలి గుర్తుకు ఓటు వేసి మురళిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కష్టజీవులు, సామాన్యులు చేసే పోరాటాలపై నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. సార్వత్రిక ఎన్నికలు కూడా సవ్యంగా జరగకుండా చేయడానికి బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని రమాదేవి ఆరోపించారు. నిరంకుశ వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ నేత మురళి తిరుపతిలో పోటీ చేయడం హర్షణీయమన్నారు. ఇది కార్మిక వర్గాలకు వచ్చిన మంచి అవకాశంగా ఆమె అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాగంటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... 'ఇండియా' కూటమి అభ్యర్థి మురళికి వామపక్షాలతో పాటు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, వీసీకే పార్టీలు మద్దతు ఇస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమం కోసం తన మేనిఫెస్టోలో అనేక అంశాలు చేర్చిందని గోపాల్ రెడ్డి చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అవినీతిలో కూరుకుపోయిందని... భూకబ్జాలు పెరిగి పోయాయన్నారు. ఇవి పోవాలంటే ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, తిరుపతి నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, రామచంద్రయ్య, చిన్ని రాజ్, సుధాకర్ రెడ్డి, బాలకృష్ణ, బండి చలపతి, నదియా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి జనార్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, కోదండ, దాసరి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కందారపు మురళి, నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జయచంద్ర, సాయి లక్ష్మి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, తిరుపతి, చిత్తూరు కళాకారులు గుర్రప్ప, నాగరాజు, కాలయ్య, సూరి తదితరులు ఆలపించిన విప్లవ గేయాలు...ఆట పాట నగర ప్రజలను ఆకట్టుకుంది.

మద్య నిషేధ హామీ ఏమైంది?

మాట తప్పి ఓట్లు అడుగుతున్న జగన్‌పై రామకృష్ణ ధ్వజం

విశాలాంధ్ర-విజయవాడ: సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీ, మద్యాన్ని ఏరులై పారిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. 2019 ఎన్నికల ప్రచారంలో... వైసీపీ అధికారం చేపడితే మద్యాన్ని సంపూర్ణంగా నిషేధిస్తామని జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన నాటి నుంచి నాసిరకం మద్యం అమ్మకాలు సాగిస్తూ కోట్లాది రూపాయలను అక్రమంగా ఆర్జించారని ఆరోపించారు. సీఎం జగన్ హయాంలో మద్యం అమ్మకాలు ఎన్నడూ లేనంతగా జరిగాయన్నారు. మద్యాన్ని నిషేధించి మాత్రమే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతానన్నా జగన్ మాట తప్పి, మడమ తిప్పారని ధ్వజమెత్తారు. మద్యం అమ్మకాలను తాకట్టుపెట్టి రూ. కోట్లు అప్పులు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చివరకు 'సిద్ధం' సభలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో కేసులకొద్దీ మద్యం బాటిళ్లను ఏర్పాటుచేసి పంపిణీ చేయించడం సిగ్గుచేటు అన్నారు. నామినేషన్ల జన సమీకరణకు పెద్దఎత్తున మద్యం, డబ్బులు పంపిణీ చేయడమే అందుకు నిదర్శనం అన్నారు. వైసీపీ శ్రేణులు అనేక చోట్ల మద్యం డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసినట్లు వార్తలు గుప్పుమంటున్నాయని చెప్పారు. హామీలన్నీ అమలు చేశామని, అందుకే ఎన్నికల్లో ఓట్లడిగేందుకు ప్రజల మధ్యకు వస్తున్నామన్న జగన్ 'మద్య నిషేధ హామీ' ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిని అటకెక్కించి, డబ్బు పంపిణీ ద్వారా ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టి లబ్దిపొందేందుకు వైసీపీ ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. అదే కోవలో ప్రతిపక్ష టీడీపీ కూడా డబ్బు పంపిణీ ద్వారానే ఓట్లు పొందేందుకు సిద్ధపడటం తగదని హితవు పలికారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అవుతుందన్నారు. ఈ అంశాలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టిపెట్టి, ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ నివారించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రామకృష్ణ కోరారు.

'ఇండియా' అభ్యర్థులను గెలిపించండి: జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: భారత రాజ్యాంగం రక్షింపబడాలంటే కాంగ్రెస్ నాయకత్వంలో ఏర్పడిన ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. సీపీఐ బాపట్ల జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం సీపీఐ చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ మతోన్మాద బీజేపీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని అన్నారు. మతతత్వ బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలంటే ఇండియా కుటమి అభ్యర్థులకు ఓటు వేయాలని సూచించారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, కార్మికుల హక్కులు కాలరాస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసరాలు ఆకాశాన్నంటుతున్నా స్పందించడం లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ వారి బ్యాంక్ బకాయిలను రద్దు చేసేందుకు మాత్రమే మోదీ శ్రద్ధతో పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేకి మోదీని ఆయన సారథ్యంలో పనిచేస్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ఓడించాలని కోరారు. మణిపూర్, కర్నాటక, దిల్లీ వంటి రాష్ట్రాల్లో క్రైస్తవులు, ముస్లింలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దేశంలో ప్రజలకు శాంతి, రక్షణ, సంక్షేమం అందాలంటే ఇండియా కూటమిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి ప్రచారం చేయాలన్నారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యవంతులను చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జేడీ శీలం, ఆరు నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యవర్గం జిల్లా అంతా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు తుమ్మల పూర్ణచంద్రశేఖర్, జేబీ శ్రీధర్, బత్తుల శామ్యూల్, కె.ఎల్.డి ప్రసాద్, షేక్ కాలేషా ఖాదర్‌బాషా, సన్నమూరి శ్రీనివాసరావు, కోలా వీరాంజనేయులు, షేక్ షంషున్‌బీ, షేక్ నాగూర్‌వలీ, మేకల రమణయ్య, జి.రత్నకుమారి, అద్దంకి నాగేశ్వరరావు, వెంకాయమ్మ, బాబురావు పాల్గొన్నారు.

ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలి

- బొండా ఉమాను కేసులో ఇరికించే కుట్ర
- సీఈసీకి రవీంద్ర ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ సీనియర్ నేత కనకమేడల రవీంద్రకుమార్ శనివారం మరో లేఖ రాశారు. సీఎంపై రాయి దాడి కేసులో తమ పార్టీ విజయవాడ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావును ఇరికించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. బొండా ఉమా పోటీ చేయకుండా అడ్డుకునేందుకు వారు ప్రయత్నిస్తున్నారని, ఈసీ వెంటనే జోక్యం చేసుకోవాలని కనకమేడల లేఖలో విజ్ఞప్తి చేశారు. అనంతరం కనకమేడల మీడియాతో మాట్లాడుతూ ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు చెరగని ముద్ర వేశారని, అభివృద్ధి, సంక్షేమం, సంపద సృష్టికి ఆయన ఒక బ్రాండ్ అని కితాబిచ్చారు. చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా దిల్లీలో కనకమేడల కేక్ కోసి వేడుకలు చేశారు.

గులకరాయి దర్శకునికి సన్మానం చేస్తాం: అచ్చెన్నాయుడు హెచ్చరిక

ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేసిన బొండా ఉమాను జగన్ కావాలనే వేధిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు మండిపడ్డారు. సీపీ ప్రకటనపై ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించాలన్నారు. అధికారులు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఇప్పటికే గవర్నర్‌కి ఫిర్యాదు చేశాం. దీనిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి. ఎమ్మెల్యే అభ్యర్థిని వైసీపీని వేధించటంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తాం. వేధింపులు ఆపకపోతే అధికారులు భవిష్యత్‌లో మూల్యం చెల్లించక తప్పదు. జగన్ చెప్పినట్టు ఆడి మీ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. మరో నెల రోజుల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం వస్తుంది. గులకరాయి డ్రామా గూడు పుఠానీ బయటపెడతాం. ఈ డ్రామాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించని వారికి తగిన రీతిలో సన్మానం చేస్తామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

బీజేపీకి అధికారమిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు

'ఇండియా' ఎంపీ అభ్యర్థి జంగాల ఆందోళన

విశాలాంధ్ర-పెదకాకాని: బీజేపీకి మరోసారి అధికారమిస్తే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేస్తారని 'ఇండియా' కూటమి బలపరచిన గుంటూరు పార్లమెంటు సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా పెదకాకాని సీపీఐ కార్యాలయంలో 'ఇండియా' కూటమి ముఖ్య కార్యకర్తల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పార్లమెంటు అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ రెండవ దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, మత ఘర్షణలు ప్రేరేపించడం వలన క్రిస్టియన్లకు, మైనార్టీలకు రక్షణ కరువైందన్నారు. ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా మోదీ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని, ప్రజలు ఆ రెండు పార్టీలకు ఓట్లు వేస్తే బీజేపీకి వేసినట్లేనని అన్నారు. తాము సీపీఐగా సీఏఏపై నిరంతర పోరాటం కొనసాగించామని, ముస్లిం మైనార్టీ వర్గాలకు అండగా ఉండే పార్టీ సీపీఐ అని, కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి తనను పార్లమెంటుకు పంపించాలని, పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జక్కా రవీంద్రనాథ్‌ను హస్తం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంతేటి యలమంద రావు, సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేలు పెన్షన్, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్, రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో పండించిన పంటకు మద్దతు ధర, ఇల్లు లేని వారికి రూ.5 లక్షలతో ఇల్లు కట్టించటం, కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య, ప్రత్యేక హోదా 10 సంవత్సరాలతో పాటు స్త్రీలకు బస్సులలో ఉచిత ప్రయాణం వంట గ్యాస్ సిలిండర్లు రూ.450కు, ప్రతి ఇంటిలో ఒక మహిళకు నెలకు రూ.8,333 చొప్పున ఏడాదికి లక్ష రూపాయలు, రైతు రుణమాఫీ రూ.2 లక్షలు, పనికి ఆహార పథకం కార్మికులకు రోజుకు రూ.400 కనీస వేతనంతో పాటు నిరుద్యోగులకు మొదటి సంవత్సరంలో కేంద్రం ద్వారా రూ.30 లక్షల ఉద్యోగాల భర్తీ చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కేతినేని అగస్టీన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, గోపి, సుబ్బారావు, నాగుల్ మీరా, జొన్నల వెంకటరెడ్డి, నికల్సన్, కోటిపల్లి సత్యనారాయణ, ఉల్లంగుల శివయ్య, కేతినేని వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ప్రముఖ కంపెనీల్లో 64 వేల మందికి ఉద్వాసన

వాషింగ్టన్: అంతర్జాతీయ అనిశ్చితులు, ఇటీవల నెలకొంటున్న భౌగోళిక రాజకీయ పరిణామాల వల్ల టెక్ కంపెనీలు మెరుగైన ఫలితాలు సాధించలేదు. క్రమంగా నష్టాల్లోకి చేరుకుంటున్న కంపెనీలు కాస్ట్‌కటింగ్ పేరిట ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. పెద్ద కంపెనీ, చిన్న కంపెనీ అనే తేడా లేకుండా దాదాపు అన్నింటిలోనూ ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. ఇటీవల కాలంలో కేవలం దేశంలోని టాప్ 3 కంపెనీల్లోనే దాదాపు 64 వేల మంది ఉద్యోగులు తగ్గినట్లు తెలిసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రోల నుంచి 64 వేల మంది ఉద్యోగులు బయటకుపోయినట్లు సమాచారం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఐటీ కంపెనీలకు ప్రధానంగా బ్యాంక్‌లు కస్టమర్లుగా వ్యవహరిస్తుంటాయి. వీటితోపాటు మరెన్నో రంగాల్లో కస్టమర్లు ఉంటారు. కానీ డబ్బు సమృద్ధిగా ఉండి నిత్యం అప్‌డేట్‌లు కోరుకునే రంగంలో బ్యాంకింగ్ ఒకటి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంక్‌లు తమ సాఫ్ట్‌వేర్‌ను, తమ అవసరాలకు తగ్గట్టు వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేసుకోవాలనుకోవడం లేదు. అత్యవసరమైతే తప్ప ఈ చర్యలకు పూనుకోవడం లేదు. ప్రధానంగా కీలక వడ్డీరేట్లలో సెంట్రల్ బ్యాంకులు, ఫెడ్ ఎలాంటి మార్పులు తీసుకురావడం లేదు. దాంతో బ్యాంకులకు ఆశించినమేర లాభాలు చేకూరడం లేదని అభిప్రాయాలున్నాయి. దాంతో ఐటీ వ్యవహారాల్లో పెట్టుబడి పెట్టేందుకు వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. ఫలితంగా ఐటీ రంగానికి కస్టమర్లు తగ్గిపోయి వాటికీ నష్టం వాటిల్లుతోంది. కాస్ట్‌కటింగ్ పేరుతో ఉద్యోగాల్లో కోత తప్పడం లేదన్న వాదనలున్నాయి.

మోదీ దేశానికి ప్రధానా... బీజేపీకా?

శరద్ పవార్ సూటి ప్రశ్న



ఛత్రపతి శంభాజీనగర్: ప్రధాన మంత్రి దేశానికి చెందినవాడని, దేశాన్ని నడిపించే బాధ్యతను కలిగి ఉన్నాడని, అయితే నరేంద్ర మోదీ ప్రసంగాలు ఆయన 'బీజేపీకి ప్రధాని' అని సూచిస్తున్నాయే కానీ భారతదేశానికి కాదని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం విమర్శించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన ప్రచార ర్యాలీలో ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు మాట్లాడుతూ ప్రతిపక్షాలపై దాడి చేసే బదులు తాను, తన పార్టీ దేశం కోసం ఏమి చేస్తుందో ప్రధాని మోదీ ప్రజలకు చెప్పాలన్నారు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) అభ్యర్థులు ఔరంగాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి శివసేన (యూబీటీ) టికెట్‌పై పోటీ చేస్తున్న చంద్రకాంత్ ఖైరే, జల్నా నుంచి కాంగ్రెస్‌కు చెందిన కళ్యాణ్ కాలే ప్రచారం కోసం పవార్ ఇక్కడకు వచ్చారు. రాష్ట్రంలోని మరాఠ్వాడా ప్రాంతంలో ఉన్న సెంట్రల్ మహారాష్ట్ర నియోజకవర్గాలకు మే 13న నాల్గవ దశలో ఎన్నికలు జరగనున్నాయి. పవార్ మాట్లాడుతూ 'నేను ఇక్కడికి (ఛత్రపతి శంభాజీనగర్) వచ్చే ముందు నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వింటున్నాను. ప్రధాని దేశం మొత్తానికి చెందినవారు. మోదీ ప్రసంగాలు వింటుంటే ఆయన దేశానికి కాదు బీజేపీకి ప్రధాని అని అనిపిస్తోంది' అని అన్నారు. దేశానికి ఏం చేస్తారో ప్రధాని మోదీ, బీజేపీ ప్రజలకు చెప్పాలని ఎన్‌సీపీ అధ్యక్షుడు అన్నారు. 'కానీ కొన్నిసార్లు వారు నెహ్రూ (దేశానికి చెందిన మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ), కొన్నిసార్లు రాహుల్ గాంధీని, కొన్నిసార్లు నన్ను కూడా విమర్శిస్తారు' అని అన్నారు. నెహ్రూ తన జీవితంలో పదేళ్లకు పైగా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడుతూ జైలు జీవితం గడిపారని, ఆయన సైన్స్‌ను ప్రోత్సహించారని పవార్ చెప్పారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ఇటీవలి నివేదిక ప్రకారం, కళాశాల నుంచి బయటకు వస్తున్న 100 మంది విద్యార్థులలో 87 మంది భారతదేశంలో నిరుద్యోగులుగా ఉన్నారని వివరించారు. మరఠ్వాడా గురించి మాట్లాడుతూ 'ఈ ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో తీవ్రమైన కరువు ఉంది. కానీ ఈ పరిస్థితిని పరిష్కరించేందుకు కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి సమయం లేదు' అని విమర్శించారు.

శరద్ పవార్‌పై మైక్రోఫోన్ దాడి

శరద్ పవార్ ఓ సభలో మాట్లాడుతుండగా ఆయన వైపు మైక్రోఫోన్ ఒకటి దూసుకురావడం కలకలం రేపింది. విలేకరి ఒకరు దానిని విసరగా...ఆ పరికరం పవార్‌ను తాకక ముందే భద్రతా సిబ్బంది దానిని అడ్డుకున్నారు. బారామతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతంలో ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. బారామతి లోక్‌సభ స్థానంలో ఎన్సీపీ (ఎస్‌పీ) తరపున శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే బరిలో ఉన్నారు. ఆమెకు పోటీగా మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ పోటీ చేస్తున్నారు. మైక్రోఫోన్ ఘటనపై విచారణ జరిపిన పోలీసులు....స్థానిక విలేకరికి ఎలాంటి దురుద్దేశాలు లేవంటూ క్లీన్‌చిట్ ఇచ్చారు.

ఎంసీడీ మేయర్ ఎన్నికల్లో ఆప్‌కు కాంగ్రెస్ మద్దతు

న్యూదిల్లీ: ఏప్రిల్ 26న జరగనున్న ఎంసీడీ మేయర్ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థులకు పార్టీ కౌన్సిలర్లు మద్దతు ఇస్తారని కాంగ్రెస్ శనివారం ప్రకటించింది. దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మేయర్ ఎన్నికలకు ఆప్ తరపున మేయర్ పదవికి మహేష్ ఖీచి, డిప్యూటీ మేయర్‌గా రవీందర్ భరద్వాజ్‌ను పోటీకి దింపింది. దిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కమ్యూనికేషన్స్ విభాగం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అనిల్ భరద్వాజ్ మాట్లాడుతూ సీనియర్ నాయకులు ఒక సమావేశం నిర్వహించారని, ఈ సందర్భంగా పార్టీ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. దిల్లీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా, వారి పని జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భరద్వాజ్ తెలిపారు. దిల్లీలో లోక్‌సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కూటమిగా పోటీ చేస్తున్నాయి. మేయర్ ఎన్నికలను నిర్వహించడానికి ఎంసీడీ శుక్రవారం ఎన్నికల కమిషన్ అనుమతి కోరింది. ప్రిసైడింగ్ అధికారిని నియమించాలని లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనాను కోరినట్లు పౌర సంఘం అధికారి ఒకరు తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ఎన్నికలు నిర్వహించేందుకు మున్సిపల్ బాడీ ఎన్నికల సంఘం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇదిలాఉండగా, ప్రతిపక్ష బీజేపీ మేయర్ పదవికి కిషన్‌లాల్, డిప్యూటీ మేయర్‌గా నీతా బిష్త్‌ను పోటీకి దింపింది.

మోదీ అవినీతి పాఠశాలను మూసేస్తాం: రాహుల్

న్యూదిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో అవినీతి పాఠశాలను నడుపుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ నేతలకు అవినీతి పాఠాలను ఆయన చక్కగా బోధిస్తున్నారని 'ఎక్స్' (ట్విటర్) వేదిక వ్యాఖ్యానించారు. ఈ స్కూల్‌లో 'డొనేషన్ బిజినెస్' అనే కోర్స్‌లోని ప్రతీ అధ్యాయాన్ని స్వయంగా ఆయనే బోధిస్తున్నారు. దానాన్ని కూడా వ్యాపారంగా ఎలా మార్చాలో మోదీ వివరిస్తారు. "సోదాలు నిర్వహించి విరాళాలు ఎలా సేకరించాలి... విరాళాలు తీసుకున్న అనంతరం ఒప్పందాల పంపిణీ ఎలా చేయాలి అనే అంశాలను వివరిస్తారు" అని రాహుల్ ఆరోపించారు. అయితే, కాషాయ పార్టీలోని ప్రతి నేతకూ ఈ కోర్సును తప్పనిసరి చేసిందన్నారు. అవినీతిపరుల నేర మరకలను వాషింగ్ మెషీన్‌లా కడిగేస్తోందంటూ బీజేపీని ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు. ఏజెన్సీలను రికవరీ ఏజెంట్లుగా మార్చి 'బెయిల్', 'జైలు' అనే గేమ్‌ను ఎలా ఆడాలో వివరించగలరన్నారు. అవినీతికి బీజేపీ నిలయంగా మారిందని విమర్శించారు. ఒక వేళ సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే మోదీ నడుపుతున్న అవినీతి పాఠశాలతో పాటు ఈ కోర్సును పూర్తిగా మూసివేస్తుందని అన్నారు.

దేశం కోసం ఐదు నిమిషాలు

ఓటు హక్కుపై జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ప్రజలను కోరారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఓటు హక్కుపై చైతన్యం కలిగించడానికి ఎన్నికల సంఘం 'మై ఓట్ మై వాయిస్' మిషన్‌లో భాగంగా ఓ వీడియోను విడుదల చేసింది. ఇందులో జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. దేశ పౌరులైన మనకు రాజ్యాంగం అనేక హక్కులను కల్పించింది. అలాగే ఈ ప్రజాస్వామ్య దేశంలో జరిగే ఎన్నికల్లో ఓటు వేయడం పౌరులుగా మన ప్రధాన బాధ్యత. ఐదు సంతవత్సరాలకు ఒకసారి మన దేశం కోసం ఐదు నిమిషాలు కేటాయించడానికి సాధ్యమవుతుంది కదా. ఓటు హక్కును వదులుకోవద్దని ప్రతిఒక్కరినీ అభ్యర్థిస్తున్నా. గర్వంగా ఓటు వేద్దాం. నా ఓటు నా వాయిస్" అని అన్నారు. దేశంలో ప్రభుత్వాన్ని ఎన్నుకునే గొప్ప అవకాశం ప్రజలకు ఉందని అందుకే రాజ్యాంగంలో 'భారత ప్రభుత్వం ప్రజలచే, ప్రజల కొరకు' అని రాసుందని చంద్రచూడ్ తెలిపారు. తాను మొదటి సారి ఓటు వేయడానికి చూపిన ఉత్సాహాన్ని, ఓటు వేసినప్పుడు కలిగిన ఆనందాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

సమరాంగణం 2024



రాజస్థాన్‌లో ద్విముఖ పోటీ

కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ

రాజస్థాన్‌లో పోరు రసవత్తరంగా జరగబోతోంది. 25స్థానాల్లో నుంచి 23 కోట్ల ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు ఉండనున్నది. మిగతా రెండు స్థానల్లో త్రిముఖ పోరు జరుగబోతోంది. స్వతంత్ర అభ్యర్థి రంగ ప్రవేశం బర్మార్ స్థానంలో త్రిముఖ పోరు నెలకొంది. అలాగే బీఏపీ అభ్యర్థికి కాంగ్రెస్ మద్దతివ్వడం, నామినేషన్ ఉపసంహరణకు కాంగ్రెస్ అభ్యర్థి నిరాకరించడంతో బాన్సవారా స్థానంలోనూ త్రిముఖ పోరు జరగనుంది. రాజస్థాన్‌లో తొలి దశ పోలింగ్ ఈనెల 19న ముగిసింది. ఇక రెండు దశకు రంగం సిద్ధమైంది. తొలి దశలో మొత్తం 12 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. కాగా, 25 స్థానాలకుగాను 266 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.

ఏడారి రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. గత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో 25 స్థానాల్లో కాషాయ జెండా ఎగిరింది. ఈసారి తమదైన ముద్ర వేసి పూర్వవైభవం తెచ్చుకోవాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ఉంది. బీజేపీ వ్యూహాలకు దీటుగా వ్యూహాలతో రాజస్థాన్ ఎన్నికల వేడిని పెంచుతోంది. కమలనాధులకు గట్టి పోటీ ఇచ్చేందుకు హేమాహేమీలను బరిలోకి దించింది. పొత్తులు పెట్టుకుంది. స్టార్ క్యాంపెయినర్లతో ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో పాటు ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వంటి అగ్రనేతలతో ప్రచారం చేయిస్తోంది. రాజస్థాన్‌పై తిరిగి పట్టు సాధించేందుకు సంకల్పించింది. గత రెండు ఎన్నికల్లో బీజేపీ మొత్తం 25 స్థానాలను గెలచుకుంది.

బలం పుంజుకున్న ప్రతిపక్షం

గత ఎన్నికలతో పోల్చితే ప్రస్తుత ఎన్నికల ముఖచిత్రం మారింది. క్షేత్రస్థాయి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. సోనియాగాంధీ రాజస్థాన్‌లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రతిపక్షం బలంగా ఉందన్న సంకేతాలు అందుతున్నాయి. ముఖ్యంగా నాగౌర్, బర్నార్, సిఖర్, చురు, కోటా స్థానాల్లో ప్రతిపక్షానికి అనుకూల వాతావరణం కనిపించింది. తొలి దశలో భాగంగా నాగౌర్, సిఖర్, చురుతో పాటు గంగానగర్, బికానీర్, ఝుంజును, జైపూర్ రూరల్, జైపూర్, అల్వార్, భరత్పూర్, కరౌలీ-ధోల్పూర్, దౌసా స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మాజీ సీఎం వసుంధరా రాజే ఈసారి ఎన్నికలకు దూరం కావడం కూడా రాజకీయాల్లో కొత్తదనానికి అవకాశం ఇచ్చినట్లు అయ్యింది.

మోదీనే నమ్ముకున్న బీజేపీ

బీజేపీ అంతర్గత సవాళ్లు ఎదుర్కొంటోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 14 మంది సిట్టింగ్ ఎంపీలను మార్చింది. మోదీ ఛరిష్మానే పూర్తిగా నమ్ముకున్నది. ఆయనకున్న ప్రజాదరణతో మరోసారి ఏడారి రాష్ట్రాన్ని ఏలాలని ఆశిస్తోంది. ఇదే దీమాతో ముందుకు సాగుతోంది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాధ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా అగ్రనేతలు అనేకమందిని రంగంలోకి దింపి ప్రచారాన్ని నిర్వహించారు. సీఎం భజన్‌లాల్ శర్మ (బీజేపీ నేత)కు ఈ ఎన్నికలు సవాల్ విసిరాయి. మొదటిసారి ఎమ్మెల్యే అయిన ఆయన ఒక్కసారిగా ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన విషయం తెలిసిందే.

కీలక స్థానాలు

రాజస్థాన్‌లోకి కొన్ని ప్రాంతాలు కీలకమైనవిగా మారాయి. ఇలాంటి స్థానాల్లో జాలేర్ ఉంది. ఈ స్థానం యుద్ధక్షేత్రాన్ని తలపిస్తోంది. మాజీ సీఎం అశోక్ గెహ్లాట్ తనయుడు వైభవ్ పోటీలో ఉన్నారు. ఆయనకు ప్రత్యర్థిగా బీజేపీ అభ్యర్థి లుంబరామ్ చౌదరి ఉన్నారు. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మరోమారు జోధ్‌పూర్ నుంచి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కరణ్ సింగ్ ఉచియార్దాతో ఆయన తలపడనున్నారు. దశాబ్దం పాటు పదవిలో ఉన్న షెకావత్‌తో బీజేపీలో అంతర్గతంగా అసంతృప్తి ఉన్నట్లు సమాచారం. బాన్సవారా-దుంగర్పూర్ స్థానాలకూ ప్రాధాన్యత ఏర్పడింది. బాన్సవారాలో భారతీయ ఆదివాసీ పార్టీ (బీఏపీ) రాజ్‌కుమార్ రౌత్ బీజేపీకి చెందిన మహేంద్రజిత్ మాళవియాపై పోటీ చేస్తున్నారు. మాళవియా కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తొలుత ఆర్విండ్ దామర్‌ను కాంగ్రెస్ ఎంపిక చేసిందిగానీ తర్వాత బీఏపీకి మద్దతు ప్రకటించింది. దామర్ మాత్రం తన నామినేషన్ ఉపసంహరణకు ఒప్పుకోలేదు. దీంతో పార్టీ ఆయనను బహిష్కరించింది. కాంగ్రెస్ తరఫున రాజ్‌సమండ్ నుంచి పోటీ చేసేందుకు సుదర్శన్ సింగ్ రావత్ నిరాకరించడం... భిల్వారా అభ్యర్థి అయిన దామోదర్ గుర్జర్ ఈ స్థానానికి బదిలీ అయ్యారు. కాగా, బ్రాహ్మణ నాయకుడు, అసెంబ్లీ మాజీ స్పీకర్ సీపీ జోషి ఇప్పుడు భిల్వారా బరిలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి దామదర్ అగర్వాల్‌పై పోటీ చేస్తున్నారు. మొత్తంగా రాజస్థాన్‌లోని చాలా స్థానాల్లో కాంగ్రెస్‌కు బీజేపీకి మధ్య పోటీ ఉంది. సీపీఎం, ఆర్ఎల్పీ తదితర పార్టీలతో కాంగ్రెస్ కలవటం ఆశక్తికరంగా మారింది. ఎన్నికలపై ఉత్కంఠతను మరింత పెంచింది.

ఇదిలావుంటే, 2019లో బీజేపీ 24 స్థానాల్లో గెలిచింది. ఆ పార్టీకి 59.1శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 34.6శాతం ఓట్లు రాగా ఒక్క స్థానం దక్కలేదు. 2014లో బీజేపీ 25 స్థానాల్లో గెలిచింది. 55.6శాతం ఓట్లు పొందింది. కాంగ్రెస్ 30.7శాతం ఓట్లతో సర్దుకున్నది. ఒక్క స్థానంలోనూ గెలవలేదు. 2009లో మాత్రం కాంగ్రెస్ 20 స్థానాల్లో విజయం సాధించింది. 47.2శాతం ఓట్లు పొందింది. బీజేపీ కేవలం నాలుగు స్థానాలకు పరిమితమైంది.

53 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పొత్తులు...

రాజస్థాన్‌లో కాంగ్రెస్ దాదాపు 53 ఏళ్ల తర్వాత పొత్తులు పెట్టుకున్నది. ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపింది. ఆర్ఎల్‌పీ అధ్యక్షుడు బెనివాల్ 2019లో బీజేపీతో కలిసి పోటీ చేసి గెలిచారు. ఇప్పుడు నాగౌర్ నుంచి ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచారు. వామపక్షాల కంచుకోట సిఖర్ నుంచి సీపీఎం మాజీ ఎమ్మెల్యే అమ్రా రామ్ 'ఇండియా' తరఫున పోటీ చేస్తున్నారు. బాన్సవారా, దుంగార్పూర్ స్థానాల్లో భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ) అభ్యర్థి రాజ్‌కుమార్ రౌత్‌కు కాంగ్రెస్ మద్దతిస్తోంది. ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ దామోర్ నామినేషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరణకు నిరాకరించారు. పార్టీ బహిష్కరణ వేటు వేసినప్పటికీ పోటీలోనే ఉన్నారు. దీంతో త్రిముఖ పోరు నెలకొంది. కాంగ్రెస్ నుంచి తమ పార్టీలోకి వచ్చిన గిరిజన నాయకుడు మహేంద్రజీత్ సింగ్ మాళవియాను బాన్సవారా నుంచి బీజేపీ పోటీ చేయిస్తోంది. మాళవియా పార్టీ ఫిరాయింపు కాంగ్రెస్‌కు నష్టమే అయినా రౌత్‌కు గిరిజనలు ఓటేస్తాయని ఆశిస్తోంది.

ఫిరాయింపుల హేలా...పోరు రసవత్తరం

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా జాట్, ఓబీసీ వర్గాలకు చెందిన వారు అనేక మందిని తమ పార్టీలోకి బీజేపీ చేర్చుకుంది. ఫిరాయింపు నేతల్లో మాజీ మంత్రులు లాల్‌చంద్ కటారియా, రాజేంద్ర సింగ్ యాదవ్ ఉన్నారు. విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి జస్వంత్ సింగ్ తనయుడు మన్వేంద్ర సింగ్ ఐదేళ్ల తర్వాత బీజేపీలోకి తిరిగి వచ్చారు. 2014, 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని 25 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. ఈసారి కాంగ్రెస్ అనుసరించిన వ్యూహంతో పోరు రసవత్తరంగా సాగబోతోంది. సిఖర్, నాగౌర్, చురు, కోటా, బాన్స్‌వారా, బార్మర్ స్థానాల్లో నువ్వా-నేనా అన్న పరిస్థితి ఉంది. షియో స్వతంత్ర ఎమ్మెల్యే రవీంద్ర సింగ్ భారతి (26) బార్మర్ బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. 2023లో ఎన్నికైన పిన్నవయస్సు శాసనసభ్యునిగా రవీంద్ర సింగ్ భారతి నిలిచారు. ఓబీసీ ఓట్ల కోసం రెండు పార్టీలు ప్రత్యేక హామీలు ఇస్తోంది. గతంలో వలే కాంగ్రెస్‌పై గుజ్జర్లకు అసంతృప్తి లేదు. ఈసారి హస్తం గుర్తుకే ఓటు వేసే అవకాశాలున్నాయి. ఇక జాట్‌లు, మాలీలు, కుంహారులతో పాటు ముస్లింలు, ఎస్సీలు, ఎస్టీల ఓట్లు కూడా కాంగ్రెస్‌కే పడబోతున్నాయి. అగ్రవర్ణాలు మాత్రమే బీజేపీ వైపు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఆదరించిన రాజ్‌పుట్‌లు ఇప్పుడు ఆ పార్టీపై కన్నెర్ర చేశారు. కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాలా ఇటీవల గుజరాత్‌లో చేసిన వ్యాఖ్యలు రాజ్‌పుట్‌ల ఆగ్రహానికి కారణమయ్యాయి. రాజ్‌కోట్ అభ్యర్థిగా రూపాలాను మార్చేందుకు బీజేపీ నిరాకరించడం కూడా ఈ వర్గాన్ని రెచ్చగొట్టినట్లు అయ్యింది. దీని ప్రభావం గుజరాత్‌తో పాటు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోనూ బీజేపీపై ఉండనున్నది.

చమోలీ ప్రజల ఎన్నికల బహిష్కరణ

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలోని అనేక గ్రామాల ప్రజలు తాజా సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించారు. తమ గ్రామాలను కలిపే రోడ్లు లేక ఏది కావాలంటే కొన్ని కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తున్నట్లు తెలిపారు. కనీస మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతుంటే పట్టించుకునే నాధుడే కరవయ్యాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. రోడ్డు వేసేంత వరకు ఓటు వేయరాదని నిర్ణయించినట్లు తెలిపారు. సరైన రోడ్డులు లేక సకాలంలో వైద్యం పొందలేకపోతున్నట్లు వాపోయారు. వృద్ధులు, గర్భిణులు, వ్యాధిగ్రస్తుల పరిస్థితి దయనీయంగా ఉన్నట్లు తెలిపారు. రోగులను భుజాలపై మోసుకెళ్లాల్సి వస్తోందన్నారు. సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని గతేడాది డిసెంబరులోనే పిలుపు ఇచ్చినట్లు గనాయి గ్రామానికి చెందిన ప్రదీప్ ఫర్ష్‌మాన్ వెల్లడించారు. 'గత రెండేళ్లలో ఇద్దరు మహిళలు ఆసుపత్రికి వెళుతుండగానే మార్గంమధ్యలో ప్రసవించారు. మా గ్రామానికి రోడ్డు వేయనంత వరకు ఓటింగ్‌లో పాల్గొనరాదని డిసెంబరులోనే నిర్ణయించుకున్నాం. ఇదే అంశమై డిసెంబరు 11న సీఎంకు లేఖ రాశాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామ ప్రతినిధులు, మహిళలు కలిసి జిల్లా మెజిస్ట్రేట్‌కు లేఖ పంపారు. మార్చి 30న కొందరు అధికారులు మా ప్రాంతానికి వచ్చారు. పది రోజుల్లో నివేదిక సమర్పిస్తామని చెప్పారు కానీ అది ఇంత వరకు జరగలేదు. ఈ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మించవచ్చని 2017లో ఓ నివేదిక వచ్చింది. ఆ పని మొదలైతేగానీ ఎన్నికల్లో పాల్గొనబోం' అని ప్రదీప్ చెప్పారు. అనారోగ్యానికి గురైనప్పుడు అంబులెన్స్ కోసం రోగులను భుజాలపై మోసుకొని పాతాళగంగ మార్కెట్ వరకు తీసుకెళ్లాల్సిన వస్తోందని చెప్పారు. ఈ గ్రామంలో 550 మందికిపైగా ఓటర్లున్నారు.

వృద్ధులు ఇంటి వద్దనే ఓటేసేందుకు వీలుగా ఓటింగ్ యంత్రంతో అధికారులు గ్రామానికి వచ్చినప్పుడు 85ఏళ్ల వృద్ధురాలు ఓటు వేసేందుకు నిరాకరించారని దీపక్ ఫర్ష్‌మాన్ వెల్లడించారు. తన జీవిత కాలంలో పక్కా రోడ్డు చూడలేదని... భావితరాలకూ ఇలాంటి కష్టాలు ఉండరాదనే నిరసన వ్యక్తం చేసినట్లు ఆమె అన్నట్లు తెలిపారు. ఆహారంతో పాటు నిత్యావసరాల తరలింపునకు స్థానికులు అదనంగా చెల్లించాల్సి వస్తోందని పక్ చెప్పారు.

భంగుల్ గరాహ్ గ్రామానికి చెందిన జితేంద్ర సింగ్ కన్యల్ మాట్లాడుతూ 2021లో వచ్చిన మెరుపు వరదకు వంతెన కొట్టుకుపోయిందని, తపోవన్ మార్కెట్‌కు వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందన్నారు. తమ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి 2011, 2018లో అనుమతులు వచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు లేవన్నారు. తహశీల్దారు తమతో రెండు సార్లు కలిసినప్పటికీ చర్చలు ఫలించలేదని చెప్పారు. ఎన్నికలు బహిష్కరించాలన్న నిర్ణయం మారదన్నారు. అయితే ఎన్నికలు బహిష్కరించాలన్న పిలుపును కంకాల్ మల్లా గ్రామం వారు ఉపసంహరించుకున్నారు. రోడ్డు వేస్తామన్న స్థానిక ఎమ్మెల్యే హామీతో వారు వెనక్కితగ్గారు. 'ప్రజారవాణా కోసం నాలుగు-ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. ఎన్నికలు బహిష్కరించాలని మార్చిలో పిలుపునిచ్చాం. ఎమ్మెల్యే అనిల్ నౌటియల్ నుంచి అభయం లభించడంతో ఆ పిలుపును ఉపసంహరించుకున్నాం' అని రాజేంద్ర కట్యారి తెలిపారు. ఎన్నికల తర్వాత రోడ్డు నిర్మాణం మొదలవుతుందని ఎమ్మెల్యే హామీనిచ్చారని ఖిల్‌దేవ్ రావత్ తెలిపారు. ఆయన చెప్పినట్లు జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. పోలింగ్ రోజే తన కుమార్తె వివాహం ఉందని, ముందు ఓటు వేసి ఆ తర్వాత అతిథులకు స్వాగత సత్కారాలు చేస్తామని రావత్ చెప్పారు.



నాటి మావోయిస్టు కోటలో
30ఏళ్ల తర్వాత పోలింగ్

ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న జార్ఖండ్‌లోని హేసాతు గ్రామంలో మూడు దశాబ్దాల తర్వాత పోలింగ్ జరగబోతోంది. బుధా పహార్ ప్రాంతంలోని ఈ గ్రామం పరిధిలో పలాము, ఛత్ర లోక్‌సభ స్థానాలున్నాయి. 30ఏళ్ల తర్వాత సొంత గ్రామంలోనే స్థానికులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గతంలో భద్రతా కారణాలతో ఈ గ్రామానికి దూరంగా పోలింగ్ బూత్ ఉండేది. ఇప్పుడు పరిస్థితులు మారడంతో స్థానికుల కోరిక మేరకు గ్రామంలోనే పోలింగ్ నిర్వహించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. బుధా పహార్‌లో మావోయిస్టులు లేరని జార్ఖండ్ పోలీసులు ప్రకటించారు. అయినప్పటికీ హేసాతు మినహా నాలుగు పోలింగ్ కేంద్రాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 'హేసాతు పోలింగ్ కేంద్రం బుధా పహార్‌లో ఉన్నది. 760 మంది తమ నిర్భయంగా ఓటు వేయగలరు' అని గర్హ్వా డీసీ శేఖర్ జమ్వార్ వెల్లడించారు. గ్రామ ప్రజలతో అనేక సమావేశాల తర్వాత ఈ పోలింగ్ కేంద్రాన్ని తరలించరాదన్న నిర్ణయం జరిగిందన్నారు. లాజిస్టిక్ సమస్యలు ఉన్నప్పటికీ నిరంతరాయంగా పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉన్నట్లు అధికారులు తెలిపారు. బుధా పహార్ పైన ఉండే ఝాలుదేరా, బహేరటోలీ, తిసియా, నవటోలీ గ్రామంలో ఓటర్ ఐడీలను మొదటిసారి తయారు చేశారని, కుల్హి, తేసాతు, నవటోలీలో తొలిసారి ఓటింగ్ జరగబోతోందని స్థానికులు చెప్పారు. గతంలో ఓటు వేసేందుకు కొండలు, అడవులు దాటుకొని వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు సొంత ఊర్లలోనే ఓటింగ్ సౌకర్యం ఉంటోందని అన్నారు.

ఖజురహో 'ఏఐఎఫ్‌బీ' అభ్యర్థికి కాంగ్రెస్, ఎస్పీ మద్దతు

మధ్యప్రదేశ్‌లోని ఖజురహో స్థానానికి ఇండియా కూటమి అభ్యర్థిగా ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) తరపున ఆర్‌బీ ప్రజాపతి పోటీలో ఉన్నారు. ప్రజాప్రతికి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మద్దతు ప్రకటించాయి. ఇదే స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరపున ఇండియా కూటమి అభ్యర్థిగా మీరా యాదవ్ వేసిన నామినేషన్ తిరస్కరణకు గురైన క్రమంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. ఇండియా కూటమి అధికారిక అభ్యర్థి ప్రజాపతి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. ఖజురహో స్థానాన్ని కూటమిలో భాగంగా సమాజ్‌వాదీ పార్టీకి కేటాయించగా... ప్రజాస్వామ్య నియమాలకు విరుద్ధంగా అధికారాన్ని దుర్వినియోగించడం ద్వారా అభ్యర్థి నామినేషన్‌ను బీజేపీ రద్దు చేయించిందని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో లోక్‌సభ స్థానానికి ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థిగా ప్రజాపతి ఉంటారని తెలిపారు. మీరా యాదవ్ నామినేషన్ తిరస్కరణ పథకం ప్రకారమే జరిగిందని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ యాదవ్ ఆరోపించారు. భోపాల్‌లోని కాంగ్రెస్ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ రెండు పార్టీలు ప్రజాపతి గెలుపు కోసం కృషిచేస్తాయని చెప్పారు. ఫారంపై సంతకం లేకపోవడం, 2023 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రకారం అధికారిక ఓటరు జాబితా సమర్పించకపోవడంతో మీరా యాదవ్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. దీంతో ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోందని కాంగ్రెస్, ఎస్పీ ఆరోపించాయి. ఖజురహో నుంచి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, సిట్టింగ్ ఎంపీ వీడీ శర్మను బీజేపీ నిలబెట్టింది. ఈనెల 26న ఖజురహోలో ఎన్నికలు జరగనున్నాయి.

సమరాంగణం 2024

విజయనగరం నియోజకవర్గంలో

అభ్యర్థుల జోరు... అసమ్మతి పోరు

కోలగట్ల వీరభద్ర స్వామి

వైసీపీ అభ్యర్థి

సుంకరి సతీష్ కుమార్

కాంగ్రెస్ అభ్యర్థి

మీసాల గీత

టీడీపీ రెబల్

అదితి గజపతిరాజు

టీడీపీ అభ్యర్థి

ఒకప్పుడు టీడీపీ కంచుకోట... వర్తమానంలో వైసీపీ బావుటా... తాజా ఎన్నికలలో నువ్వా-నేనా ... ఇదీ విజయనగరం నియోజక వర్గ పరిస్థితి. ఈ నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా తెలుగు దేశం పార్టీకే మొగ్గు చూపారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ విజయపరంపర సాగించింది. 1978లో జనతా పార్టీ తరపు పోటీ చేసిన పూసపాటి అశోక గజపతి రాజు ఆ తర్వాత టీడీపీలో చేరి 1983 నుంచి 1999 వరకు అప్రతిహతంగా నిలిచారు. 2004లో స్వతంత్ర అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి చేతిలో గజపతిరాజు తొలిసారిగా ఓటమిని చవిచూశారు. క్రమంగా జిల్లాలో టీడీపీ ప్రభావం తగ్గింది. 2019 నాటికి తొమ్మిది నియోజకవర్గాలను కోల్పోయింది. తాజా ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గంలో బహుముఖ పోటీ ఉంది. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రుల హోరాహోరీ సాగే పరిస్థితి నెలకొంది. టీడీపీ - బీజేపీ- జనసేన కూటమి తరపున పూసపాటి అదితి గజపతిరాజు పోటీ చేయనున్నారు. 2019లో వైసీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి చేతిలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన అదితి 6,400 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే మీసాల గీత టీడీపీ తరపు పోటీ చేస్తారని భావించినా, పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు విజయనగరం ఎంపీగా బరిలోకి దిగడంతో ఆయన కుమార్తె అదితికి టికెట్ ఇచ్చారు. ప్రస్తుత అభ్యర్థిపై రాజకీయ పక్షాలలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. గజపతి రాజు ఈ ఎన్నికలలో విజయనగరం నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆయన ఆసక్తి చూపకపోవడంతో అదితి గజపతి రాజుకు టీడీపీ అవకాశమిచ్చింది. టీడీపీని నమ్ముకున్న మీసాల గీత టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో స్వతంత్రంగా బరిలోకి దిగుతున్నారు. చీపురుపల్లి అసెంబ్లీ స్థానం లేక విజయనగరం ఎంపీ స్థానాలలో ఏదో ఒక చోట తనకు అవకాశం అవస్తుందని గీత భావించారు. చీపురుపల్లి, విజయనగరం ఎంపీగా పోటీ అవకాశాలపై ఆశ పెంచినది టీడీపీ అధిష్ఠానమేనని గీత చెప్పారు. తనకు ఎక్కడా అవకాశం కల్పించకపోగా, కనీసం తనకు విషయం కూడా చెప్పలేదని మండిపడ్డారు. విజయనగరం నుంచి స్వతంత్రంగా పోటీ చేస్తానని మీసాల గీత ప్రకటించారు. ఇక వైసీపీ విషయానికొస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి మరోసారి పోటీకి సిద్ధమయ్యారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు విజయనగరం పట్టణాభివృద్ధి తన విజయానికి దోహదమవుతాయని భావిస్తున్నారు. ఆయన వ్యతిరేక వర్గం నిత్యం ఏదో ఒక ఆరోపణలతో కోలగట్లకు ఆటంకాలు కలిగించే ప్రయత్నాలు కొనసాగిస్తోంది. విజయనగరం పట్టణంలో వార్డులపై కోలగట్లతో పాటు ఆయన వ్యతిరేక వర్గం కూడా దృష్టి సారించడం విశేషం. కాంగ్రెస్ అభ్యర్థి సుంకరి సతీశ్ కుమార్ గట్టిపోటీకి సిద్ధమయ్యారు.

హోరాహోరీకి ప్రధాన పార్టీలు సిద్ధం

మొత్తం మీద అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థులకు అసమ్మతి నేతలు తలనొప్పిగా మారారు. రెండు పార్టీల వ్యూహ-ప్రతివ్యూహాలతో విజయనగరం నియోజకవర్గ ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

(విశాలాంధ్ర-విజయనగరం)

గ్లాసు గందరగోళం

జనసేన గాజుగ్లాసు గుర్తులో అంతా గందరగోళం... అయోమయం ఏర్పడింది. రాబోయే ఎన్నికల్లో జనసేన గుర్తును ఫ్రీ జోన్‌లో ఉంచడం, దానికితోడుగా గాజుగ్లాసు గుర్తుకు సమాంతరంగా బక్కెట్ గుర్తుతో నవరంగ్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ పోటీలోకి దిగడంతో జనసేన అభ్యర్థులకు కలవరం మొదలైంది. కాకినాడజిల్లా పిఠాపురం అసెంబ్లీ పోటీలో ఇద్దరు పవన్ కళ్యాణ్‌లు...మచిలీపట్నం లోక్‌సభ బరిలో ఇద్దరు బాలశౌరిలు...తెనాలి అసెంబ్లీకి ఇద్దరు మనోహర్‌లు పోటీలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీకి కొత్త చిక్కులు వస్తున్నాయి. ఆ పార్టీ గాజుగ్లాస్ గుర్తును పోలి ఉన్న బకెట్ గుర్తుతో నవరంగ్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బరిలోకి దిగడంతో జనసేన శ్రేణులకు దిక్కుతోచడంలేదు. ఓటర్లు పొరపాటున గ్లాస్‌కు బదులు బక్కెట్‌కు ఓట్లేసే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. గాజుగ్లాసు, బక్కెట్టు గుర్తులు రెండూ సరిసమానంగా పోలి ఉండటమే ఇక్కడ వచ్చిన ప్రధాన సమస్య. దీని నుంచి ఎలా బయటపడాలనేదీ ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలోని జనసేనను మూడు ప్రధాన సమస్యలు వెంటాడుతున్నాయి. ఒక్కటి ఆ పార్టీ గాజుగ్లాసు గుర్తును ఫ్రీ జోన్‌లో ఉంచడం. రెండోది ఆ పార్టీ గాజుగ్లాజు గుర్తును పోలిన నవరంగ్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ బక్కెట్ గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగడం. మూడోది జనసేన పార్టీ ప్రకటించిన అభ్యర్థుల పేర్లతోనే సరిసమానంగా నవరంగ్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లనూ ప్రకటించడం. అసలే ఎన్డీఏతో పొత్తుల కారణంగా జనసేన ఆశించిన దానికంటే అతి తక్కువగా 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ సీట్లనే కూటమి నుంచి సాధించింది. జనసేనకు 50 నుంచి 60 సీట్లు వస్తాయని, అధికారంలో భాగస్వామ్యం ఉంటుందని, పవన్ కల్యాణ్‌కు సగభాగం కాలం ముఖ్యమంత్రి పీఠం దక్కుతుందన్న కథనాలు వచ్చాయి. కూటమి పొత్తులతో జనసేనకు తగినన్ని సీట్లు రాకపోవడంతో వరుస వారీగా ఆ పార్టీని నేతలు వీడుతున్నారు. ఎక్కడైతే పవన్‌కు సొంత సామాజిక బలం ఉందన్న ఆశతో టీడీపీ, బీజేపీ పొత్తులకు దిగాయో, అక్కడే పూర్తిగా ఆ పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడింది. వరుస వారీగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిలు పార్టీకి గుడ్‌బై చెప్పడంతో పవన్ కల్యాణ్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. తుదకు ఆయన పోటీ చేసే పిఠాపురం అసెంబ్లీకి సైతం అక్కడి టీడీపీ నేత వర్మపైనే అన్ని ఆశలు పెట్టుకోవడం పవన్ బలహీనమైన నాయకత్వానికి అద్దం పడుతున్నదన్న విమర్శలున్నాయి. 2019 ఎన్నికల్లో గాజువాక, భీమవరం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పవన్ కల్యాణ్ పోటీ చేసి...రెండు చోట్లా ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికలలోనైనా ఎలాగైనా అసెంబ్లీలో అడుగెట్టాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. అందుకోసమే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనీయబోమని పొత్తులకు దిగగా, ఆయన పోటీ చేసే స్థానంపైనే గెలుపు దీమా లేకుండా పోయింది. ఇప్పుడు జనసేన గుర్తును పోలిన బకెట్ ఆ పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్నది. మరోవైపు పార్టీ గుర్తును ఫ్రీ జోన్‌లో ఉంచడమూ అభ్యర్థులకు నిద్రలేకుండా చేస్తోంది.

జనసేన పార్టీని కేవలం రిజిస్టర్ పార్టీగానే కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. గుర్తింపు పొందిన పార్టీల జాబితాలోకి జనసేన చేరలేదు. ఈ ఎన్నికల్లో జనసేన గుర్తును రద్దు చేయాలంటూ నవరంగ్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. జనసేనకే ఆ పార్టీ గాజుగ్లాజు గుర్తును హైకోర్టు కేటాయించింది. ఇక్కడే అసలు సమస్య వచ్చిపడింది. జనసేన కేవలం రిజిస్టర్ పార్టీగానే ఉన్నందున ఆ పార్టీ గాజుగ్లాసు గుర్తును ఫ్రీ జోన్ కేటగిరిలోకి వెళ్తున్నది. దీని ప్రకారం జనసేన పోటీ చేసే 21 అసెంబ్లీ స్థానాలు, 2 లోక్‌సభ (మచిలీపట్నం, కాకినాడ) స్థానాల వరకే ఈ గాజుగ్లాసు గుర్తు పరిమితమవుతుంది. మిగిలిన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇదే గాజుగ్లాసు గుర్తును ఎవరైనా స్వతంత్ర అభ్యర్థులు ఎంచుకోవచ్చు. ఎన్డీఏ కూటమిగా బీజేపీ, టీడీపీ, జనసేన పోటీ చేస్తున్నాయి. జనసేన పోటీ చేయకుండా ఆ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న టీడీపీ, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో గాజుగ్లాసు గుర్తును ఎవరైనా స్వతంత్ర అభ్యర్థులు కోరవచ్చు. అదే జరిగితే... జనసేన పార్టీ శ్రేణుల్లో కొందరికి పొత్తులపై సరిగ్గా అవగాహన లేక, గాజుగ్లాసు గుర్తు అంటే జనసేనగా భావించి, ఆ స్వతంత్ర అభ్యర్థికి ఓట్లు వేయవచ్చు. బయట బ్యానర్లు, ఫ్లెక్సీలలో గాజు గ్లాసు గుర్తు చిన్నదిగాను, బక్కెట్టు గుర్తు పెద్దదిగాను ఉంటాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లలో మాత్రం గాజుగ్లాసు గుర్తు, బక్కెట్ గుర్తు సరిపోలి ముద్రించి ఉంటాయి. దీంతోపాటు జనసేన ప్రకటించిన అభ్యర్థుల పేర్లకు సమానంగా, నవరంగ్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి అదే పేర్లతో అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఓటర్లు పొరపాటున ఆ పేర్ల ఆధారంగా గాజుగ్లాసుకు వేయబోయి...బక్కెట్ గుర్తుకు ఈవీఎం మీటలపై ఓట్లు నొక్కే అవకాశాలున్నాయి. ఇప్పటికే తమను పోటీ నుంచి విరమించాలంటూ నవరంగ్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నేతలకు జనసేన నుంచి బెదిరింపులు వచ్చాయని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో జనసేనకు ముప్పేటా గండం నెలకొంది. గాజుగ్లాసుకు ఫ్రీ జోన్ ఇవ్వడం, గ్లాసు గుర్తుకు సమానంగా బక్కెట్ గుర్తు రావడం, జనసేన అభ్యర్థులు ప్రకటించిన పేర్లతోనే నవరంగ్ నేషనల్ పార్టీ అభ్యర్థులూ పోటీ చేయడం వెరసి జనసేన గుర్తు గందరగోళంగా మారింది.

ఫ్రీ జోన్ గుర్తుగా ఈసీ కేటాయింపు

నవరంగ్ కాంగ్రెస్‌కు 'బక్కెట్'

పిఠాపురం బరిలో ఇద్దరు పవన్ కల్యాణ్‌లు !

జనసేన అభ్యర్థుల కలవరం

(విశాలాంధ్ర బ్యూరో-అమరావతి)

CPI సీపీఐ అభ్యర్థులు

తిరుపతి

పి.మురళి

తిరుపతి శాసనసభా నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పి.మురళి పోటీచేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐరాల మండలం పుత్రమద్ది గ్రామంలో పెద్దగంగిశెట్టి కన్నయ్య సుబ్బమ్మ దంపతులకు నలుగురు సంతానం. వారికి ఇద్దరు కొడుకులు, కూతుళ్లు ఉండగా మురళి ద్వితీయ పుత్రుడు. వెనుక బడిన వర్గానికి చెందిన మురళి అంచెలంచెలుగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి స్థాయికి చేరుకున్నారు. 1987లో జీవనోపాధి కోసం తిరుపతికి వచ్చారు. బాడుగకు రిక్షా తీసుకుని జీవనోపాధి పొందేవారు. కొంత కాలం తరువాత మార్కెట్‌లోకి ఆటోలు రావడంతో రిక్షా బాడుగలు తగ్గి ఆటోలకు ఆదరణ పెరిగింది. దీంతో ఆటో నడుపుతూ కొంతకాలం జీవనం సాగించారు. 1994లో ఏఐటీయూసీ నాయకుల పరిచయంతో యునియన్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగి ఆటో యునియన్ పట్టణ, జిల్లా నాయకుడయ్యారు. ఆపై ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. ప్రజా సంఘాల నిర్మాణం చేపడుతూ జిల్లాలో ఏఐటీయూసీని ఒక బలమైన కార్మిక సంఘంగా తయారు చేశారు. సీపీఐలో చురుకుగా ఉంటూ పార్టీ విస్తరణకు కృషిచేశారు. ఫలితంగా జిల్లాల విభజన అనంతరం సీపీఐ తిరుపతి జిలా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తాజా సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున సీపీఐ అభ్యర్థిగా తిరుపతి అసెంబ్లీకి మురళి పోటీచేస్తున్నారు.

విశాఖలో ధన రాజకీయాలు

బొత్స ఝాన్సీ లక్ష్మీ

శ్రీ భరత్

అవంతి శ్రీనివాస్

గంటా శ్రీనివాసరావు

విశాఖ జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారుతుంది. సాగర తీరంలో ఎన్నికల వేడి వేడెక్కింది. అన్ని పార్టీల సభలకు జనసంద్రంగా వస్తున్నప్పటికీ ఓటర్ నాడి అభ్యర్థులకు అంతు పట్టడం లేదు. విశాఖలో ధన రాజకీయాలు కెరటాలులా ఎగిసిపడుతున్నాయి. ఈ జిల్లాలో పోటీ చేసిన అభ్యర్థులంతా భారీగా ధనవంతులే. మూడు రాజధానుల ముచ్చటతో విశాఖలో అధికార వైసీపీ ప్రచారం విస్తృతంగా నిర్వహిస్తుండగా, రాష్ట్రంలో వైసీపీ విధ్వంసం, ప్రజా వ్యతిరేక విధానాలపై టీడీపీ కూటమి అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, రాజధాని పేరిట విశాఖలో భూముల ఆక్రమణతో పాటు వైసీపీ నేతలు వారి అనుచరులకు దారాదత్తం చేయడంపై విశాఖ ప్రజలు త్వరలో జరగనున్న ఎన్నికల్లో తమ తీర్పును వెల్లడించనున్నారు. రిషికొండ విధ్వంసం, విశాఖలో శాంతి భద్రతలు, పడకేసిన పర్యాటకం, తరలిపోయిన పరిశ్రమలు, ఐటీ, విద్యా, వైద్య రంగాల్లో నెలకొన్న సందిగ్ధత పై ఈ ఎన్నికలు తీవ్రంగానే ప్రభావితం చేయనున్నాయి. విశాఖ జిల్లాలో గాజువాక హౌస్ కమిటీ భూ సమస్య, సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల భూ సమస్య, నగరాన్ని పట్టిపీడిస్తున్న కాలుష్యం మహమ్మారి తోపాటు నగరంలో ఉన్న మురికివాడల అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజలు చైతన్యవంతంగా ఈసారి ఎన్నికల్లో ప్రజా సేవ చేసే వారికే ఓట్లు వేస్తారని చెప్పక తప్పదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళ, కార్మిక, ఉద్యోగ , ఉపాధ్యాయ, అసంఘటిత రంగ కార్మికులంతా ఏకమై పెరిగిన ధరలకు, పడుతున్న ఇబ్బందులకు, ఉపాధి రంగాలను ధ్వంసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించేందుకు సన్నద్ధమవుతున్నారు.

పార్లమెంట్ పోటీలో మంత్రి బొత్స సతీమణి

టీడీపీ అభ్యర్థిగా బాలకృష్ణ చిన్నల్లుడు శ్రీ భరత్

భీమిలిలో మాజీ మంత్రుల మధ్య పోటాపోటీ

ఎన్నో పోరాటాలు, ఎందరో ఆత్మబలిదానాల ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న మొండిపట్టుదలతో ఉన్న బీజేపీతో జత కట్టిన టీడీపీ, జనసేన అభ్యర్థులను ఓడించాలని, రాష్ట్రంలో వైసీపీ అవినీతి విధ్వంసకర పాలనకు చరమగీతం పాడాలని వామపక్షాలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన విశాఖ జిల్లాలో పూర్తిగా ఆరు నియోజకవర్గాలు ఉండగా, పెందుర్తి నియోజకవర్గం కొంత భాగం విశాఖ జిల్లాలో మరి కొంత భాగం అనకాపల్లి జిల్లాలో ఉంది. విశాఖ జిల్లాలో ప్రధానంగా భీమిలి, గాజువాక నియోజకవర్గాల్లో ఉత్కంఠ పోటీ నెలకొంది. ఈ నియోజకవర్గాల్లో మంత్రులుగా పని చేసిన వారే పోటీలో ఉండడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

భీమిలీలో గురుశిష్యుల మధ్య పోటీ

భీమిలి అసెంబ్లీ నియోజకవర్గంలో గురు శిష్యులుగా ఉన్న వారే పోటీలో ఉండడం విశేషం. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి టికెట్ ఇప్పించి భీమిలి నుంచి అవంతి శ్రీనివాసును పోటీ చేయించిన గంటా శ్రీనివాసరావు గురుశిష్యులుగా పదేళ్లు ఒకే పార్టీలో కొనసాగారు. తర్వాత టీడీపీలో చేరిన ఇదరూ మంచి స్నేహితులుగా, వ్యాపార బంధువులుగా గురు శిష్యులుగానే ఉన్నారు. 2014 లో టీడీపీ అనకాపల్లి ఎంపీగా అవంతి శ్రీనివాస్ గెలుపొందారు. 2019 ఎన్నికలకు ముందు ఎంపీగా ఉంటూ వైసీపీలో చేరిన అవంతి 2019 ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రి అయ్యారు. తర్వాత వీరిద్దరూ చెరోపార్టీలో ఉన్నప్పటికీ గురు శిష్యులుగానే ప్రచారం సాగుతోంది. తాజా ఎన్నికల్లో భీమిలి నుంచి ఇద్దరూ ప్రత్యర్థులుగా పోటీ పడడం విశేషమే.

గంటా శ్రీనివాసరావు గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్లు మంత్రిగా పనిచేశారు. ఎన్డీయే కూటమిలో అసమ్మతి ఇంకా చల్లారలేదు. జనసేన నుంచి టికెట్ ఆశించిన పంచకర్ల సందీప్, ఐదేళ్లు టీడీపీకి నియోజకవర్గ ఇన్చార్జిగా కేడర్ ను కాపాడుకుంటూ వచ్చిన కోరాడ రాజబాబుకు టికెట్ దక్కకపోవడంతో వీరంతా గంటా గెలుపునకు ఏ మేరకు సహకరిస్తారోనని కూటమిలో ఉత్కంఠ నెలకొంది. నగరానికి అత్యంత విలువైన భూములు ఈ నియోజకవర్గంలోనే ఉండడంతో ఈ నియోజకవర్గంలో గెలుపు కోసం రెండు పార్టీలు తీవ్రంగానే శ్రమిస్తున్నాయి.

విశాఖ పార్లమెంట్‌పై బొత్స కన్ను

ఈసారి విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీ లక్ష్మిని వైసీపీ అభ్యర్థిగా పోటీలో నిలిపింది. ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల్లో బొత్స పెత్తనం అధికమైన నేపథ్యంలో విశాఖ జిల్లాలో ప్రత్యక్ష రాజకీయాల ద్వారా పెత్తనాన్ని మరింత పెంచేందుకే తన భార్యను ఎంపీ అభ్యర్థిగా దింపారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే బొత్స కుటుంబంలో ఐదుగురు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. అన్నదమ్ములు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేస్తుండగా, ఆయన సతీమణి విశాఖ ఎంపీగా పోటీ చేయడంపై అటు వైసీపీ వర్గాల్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. టీడీపీ నుంచి మరోసారి గీతం విద్యాసంస్థల అధినేత , సినీ నటుడు బాలకృష్ణ చిన్నల్లుడు అయిన శ్రీ భరత్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గా పోటీచేసిన ఎం శ్రీ భరత్ 4,414 ఓట్లతో ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో జనసేన నుంచి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పోటీ చేయడంతోనే త్రిముఖ పోటీలో శ్రీ భరత్ ఓటమిపాలయ్యారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

(విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం)